Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 | సంచిక : 147 | మేడ్చల్ మల్కాజ్‌గిరి | 18 జూన్ 2023 | ఆదివారం | పేజీలు : 4

### ఆధార్‌పై యూఐడీఏఐ కీలక ప్రకటన

న్యూఢిల్లీ: గడువు ముగిసిపోవడంతో ఉచితంగా ఆధార్ అప్‌డేట్ చేయించుకోలేకపోయామే అనుకునేవారికి గుడ్‌న్యూస్. ఆధార్ ఉచిత అప్‌డేట్ గడువు తేదీని యూఐడీఏఐ పొడగించింది. జూన్ 14 నుంచి సెప్టెంబర్ 14వ తేదీ వరకు పెంచింది. దీంతో మూడు నెలలపాటు గడువిచ్చినట్టయ్యింది. కాగా గుర్తింపు వివరాలు, అడ్రస్ డాక్యుమెంట్స్ వంటి వివరాలను ఉచితంగా అప్‌డేట్ చేసుకునేందుకు 15 మార్చి 2023 నుంచి జూన్ 14, 2023 వరకు యుఐడీఏఐ అవకాశమిచ్చింది. యూఐడీఏ వెబ్‌సైట్ డేటా ప్రకారం.. " దయచేసి.. కచ్చితమైన సమాచారంతో ఆధార్ అప్‌డేట్ ప్రక్రియను కొనసాగించండి. అప్‌డేట్ కోసం గుర్తింపు ప్రూఫ్, అడ్రస్ డాక్యుమెంట్లను అప్‌లోడ్ చేయండి" అని సూచించింది.

# వరంగల్‌కు మళ్లీ పూర్వవైభవం తీసుకొస్తాం



## మెగావన్ టెక్స్‌టైల్ పార్కుకు శంకుస్థాపన్ చేసిన మంత్రి కేటీఆర్

వరంగల్: నల్లబంగారంతోపాటు తెల్ల బంగారం కూడా మన దగ్గర ఉందని మంత్రి కేటీఆర్ అన్నారు. మన రాష్ట్రంలో పండే పత్తి దేశంలోనే నాణ్యమైనదని చెప్పారు. నైపుణ్యం కలిగిన కార్మికులు మన దగ్గర ఉన్నారని తెలిపారు. దేశంలో అతిపెద్ద టెక్స్‌టైల్ పార్కు కాకతీయ టెక్స్‌టైల్ పార్కని చెప్పారు. వరంగల్‌కు మళ్లీ పూర్వ వైభవం తీసుకొస్తామన్నారు. వరంగల్‌లోని శాయంపేటలో ఉన్న కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో యంగ్ వన్ కంపెనీ వస్త్ర పరిశ్రమకు మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ.. ఇక్కడ ఏర్పాటుచేసే కంపెనీల్లో 99 శాతం ఉద్యోగాలు స్థానికులకే దక్కుతాయన్నారు. యంగ్‌వన్ కంపెనీతో వేల మందికి ఉద్యోగ అవకాశాలు వస్తాయన్నారు. దేశంలో వ్యవసాయం, టెక్స్‌టైల్ రంగంలో ఉపాధి అవకాశాలు ఎక్కువని వెల్లడించారు. వరంగల్ జిల్లాలో నంబర్ వన్ పత్తి పండుతుందని మంత్రి కేటీఆర్ అన్నారు. అంతర్జాతీయ స్థాయిలో టెక్స్‌టైల్ పార్కు ఉండబోతున్నదని చెప్పారు. జిల్లాకు మరిన్ని పరిశ్రమలు తెస్తామన్నారు. ఇప్పటికే గణేశా కంపెనీ రూ.600 కోట్లు పెట్టుబడి పెట్టిందన్నారు. కంపెనీలో వెయ్యి మందికి ఉద్యోగాలు వచ్చాయని తెలిపారు. యంగ్ వన్ కంపెనీ మొత్తం 11 పరిశ్రమలు ఏర్పాటు చేస్తుందని చెప్పారు. దీనిద్వారా వేల ఉద్యోగావకాశాలు కలుగుతాయన్నారు. ఇక్కడ నిర్మించే పరిశ్రమల్లో 99 శాతం ఉద్యోగాలు స్థానికులకే వస్తాయన్నారు. వరంగల్ జిల్లాలో వచ్చే మూడు కంపెనీల వల్ల 33 వేల మందికి ఉద్యోగాలు వస్తున్నాయని చెప్పారు. ఉద్యోగాల్లో మహిళలకు ప్రాధాన్యం ఇస్తామన్నారు. మేడ్ ఇన్ ఇండియా, మేడ్ ఇన్ పరకాలగా మారుతుందని చెప్పారు. వరంగల్‌లో తయారయ్యే దుస్తులు విదేశాలకు ఎగుమతి అవుతాయన్నారు. పీఎం మిత్ర పథకానికి కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు మోడల్‌గా మారిందని కేటీఆర్ చెప్పారు. సీఎం కేసీఆర్ ఆలోచనలు కేంద్రానికి మార్గదర్శకం అయ్యాయని తెలిపారు. వరంగల్ కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు దేశానికే దిక్సూచిగా మారిందన్నారు. దేశంలోని మున్సిపల్, పంచాయతీ అవార్డుల్లో 30 శాతం మనవేనని చెప్పారు. 3 శాతం జనాభా ఉన్న రాష్ట్రానికి 33 శాతం అవార్డులు వస్తున్నాయన్నారు. భివృద్ధి, సంక్షేమంలో దేశానికి తెలంగాణ దిక్సూచిగా మారుతున్నదని చెప్పారు. ఐదేండ్లు మీ కోసం కష్టపడ్డామని, ఇప్పుడు మీరు మాకు అండగా ఉండాలన్నారు. పరకాలలో ధర్మారెడ్డిపై పోటీచేయాలంటే ప్రతిపక్షాలు భయపడుతున్నాయని, నియోజకవర్గాలు మార్చుకుని మరీ వేరేచోటకు వెళ్లిపోతున్నారని చెప్పారు. కాకతీయ టెక్స్‌టైల్ పార్కుకు భూములు ఇచ్చిన రైతులకు పాదాభివందనం చేస్తున్నాని వెల్లడించారు. నవంబర్, డిసెంబర్?లో జరిగే ఎన్నికల్లో బీఆర్ఎస్ ఘన విజయం సాధిస్తుందని, కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం అవుతారని స్పష్టం చేశారు. అభివృద్ధిలో తెలంగాణ నంబర్ వన్ స్థానంలో ఉందని యంగ్ వన్ కంపెనీ చైర్మన్ చాంగ్ జాయ్ బొక్ అన్నారు. వరంగల్‌లో వస్త్ర పరిశ్రమను ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందని చెప్పారు. యంగ్ వన్ కంపెనీ లక్ష్యం నెరవేరాలని కోరుకుంటున్నామని తెలిపారు. కొంతమంది మూరు?లు టెక్స్‌టైల్ పార్కుపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. కాకతీయ మెగా టెక్స్‌లై పార్కు ప్రపంచంలోనే నంబర్ వన్ కంపెనీ అవుతుందన్నారు. వరంగల్ ప్రజల రుణం తీర్చుకుంటామని చెప్పారు.




**తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యుల నియామక తీరును హైకోర్టు తప్పుపట్టింది. టీఎస్‌పీఎస్సీ సభ్యులు రమావత్ ధన్ సింగ్, టి. సుమిత్ర ఆనంద్ కారం రవీందర్ రెడ్డి, బండి లింగారెడ్డి, డాక్టర్ ఆరవిల్లి చంద్రశేఖర్రావు ఆర్. సత్యనారాయణ నియామకాలను పునఃసమీక్షించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. మూడు నెలల్లో కసరత్తు పూర్తి చేయాలని ఉత్తర్వులు జారీ చేసింది.**

# కాంగ్రెస్ - బీఆర్ఎస్ అసంతృప్తులు






హైదరాబాద్ : అధికార బీఆర్ఎస్ పార్టీలోని అసంతృప్తులు టికెట్లు రావని అనుకుంటున్న గట్టి నేతలపై కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా దృష్టిపెట్టింది. రాబోయే ఎన్నికల్లో ఎలాగైనా కేసీయార్ ను దెబ్బకొట్టడమే టార్గెట్ గా ప్లాన్ చేస్తున్న కాంగ్రెస్ బలమైన నేతలకు గాలమేస్తోంది. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీకి 70 నియోజకవర్గాల్లో బలమైన అభ్యర్థులున్నారట. అంటే మిగిలింది 39 నియోజకవర్గాల్లో గట్టి అభ్యర్థులు కావాలి. మొత్తం 119 నియోజకవర్గాల్లో ఎలాగైనా 70 సీట్లలో గెలవాలన్నది కాంగ్రెస్ టార్గెట్. 70 నియోజకవర్గాల్లో గెలవాలంటే కచ్చితంగా అన్నీ నియోజకవర్గాల్లోను బలమైన అభ్యర్థులను రంగంలోకి దింపక తప్పదు. ఇప్పటికిప్పుడు కాంగ్రెస్ కు 39 సీట్లలో గట్టి అభ్యర్థులు లేరని అంచనా. అందుకనే బీఆర్ఎస్ నేతలపైన కన్నేసింది. రాబోయే ఎన్నికల్లో వివిధ కారణాలతో కేసీయార్ మంత్రులు ఎంఎల్ఏలకు టికెట్లు ఇవ్వరని కాంగ్రెస్ బలంగా నమ్ముతోంది. అలాంటి వాళ్ళని ముందుగానే పసిగట్టి మాట్లాడుకుని టికెట్ల హామీ ఇవ్వటం ద్వారా బలమైన నేతలను ఆకర్షించవచ్చని ప్లాన్ చేస్తోంది. బీఆర్ఎస్ నుండి బయటకు వచ్చిన పొంగులేటి శ్రీనివాసులరెడ్డి జూపల్లి కృష్ణారావు లాంటి బలమైన నేతలను పార్టీలో చేర్చుకోవాలని ప్రయత్నాలు చేస్తోంద. వీళ్ళని ఇప్పటికే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధిలో మాట్లాడించారట. అంటే డైరెక్టుగా రాహుల్ ద్వారానే వీళ్ళకు కావాల్సిన హామీలిప్పిస్తే కాంగ్రెస్ పై నమ్మకం పెరుగుతుందన్నది పార్టీ ఆలోచన. నిజంగానే పొంగులేటి గనుక కాంగ్రెస్ లో చేరితే పార్టీకి చాలా అడ్వాంటేజ్ అవుతుందనటంలో సందేహంలేదు. ఇలాంటి మరికొద్దిమంది నేతలకు కూడా కాంగ్రెస్ గాలమేస్తోంది. పీసీసీ ప్రెసిడెంట్ రేవంత్ రెడ్డి ప్లాన్ వర్కవుటైతే తొందరలోనే మరికొంతమంది బలమైన నేతలు బీఆర్ఎస్ లో నుండి బయటకు వచ్చేసే అవకాశాలున్నాయి. మరి వీళ్ళల్లో కాంగ్రెస్ ఎంతమందికి టికెట్లివ్వగలదు ? టికెట్లు తెచ్చుకున్న వాళ్ళల్లో ఎంతమంది గెలుస్తారన్నది ఆసక్తిగా మారింది. మొత్తం మీద తెలంగాణాలో అన్నీ పార్టీలు ఎదుటిపార్టీలను చీల్చటంపైనే ఎక్కువగా దృష్టిపెట్టినట్లు అర్థమైపోతోంది. ఎన్నికలు దగ్గరకు వస్తున్న కొద్దీ ఈ చీల్చటాలు బాగా ఎక్కువైపోయినా ఆశ్చర్యపోవక్కర్లేదు. చివరకు ఎవరు గెలుస్తారు ? ఎవరు ఓడుతారనేది చూడాలి.



## బీఆర్ఎస్ - బిజెపి పొలిటికల్ వార్

# చల్లబడిందా!?

## కేసీఆర్ పై రివర్సు గేర్ కు నో చెప్పిన బీజేపీ హైకమాండ్?

హైదరాబాద్ : దాల్ మే కుచ్ కాలా హై? అన్న మాట ఇప్పుడు తెలంగాణ రాజకీయ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది. మొన్నటి వరకు ఉప్పు నిప్పుగా అన్నట్లుగా బీఆర్ఎస్ – బీజేపీ నేతల మధ్య నడిచిన పొలిటికల్ వార్ ఉన్నట్లుండి తగ్గిపోవటం హాట్ టాపిక్ గా మారింది. కేంద్రంలోని మోడీ సర్కారుతో కేసీఆర్ ప్రభుత్వానికి లెక్కలు కుదిరాయని.. వారి ప్రయోజనాలకు గులాబీ బాస్ కేసీఆర్ ఓకే చెప్పటంతో.. మోడీ అండ్ కో గులాబీ పార్టీపై పోరు విషయంలో వెనక్కి తగ్గిందన్న మాట బలంగా వినిపిస్తున్న సంగతి తెలిసిందే. ఈ వాదనకు బలం చేకూరే పరిణామాలు ఇప్పుడు ఎక్కువ అవుతున్నాయి. గడిచిన తొమ్మిదేళ్ల తమ ప్రభుత్వం సాధించిన విజయాలపై కేసీఆర్ సర్కారు దశాబ్ది ఉత్సవాల పేరుతో భారీ ఎత్తున సంబరాలు చేస్తున్న సంగతి తెలిసిందే. అయితే.. ఈ ఉత్సవాలకు బలమైన కౌంటర్ ఇవ్వాలని తెలంగాణ బీజేపీ నేతలు భావించారు.

అందుకు తగ్గట్లే.. కొన్ని కార్యక్రమాలకు సంబంధించిన రూట్ మ్యాప్ ను సిద్ధం చేశారు. కేసీఆర్ సర్కారు చెబుతున్న వాదనలకు.. చేస్తున్న ప్రచారాలకు రివర్సుగేరులో కౌంటర్ ఇచ్చేందుకు బండి అండ్ కో సిద్ధమయ్యారు. అయితే.. కేసీఆర్ సర్కారు వైఫల్యాల మీద పోరుకు కౌంటర్లు ఇవ్వాల్సిన అవసరంలేదన్న మాట బీజేపీ అధినాయకత్వం నుంచి సమాచారం వచ్చినట్లుగా చెబుతున్నారు. దానికి బదులుగా తొమ్మిదేళ్ల మోడీ పాలనలో సాధించిన విజయాలను 'మహా జనసంపర్క్ అభియాన్' లో ప్రజల ముందుకు తీసుకెళ్లాలని చెబుతున్నారు. ఈ సందర్భంగా మోడీ సర్కారు చేసిన మంచి పనులు చెప్పాలే తప్పించి.. కేసీఆర్ సర్కారు వైఫల్యాల గురించి మాత్రం ప్రస్తావించొద్దన్న మాట వినిపిస్తోంది అదే జరిగితే.. కేసీఆర్ సర్కారు పాలనా లోపాల గురించి మాట్లాడేదెవరు? అన్నది ప్రశ్నగా మారింది. దీనికి కాంగ్రెస్ సమాధానంగా మారుతుందని.. అదే జరిగితే.. వచ్చే ఎన్నికలు బీఆర్ఎస్ వర్సెస్ బీజేపీగా కాకుండా కాంగ్రెస్ఆ చోటును ఆక్రమించటం ఖాయమంటున్నారు. మొన్నటివరకు బీఆర్ఎస్ పై నిప్పులు చెరిగి.. ఇప్పుడు అందుకు భిన్నంగా వ్యవహరించటం అంటే.. కమలనాథులు ఇబ్బందుల్ని కొని తెచ్చుకోవటమే అవుతుందన్న మాట వినిపిస్తోంది. గల్లీలో కుస్తీ చేస్తూ.. ఢిల్లీలో దోస్తీ చేయటం సాధారణ కార్యకర్తలు జీర్ణించుకోలేని పరిస్థితిలో ఉన్నారని.. ఇదే జరిగితే.. పార్టీకి తీవ్రమైన నష్టం వాటిల్లుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇప్పటికే కాంగ్రెస్ నేతలు బీఆర్ఎస్ – బీజేపీల మధ్య తెర వెనుక దోస్తీ ఉందన్న వాదనలు జోరుగా సాగుతున్న వేళ.. ప్రజల్లో ఇలాంటి భావనలకు నమ్మకం కలిగేలా తాజా పరిస్థితులు ఉన్నాయంటున్నారు.

మొత్తంగా సమ్ థింగ్ తేడా అన్న మాట రాజకీయ వర్గాల్లో వినిపిస్తూ ఉండటం గమనార్హం.

## సంపాదకీయం

### చైనా లో జనాభా పెంచేందుకు తిప్పలు

పొరుగు దేశం చైనా లో జనాభా సంఖ్య తగ్గుతూ వస్తున్నది. జనాభా తగ్గుదల కు కారణాలు అనేకం ఉన్నాయి. ఈ జనాభా పెంచేందుకు చైనా ప్రభుత్వం కొత్త కొత్త చట్టాల ను రూపొందిస్తున్నది. ఇప్పటికే ఒకే బిడ్డ విధానాన్ని సడలించింది. అలాగే పలు పన్ను రాయితీలు ప్రకటించింది. అయినా.. జనాభా పెరుగకపోవడంతో మరో కొత్త నిర్ణయాలు తీసుకుంది. ఇప్పటికే పిల్లల ను కనే వారికి అనేక సంక్షేమ పథకాల ను ప్రవేశ పెట్టింది. అయినప్పటికీ యువత ముందుకు రావడం లేదని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో చైనా లో జనాభా పెరుగుదల కు ఏకంగా 16 పునరుత్పత్తి కేంద్రాల ను ఏర్పాటు చేయడానికి బీజింగ్ ప్రభుత్వం సిద్ధ పడింది. అత్యాధునిక సాంకేతికతతో కూడిన కేంద్రాల ను జులై 1 నుంచి ప్రారంభించనున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. చైనా లో జనాల రేటు ను పెంచేందుకు ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇక వచ్చే నెల 1వ తేదీ నుంచి నగరంలో 16 రకాల సహాయక పునరుత్పత్తి కేంద్రాల ను ప్రారంభించనుంది. ఇన్-విట్రో ఫెర్టిలైజేషన్ ఎంబ్రియో ట్రాన్స్‌ప్లాంటేషన్ గడ్ డకట్టడం వీర్యాన్ని నిల్వ చేయడం వంటి కొన్ని చికిత్సలు ప్రాథమిక బీమా కింద చేర్చబడతాయని బీజింగ్ మున్సిపల్ మెడికల్ ఇన్సూరెన్స్ బ్యూరో డిప్యూటీ డైరెక్టర్ డు జిన్ తెలిపారు. గత 60 ఏళ్లలో చైనా లో జనాభా మరింత తగ్గిపోయింది. దీని తో చైనా ప్రభుత్వం ఈ చర్యల ను చేపట్టింది. నవజాత శిశువుల సంఖ్య గత సంవత్సరం రికార్డు స్థాయిలో 1000 మందికి 6.77కి పడిపోయింది అని తేలింది. 2023లో ఇది మరింత తగ్గుతుందని అంచనా వేస్తున్నారు. సంతానోత్పత్తి రేటును పెంచడానికి మద్దతు ఇచ్చే విధానాల పై చైనా జాతీయ ఆరోగ్య కమిషన్ గత ఆగస్టులో ప్రావిన్సుల కు మార్గదర్శకాలను జారీ చేసిన విషయం తెలిసింది.

దేశవ్యాప్తంగా ఉన్న అవివాహిత మహిళలు తప్పనిసరి గా వివాహం చేసుకోవాలనే జాతీయ నియమం కారణంగా ఐవీఎఫ్ గుడ్డు ఫ్రీజింగ్ టెక్నాలజీల వంటి సంతానోత్పత్తి చికిత్సలను పొందడం కష్టంగా మారింది. ఈ నేపథ్యంలో నైరుతి సిచు వాన్ ప్రావిన్స్ లోని కొన్ని ప్రైవేట్ క్లినిక్లు ఇప్పటికే పడిపోతున్న జననాల కారణం గా ఐవీఎఫ్‌ని అనుమతించడం ప్రారంభించాయి. ఇలా మొత్తానికి చైనా జనాభా పెంచేందుకు ముప్పు తిప్పలు పడుతోంది.

# మెరుగైన విద్య.. సాంకేతిక పాఠం..!

సిద్దిపేట : అందివచ్చిన అవకాశాలు సద్వినియోగం చేసుకుంటే.. మెరుగైన ఫలితాలు సాధించవచ్చు. సాంకేతిక నైపుణ్యాన్ని వినియోగించుకుంటే.. పదుగురిలో ప్రత్యేకంగా నిలిచేందుకు అవకాశం ఉంటుంది. ఆ దిశగా సిద్దిపేటలోని ఇందిరానగర్ జడ్పీ ఉన్నత పాఠశాల ముందుకు సాగుతోంది. ఇప్పటికే ఈ అన్నింటా ఆదర్శంగా నిలిచింది. ప్రవేశాల విషయంలోనూ నో అడ్మిషన్లు అంటూ బోర్డు పెడుతుంటారు. సిద్దిపేట జిల్లాలోనే అత్యధిక విద్యార్థులు ఇందులోనే చదువుకుంటున్నారు. ఈ క్రమంలో సాంకేతికత బోధనకు ప్రత్యేకంగా యాప్‌ను సైతం అందుబాటులోకి తీసుకురానుండటం విశేషం. ఈ నేపథ్యంలో దాని వల్ల కలిగే ప్రయోజనాలు, తదితర అంశాలపై ప్రత్యేక కథనం.బోధనలో పలు మార్పులకు కేంద్రం శ్రీకారం చుట్టింది. ఈ క్రమంలో అభ్యసన నిర్వహణ వ్యవస్థ (లెర్నింగ్ మేనేజ్‌మెంట్ సిస్టం)కు సాంకేతికతను జోడిస్తూ జియో సంస్థ నేతృత్వంలో ఇటీవల ఓ డిజిటల్ ప్లాట్‌ఫాం అందుబాటులోకి తీసుకురావడం విశేషం. అదే ఎంబైబ్ (%embibe%) యాప్. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను భాగస్వాములను చేసే ఈ-యాప్.. బహుముఖ ప్రయోజనకారిగా మారనుంది.

40 పాఠశాలల్లో ఒకటి..జాతీయ నూతన విద్యా విధానంలో డిజిటల్ విద్యకు ప్రాధాన్యం సంతరించుకుంది. జాతీయస్థాయిలో జియో సంస్థ ఎంబైబ్ యాప్‌ను పలు పాఠశాలల్లో అందుబాటులోకి తెచ్చింది. దేశ వ్యాప్తంగా 40 పాఠశాలలను ఎంపిక చేయగా.. తెలంగాణ రాష్ట్రం నుంచి ఒకే ఒక్కటిగా ఇందిరానగర్ జడ్పీ ఉన్నత పాఠశాల నిలిచింది. జాతీయ స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం పొందిన బడుల ప్రాతిపదికగా ఎంపిక చేశారు. ఈ డిజిటల్ విద్యను అందుకోవాలంటే ఒక విద్యార్థికి రూ.60 వేల నుంచి రూ.70 వేల వరకు ఖర్చవుతుంది. కార్పొరేట్ స్థాయిలో కూడా అరుదుగా అందుబాటులో ఉంటుంది. ఈ పాఠశాలలో ఉచితంగా అందుబాటులోకి తేవడం ద్వారా ఆరు నుంచి పదో తరగతి వరకు చదివే 1,212 మందికి సాంకేతికత తోడుగా దూసుకెళ్లేందుకు దోహదం చేయనుంది. పోటీ పరీక్షలకు (ఐఐటీ, నీట్) చక్కటి పునాది కానుంది. ప్రతి విద్యార్థికి స్థాయి ఆధారిత విషయాలను బోధించవచ్చు. వ్యక్తిగత అభ్యసన అభివృద్ధికి దోహదం చేయనుంది.

నాలుగు అంశాల్లో..ఈ యాప్‌లో నాలుగు స్థాయిలు ఉంటాయి. చరవాణి, డిజిటల్ తరగతుల వేదికగా యాప్ సేవలు అందుబాటులోకి తెస్తారు. కృత్రిమ మేధ సాయంతో పని చేస్తుంది. తొలుత గణితం, సాంఘిక, సామాన్యశాస్త్రం సంబంధిత అంశాలు అందుబాటులోకి తెచ్చారు. రానున్న రోజుల్లో మిగిలిన సబ్జెక్టులను యాప్‌లో సంస్థ ప్రతినిధులు జత చేయనున్నారు.స్టూడెంట్ లాగిన్: నిర్దేశిత సబ్జెక్టుల్లో ఎలాంటి సందేహాలు ఉన్నా నివృత్తి చేసుకోవచ్చు. విద్యార్థి లాగిన్ అయిన తర్వాత విభాగాల వారీగా అంశాలను వినొచ్చు. దృశ్య, శ్రవణ రూపాల్లో పాఠాలు అందుబాటులో ఉంటాయి. తద్వారా పరీక్షలు రాయొచ్చు. ఫలితాల ఆధారంగా విద్యార్థి స్థాయిని ఈ యాప్ నిర్ధారిస్తుంది. ప్రాథమిక స్థాయి మొదలు వెనుకబడిన అంశాలను గుర్తిస్తుంది. ఈ మేరకు ఆయా వాటిని అందుబాటులోకి తెస్తుంది. ఆన్‌లైన్ పాఠాల మాదిరి యాప్ ద్వారా వినొచ్చు.టీచర్: సంబంధిత యాప్ బోధనకు ఉపకారిగా ఉంటుంది. ఉపాధ్యాయులు అంశాలు చెప్పే క్రమంలో చక్కగా ఉపయోగపడుతుంది. డిజిటల్ పాఠాలు బోధించే సమయంలో దృశ్యాలు (వీడియోలు) ప్రదర్శిస్తూ చెప్పవచ్చు. వీడియోల్లో ఉపాధ్యాయుడి వాయిస్, కావాల్సిన విషయాన్ని జత చేయొచ్చు. విద్యార్థి స్థాయి ఆధారంగా హోమ్ వర్క్ అందించవచ్చు. అడ్మిన్: దీనివల్ల మొత్తం పర్యవేక్షణ సులువుగా ఉంటుంది. ఉపాధ్యాయుల వారీగా బోధించిన అంశాలు, హోం వర్క్ ఇచ్చిన తీరు, విద్యార్థులు ఎంతసేపు యాప్ వినియోగించారు ఇట్టే తెలుసుకోవచ్చు. ఏకకాలంలో విద్యార్థులు, ఉపాధ్యాయులను పర్యవేక్షించే వెసులుబాటు కలుగుతుంది. ఇందులో అడ్మిన్‌గా ప్రధానోపాధ్యాయుడు ఉంటారు. పేరెంట్: విద్యార్థుల తల్లిదండ్రులు దీన్ని వినియోగించవచ్చు. ఇందులో హోం వర్క్ స్థాయిని తెలుసుకొని తల్లిదండ్రులే ఆ పనిని అప్పగించవచ్చు. దాన్ని ఉపాధ్యాయులు, అడ్మిన్ పర్యవేక్షించే సదుపాయం ఉంది.

సన్నద్ధం చేస్తూ..

ఈ యాప్ వినియోగంపై పాఠశాల ఆరంభంలో ఉపాధ్యాయులకు వారం పాటు శిక్షణ అందించారు. విద్యార్థులను సన్నద్ధం చేసే ప్రక్రియ పూర్తయింది. త్వరలో యాప్ ఆధారిత పాఠాలు అందుబాటులోకి తేనున్నారు. ఇప్పటికే దాతల సహకారంతో 40 ట్యాబ్‌లు అందుబాటులో ఉన్నాయి. మరిన్ని సమకూర్చి.. తరగతుల వారీగా అందించి యాప్ సేవలు పెంచేందుకు యోచిస్తున్నారు. విడతల వారీగా తరగతులు అందించేందుకు సన్నద్ధమవుతున్నారు. ప్రతి విద్యార్థి స్థాయి ఆన్‌లైన్‌లో లభించనుంది.

# నిఘా నీడలో అయిదు ఠాణాలు



కరీంనగర్ : సాంకేతిక పరంగా వస్తున్న మార్పులను అందిపుచ్చుకుని మెరుగైన సేవల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ కేంద్రం పరిధిలోకి కరీంనగర్ కమిషనరేట్ సైతం చోటు దక్కించుకుంది. జిల్లా పరిధిలో జరిగే సంఘటనలు, స్థానిక పరిస్థితుల పరిశీలన, ఆధారాల సేకరణకు ఉపకరించనుంది. భవిష్యత్తులో చీమ చిటుక్కుమన్నా కమాండ్ కంట్రోల్ కేంద్రంలో నమోదయ్యేలా తీర్చిదిద్దనున్నారు.

ప్రయోగాత్మకంగా..ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ కేంద్రం పరిధిలో కమిషనరేట్, జిల్లా స్థాయిలోని కొన్ని ఠాణాలను ప్రయోగాత్మకంగా ఎంపిక చేసుకొని రెండు నెలల కిందటనే ఠాణాల్లో నూతన సాంకేతికతో వీడియో, ఆడియో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మొదటి విడతగా కరీంనగర్ 1, 2, 3 ఠాణాలతో పాటు మహిళా ఠాణా, సీసీఎస్ ఠాణాలను ఎంపిక చేశారు. ఒక్కో ఠాణాలో 20 సీసీ కెమెరాలను బిగించారు. వివిధ సమస్యలతో ప్రజలు ఠాణాలోకి వచ్చి, వెళ్లే మార్గాలు, అధికారి గది, నిందితులను భద్రపరిచే గది, రైటర్స్ గది, ఫిర్యాదు స్వీకరణ ప్రాంతం, స్వాధీనం చేసుకున్న వాహనాల నిలుపుదల ప్రాంతం ఇలా మొత్తంగా 20 ఆడియో, వీడియో రికార్డింగ్‌తో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. కమాండ్ కంట్రోల్ కేంద్రం నుంచి పలుమార్లు ఆడియో, వీడియో సైతం పరిశీలించి పలు మార్పులు చేశారు.

మరిన్నిరాష్ట్ర స్థాయి కమాండ్ కంట్రోల్ కేంద్రం హైదరాబాద్‌లో ప్రారంభం కాగా, మొదటి విడతగా కరీంనగర్ నగర పరిధిలోని ఐదు ఠాణాలను అనుసంధానం చేశారు. త్వరలోనే పట్టణ ప్రాంతాల్లోని ఠాణాల్లో ఆధునిక సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి వినియోగంలోకి తెచ్చేందుకు అధికారులు సిద్ధమౌతున్నట్లు తెలిసింది. మరో రెండు, మూడు నెలల్లో స్థానికంగా ఉన్న సీసీ కెమెరాలు వినియోగంలో ఉంటే వాటిని అనుసంధానం చేయడం, కొత్త వాటిని ఏర్పాటు చేయడానికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు అధికారుల ద్వారా తెలిసింది.

ఆధునికీకరిస్తే నిఘా కట్టుదిట్టం

జిల్లాల పునర్విభజనతో భాగంగా 2016 ఆగస్టులో కరీంనగర్ కమిషనరేట్ ఏర్పాటైంది. 2017 నుంచి నేటి వరకు ప్రజల భద్రత కోసం పోలీసు అధికారులు దాతల సహకారం, కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ, స్వచ్ఛంద సంస్థలు, వాణిజ్య, వ్యాపార నిర్వాహకుల సహకారంతో ఇప్పటి వరకు మూడు వేలకు పైగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. వాటి పర్యవేక్షణ బాధ్యతను స్థానికులు చూసేవారు. వాహన రాకపోకల కారణంగా కెమెరాల వైర్లు తెగిపోవడంతో మరమ్మతుకు వేల రూపాయల ఖర్చయ్యేది. తొలుత స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ప్రజాప్రతినిధులు, పోలీసులు సంయుక్తంగా మరమ్మతులు చేయించినా రానురాను ర్చు పెరిగిపోవడం, మొదటగా ఏర్పాటు చేసిన అనేక సీసీ కెమెరాల పర్యవేక్షణను ఎవరూ పట్టించుకోకపోవడంతో సగానికి పైగా కెమెరాలు మూలన పడ్డాయి. వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసినా పర్యవేక్షణ లేక పనిచేయడం లేదు. కొన్ని ప్రాంతాల్లో కాలనీ అభివృద్ధి కమిటీలు వాటిని బాగు చేయించి భద్రతను పర్యవేక్షించుకుంటున్నాయి. ప్రధాన కూడళ్లలో కరీంనగర్ పోలీసులు సైతం ఆధునిక సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి వాటిని కమిషనరేట్ కంట్రోల్ రూంకు అనుసంధానం చేశారు. ముఖ్యమైన ప్రాంతాల్లో ఉన్న సీసీ కెమెరాలు మాత్రమే కంట్రోల్‌రూం పరిధిలో పర్యవేక్షణ జరుగుతున్నట్లు అధికారుల ద్వారా తెలిసింది. 60 డివిజన్లలో నాలున్నర లక్షల జనాభా కలిగిన స్మార్ట్ సిటీ పరిధిలోని సీసీ కెమెరాలను ఆధునికీకరించి నిరంతరం పర్యవేక్షించడం వల్ల నగరంలో భద్రత కట్టుదిట్టం చేయవచ్చని స్థానికులు అభిప్రాయ పడుతున్నారు.

# లక్ష్యం దాటితే.. ప్రోత్సాహకం

గోదావరిఖని : సహజ ప్రసవాలను పెంచేందుకు ప్రభుత్వం కొన్నేళ్లుగా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నప్పటికీ ఆశించిన మేరకు లక్ష్యాన్ని చేరుకోలేకపోతోంది. దీంతో సహజ ప్రసవాలను ప్రోత్సహించే వైద్యులు, వైద్య సిబ్బందికి ఆర్థిక ప్రోత్సాహకాలు అందించేందుకు తెలంగాణ వైద్య ఆరోగ్య శాఖ శుక్రవారం నిర్ణయం తీసుకుంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ మార్గదర్శకాల ప్రకారం 85 శాతం సహజ ప్రసవాలే ఉండాల్సి ఉండగా, చాలా ప్రాంతాల్లోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఇందులో సగం కూడా చేరుకోవడం లేదు. గోదావరిఖనిలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రతి నెలా 190 నుంచి 230 వరకు ప్రసవాలు జరుగుతుండగా సహజ ప్రసవాల శాతం 30 నుంచి 37 శాతం వరకే ఉంటుంది. ఓ ప్రైవేటు ఆస్పత్రి యాజమాన్యం అక్కడ జరిగే శస్త్ర చికిత్స ప్రసవాలను సహజ ప్రసవాలుగా దస్త్రాల్లో నమోదు చేస్తున్న వైనం ఇటీవల వెలుగులోకి రావడం గమనార్హం. శస్త్రచికిత్సతో జరిగే ప్రసవానికి 'ఆరోగ్యశ్రీ'లో రూ.11 వేలు చెల్లిస్తుండడంతో ఆరోగ్యశ్రీ ట్రస్టు అనుమతి పొందిన ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు సైతం శస్త్ర చికిత్స ప్రసవాలపైనే దృష్టి సారిస్తున్నట్లు సమాచారం. తాజాగా శస్త్రచికిత్స ప్రసవాలకు 'ఆరోగ్యశ్రీ' చెల్లింపులను నిలిపివేయడంతో పాటు సహజ ప్రసవాలను పెంపొందించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది.అవగాహన పెరగాలి... సహజ ప్రసవాలతో తల్లి, బిడ్డకు ఆరోగ్యపరంగా ఒనగూరే ప్రయోజనాలపై గర్భిణుల్లో అవగాహన కల్గించేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఇటీవల జిల్లా పాలనాధికారి తీసుకున్న ప్రత్యేక చర్యలపై ముహూర్తపు ప్రసవాల సంఖ్య కాస్త తగ్గినప్పటికీ సహజ ప్రసవాలు ఆశించిన మేరకు పెరగడం లేదు. సహజ ప్రసవాలతో ప్రయోజనాలపై గర్భిణితో పాటు ఆమె బంధువుల్లో సరైన అవగాహన లేకపోవడం, కళ్లముందే గర్భిణి పురుటి నొప్పులతో బాధపడుతుంటే చూడలేని బంధువులు వెంటనే శస్త్రచికిత్సతో ప్రసవాలు చేయాలంటూ వైద్యులపై ఒత్తిళ్లు తెస్తున్నారు. తప్పనిసరిగా సహజ ప్రసవమయ్యే అవకాశముందని, లేనిపక్షంలో శస్త్రచికిత్స చేస్తామని వైద్యులు, వైద్య సిబ్బంది నచ్చజెప్పేందుకు ప్రయత్నించినా ప్రయోజనం ఉండడం లేదు. సహజ ప్రసవాలు చేయడంలో వైద్యులు, నర్సింగ్ సిబ్బంది ప్రత్యేక శిక్షణతో సిద్ధంగా ఉన్నప్పటికీ గర్భిణులు, బంధువులు సహకరించకపోవడంతోనే సఫలం కాలేకపోతున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సంబంధిత ఉన్నతాధికారులు మాత్రం ఇవేం ఆగ్రహం వ్యక్తం చేస్తుండడం వైద్యులు, వైద్య సిబ్బందిని ఆందోళనకు గురిచేస్తోంది.

# లక్ష్యానికి చేరువ

సంగారెడ్డి : జోరు వానలు కురుస్తున్నాయి. చిన్న, మధ్య తరహా జల వనరులు, ప్రాజెక్టులు కళకళలాడుతున్నాయి. భూగర్భ జలాలు సమృద్ధిగా ఉన్నాయి. పంటలు వేయడానికి అన్ని విధాలా అనుకూల పరిస్థితులు ఉండటంతో అన్నదాతలు ఉత్సాహంగా వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. పెట్టుబడి కోసం ఇప్పటికే రైతుబంధు సాయమూ కర్షకుల ఖాతాల్లో జమైంది. ఏటా వ్యవసాయశాఖ పంటల సాగు అంచనాలు రూపొందిస్తుంది. ఈ ఏడాది ఖరీఫ్‌కు సంబంధించి లక్ష్యానికి దాదాపు చేరువ కావడం విశేషం. పప్పు దినుసులైన కంది, సోయాబీన్ పంటలు మినహా మిగిలిన వాటి సాగు కాస్త తగ్గుముఖం పట్టాయి. ఈ నెలాఖరు వరకు వరి వేయడానికి అనుకూలంగానే ఉంటుంది. దీంతో అంచనాలకు మించి సాగు విస్తీర్ణం పెరగనున్నదని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో కథనం.

అంచనా.. 6.64 లక్షల ఎకరాలు



జిల్లాలో అత్యధిక మంది వ్యవసాయంపై ఆధారపడి ఉపాధి పొందుతున్నారు. ఏటా వానాకాలంలో వరి, పత్తి, కంది, సోయాబీన్, పెసర, మినుము తదితర పంటల వైపు ఆసక్తి చూపుతారు. ఇందుకు అనుగుణంగా జిల్లా వ్యవసాయ శాఖ పంటల సాగుకు అంచనాలు రూపొందించింది. ఖరీఫ్‌లో 6,64,697 ఎకరాలు సాగు చేస్తారని అంచనా వేయగా.. ఆగస్టు 6వతేదీ వరకు 6,32,679 ఎకరాల్లో వివిధ పంటలు వేశారు. వానాకాలం సీజన్ ఇంకా ఉన్నందున ఆగస్టు, సెప్టెంబరు వరకు ఇంకా సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉందని ఆ శాఖ అధికారులు చెబుతున్నారు.

అత్యధికంగా పత్తి..జిల్లాలో అత్యధికంగా పత్తి పంట సాగు చేసినట్లు వ్యవసాయ శాఖ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ ఏడాదిలో 3,22,908 ఎకరాల్లో పంట వేస్తారని సంబంధిత శాఖ అధికారులు అంచనా వేయగా.. 3,68,844 ఎకరాల్లో సాగు చేయడం గమనార్హం. ఇంత వరకు బాగానే ఉన్నా.. జోరు వానల వల్ల ఈ పంట చాలాచోట్ల దెబ్బతిన్నది. పప్పు దినుసుల పంటల్లో మినుము, పెసర పంటల సాగు విస్టీర్ణం అంచనాలకంటే తగ్గింది.

అన్నదాతలకు ఇబ్బంది లేకుండా చర్యలు : నరసింహారావు, జేడీ, వ్యవసాయ శాఖఈ ఏడాదికి సంబంధించిన అన్ని రకాల విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాం. ఎలాంటి కొరత లేదు. అధిక వర్షాలు కురవడం వల్ల కొన్ని పంటలకు నష్టం జరిగింది. ప్రభుత్వానికి నివేదిక పంపాం. పంట నష్ట పరిహారం రాగానే నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తాం. ఎవరైనా అర్హులకు రైతు బంధు జమ కాకున్నా.. ఇతర సమస్యలున్నా... స్థానిక ఏవోలు, ఏఈవోలను సంప్రదించాలి.

# ఈ-పర్మిట్ అమలెప్పుడో!

జగిత్యాల : అక్రమ నిల్వలను అరికట్టి ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చేలా ప్రవేశపెట్టిన ఈ-పర్మిట్ విధానం అమలు బాలారిష్టాలను దాటడంలేదు. రెండు సంవత్సరాలుగా ట్రయల్‌రన్ పేరిట కాలయాపన చేస్తూ నూతన విధానాన్ని అందుబాటులోకి తేవడంలేదు...గతంలో చాలామంది వ్యాపారులు రైతుల వద్దనుంచి కొన్న పంట ఉత్పత్తులను జీరోకింద తరలించేవారు లేదా విలువను తక్కువచేసి చూపేవారు. ప్రభుత్వ ఆదాయానికి గండి పండటం, అక్రమ నిల్వలకు ఆస్కారం, రైతులను మోసగించేలా ఉన్న ఈ తంతును అరికట్టేలా మార్కెటింగ్‌శాఖ ఈ-పర్మిట్ విధానాన్ని అమల్లోకి తెచ్చింది. నూతన విధానం ప్రకారం వ్యాపారులు రైతుల వద్దనుంచి సరకును కొన్న తరువాత 1 శాతం మార్కెట్ఫీజును చెల్లిస్తారు. సరకును ఇతర ప్రాంతాలకు తరలించాల్సి వచ్చినపుడు ఆన్‌లైన్‌ద్వారా మార్కెటింగ్‌శాఖ వెబ్‌సైట్‌లోకి లాగిన్‌ై సరకు వివరాలను నమోదు చేయాలి. ఎక్కడ కొన్నది, రైతునుంచి ఎంత కొన్నది, చెల్లించిన ధర, ఎక్కడికి తరలిస్తున్నది, ఎంత ఎగుమతి చేస్తున్నారనే వివరాలన్నీ నమోదు చేయాలి. రైతు సెల్‌ఫోన్ నెంబరుతో సహా వివరాలన్నీ అప్‌లోడ్ చేసిన తరువాతనే సరకు ఎగుమతికి ఆన్‌లైన్ అనుమతి వస్తుంది. ప్రతి



పర్మిట్‌కు ఒక నంబరు ఆటోమెటిక్‌గా జనరేట్ అవుతుంది. ఈ ఆన్‌లైన్ పర్మిట్ తీసుకుని వాహనాల్లో సరకును తరలిస్తున్నపుడు తనిఖీ అధికారులకు ఆన్‌లైన్‌లో పర్మిట్ నంబరును పరిశీలించినపుడు వివరాలన్నీ కనిపించాలి.ఒకే పర్మిట్‌తో దేశంలో ఎక్కడికైనా సరకులను తరలించే వీలుంటుంది. బియ్యం సహా అన్నిరకాల పంట ఉత్పత్తుల ఎగుమతులకు ఈ-పర్మిట్ తప్పనిసరి కానుండటంతో రైతులనుంచి సరకు ఎక్కడికి తరలింది, ఏ ప్రాంతంలో నిల్వచేశారు, గోదాముల్లోని నిల్వలను ఎక్కడికి తీసుకెళ్లారనే వివరాలన్నీ ప్రభుత్వం వద్ద ఉంటాయి కాబట్టి అక్రమ నిల్వలకు అవకాశముండదు. ఈ-పర్మిట్ పద్ధతిని అతిక్రమించిన వ్యాపారులకు అధికారులు భారీగా జరిమానాలు విధించవచ్చు. జిల్లాలో దొడ్డుధాన్యంను మాత్రమే పూర్తిస్థాయిలో ప్రభుత్వం సేకరిస్తుండగా మిగిలిన ఉత్పత్తుల్లో 28-92 శాతం వరకు జీరోగానే తరలటంతో తూకంలో మోసాలు, డబ్బుల ఎగవేత, అక్రమ నిల్వలతో ఉపఉత్పత్తుల ధరలను అమాంతం పెంచటం తదితరాలు చోటు చేసుకుంటున్నాయి. పత్తి, సన్నధాన్యం, నువ్వులు, మక్కలు, అలసందలు, మామిడి, కందులు, పసుపు, పెసలు, మినుము, సోయాబీన్ తదితర చాలా ఉత్పత్తుల క్రయవిక్రయాల్లో ఇకపై ఈ-పర్మిట్ విధానాన్ని అమలు చేయటం, గ్రామాల్లో జీరో కొనుగోళ్లను అడ్డుకోవటం ద్వారా ప్రభుత్వానికి పెద్దఎత్తున ఆదాయం సమకూరుతుంది, రైతులు మోసాలనుంచి బయటపడి కనీస మద్ధతు ధరను పొందగలుగుతారు. ఈ నేపథ్యంలో సెప్టెంబరు-అక్టోబరు నుంచి మొదలయ్యే పంటకాలానికి ఈ-పర్మిటు విధానాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాల్సిఉంది.ఇప్పటికే ఈచలానా జారీ - టి.రాజశేఖర్, జగిత్యాల మార్కెట్ కార్యదర్శిమార్కెట్ల ద్వారా ఇప్పటికే ఈ ఛలానాను అమలు చేస్తుండగా పరిశీలన పూర్తయ్యిన కొన్నింటికి ఈ-పర్మిట్లు జారీ అవుతున్నాయి. విస్తరణతో ముమ్మందు అన్నిరకాల ఉత్పత్తులను ఈ-పర్మిట్ ద్వారానే తరలించే అవకాశముంది. జిల్లాలో మార్కెట్యార్డుల సంఖ్య - 13 ఏడాదికి మార్కెట్ఫీజు లక్ష్యం - రూ.15.74 కోట్లుగత ఆర్థిక సంవత్సరంలో పొందిన ఆదాయం - రూ.18.05 కోట్లుఏడాదిలో ప్రభుత్వ సంస్థల సేకరణ - రూ. 1,759 కోట్లు ప్రైవేటుగా అమ్మకాలు - రూ.1,190 కోట్లు

# తొలకరి పలకరింపు ఎప్పుడో..?

నల్గొండ : వానాకాలం సీజన్ ప్రారంభమై పక్షం రోజులు గడుస్తున్నా.. ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా చినుకుజాడ లేకపోవడంతో అన్నదాతలు కలవరపడుతున్నారు. కృష్ణపట్టి ప్రాంతాలైన డిండి, దేవరకొండతో పాటూ పలు ప్రాంతాల్లో అక్కడక్కడ జల్లులు తప్ప భారీ వర్షాలు లేకపోవడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సాగు పనులను రైతులు మొదలుపెట్టడం లేదు. వానాకాలం సీజన్ ప్రారంభమై పక్షం రోజులు గడుస్తున్నా.. ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా చినుకుజాడ లేకపోవడంతో అన్నదాతలు కలవరపడుతున్నారు. కృష్ణపట్టి ప్రాంతాలైన డిండి, దేవరకొండతో పాటూ పలు ప్రాంతాల్లో అక్కడక్కడ జల్లులు తప్ప భారీ వర్షాలు లేకపోవడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సాగు పనులను రైతులు మొదలుపెట్టడం లేదు. అరేబియా సముద్రంలో ఏర్పడిన తుపాను కారణంగా నైరుతి రుతుపవనాలు మందకొడిగా కదులుతున్నాయని వాతావరణ నిపుణుల వ్యాఖ్యలతో జూన్ సగం



రోజులు గడుస్తున్నా.. ఇంకా వడగాలులు తీవ్రత తగ్గడం లేదు. మూడు జిల్లాల్లో చాలా ప్రాంతాల్లో ఇంకా గరిష్ఠ ఉష్ణోగ్రతలే నమోదవుతున్నాయి.

ప్రణాళిక ఏదీ?

ఏటా మాదిరిగానే ఈ ఏడాదీ వానాకాలం సీజన్ ప్రారంభమైనా బ్యాంకులు ఇంకా రుణ ప్రణాళికను ఖరారు చేయలేదు. మూడు జిల్లాల్లోనూ బ్యాంకులు వార్షిక రుణ ప్రణాళికను ఖరారు చేసి ఈ ఆర్థిక సంవత్సరంలో వానాకాలం, యాసంగి సీజన్లలో జిల్లాలోని అన్నదాతలకు ఎంత రుణాలివ్వాలనేది నిర్ణయిస్తాయి. అయితే ఈ ఏడాది ఇప్పటివరకు రుణ ప్రణాళికను ఖరారు చేయకపోవడంతో అన్నదాతలు ఇప్పటి నుంచే పెట్టుబడుల కోసం షావుకార్లను ఆశ్రయిస్తున్నారు. రైతుబంధు కింద ప్రభుత్వం ఈ నెలాఖరులో రైతుల ఖాతాల్లో పెట్టుబడి డబ్బులు జమ చేస్తామని ఇప్పటికే ప్రకటించింది.

ఏటా ఈ సమయానికి తొలకరి వర్షాలు పడి రైతులు దుక్కులు దున్నుకునే కాలం. కానీ ఈ సారి రుతుపవనాలే ప్రవేశించకపోవడం, ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది కరవు ఛాయలు ఏర్పడుతాయన్న ఆందోళన రైతుల్లో వ్యక్తమవుతోంది. అకాల వర్షాలు, ప్రకృతి విపత్తుల నుంచి తట్టుకోవడానికి ప్రభుత్వం ఈ దఫా పంట కాలాన్ని ముందుకు జరపాలని నిర్ణయించినా, ఇప్పటి వరకు ఆశించినంత మేర వర్షాలు లేవు. దీంతో చెరువుల్లోనూ నీటి నిల్వలు అడుగంటుతున్నాయి. గత సంవత్సరం (2022 - 23)లో నాగార్జునసాగర్ పూర్తి స్థాయి నీటిమట్టానికి చేరుకున్నా ఇప్పుడు డెడ్‌స్టోరేజ్‌కి దగ్గరగా ఉంది.

రుతుపవనాలు రాష్ట్రమంతా విస్తరించడానికి మరో వారం నుంచి పది రోజుల వరకు పడుతుందనే వాతావరణ శాఖ అంచనాలు ఆందోళన కలిగించే పరిణామమే. రాష్ట్ర వ్యాప్తంగా ఉమ్మడి నల్గొండ జిల్లాలోనే పత్తిని అత్యధికంగా పది లక్షల ఎకరాల వరకు సాగు చేస్తున్నారు. చాలా తక్కువ మొత్తం విస్తీర్ణంలో పత్తి విత్తనాలను రైతులు నాటారు. పత్తి సాగు విస్తీర్ణం ఎక్కువగా ఉండటంతో నకిలీ విత్తన కంపెనీలు ఏటా ఇక్కడి రైతులను మోసం చేస్తున్నాయి. సకాలంలో స్పందించాల్సిన సంబంధిత అధికారులు కొన్ని నకిలీ విత్తన కంపెనీలకు కొమ్ము కాస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వం నకిలీ విత్తనదారులపై పీడీ చట్టం నమోదు చేస్తామని ప్రకటిస్తున్నా, క్షేత్రస్థాయిలో వ్యవసాయ శాఖ అధికారుల ప్రోత్సాహంతోనే నకిలీ విత్తనాలను దళారులు రైతులకు అమ్ముతున్నారన్నది బహిరంగ రహస్యమే. మహబూబ్‌నగర్ జిల్లాలోని జడ్చర్ల, భూత్పూర్, మహబూబ్‌నగర్, గద్వాల ప్రాంతాల నుంచి ఉమ్మడి జిల్లాలోని చందంపేట, దేవరకొండ, సాగర్, హాలియా, నల్గొండ, నూతన్‌కల్, పెన్‌పహాడ్, మోత్కూరు, మోతే తదితర ప్రాంతాలకు ఈ విత్తనాలను ఏటా దళారులు సరఫరా చేస్తున్నారు. వీటిని కొన్న రైతులకు దిగుబడి తక్కువ రావడంతో ఆర్థికంగా నష్టపోతున్నారు.

# వచ్చేనా సాగునీరు.. ఆగేనా రైతు కన్నీరు

నల్గొండ : రాష్ట్రంలోనే అత్యధిక జలాశయాలు ఉన్న నియోజకవర్గం దేవరకొండ.. అని గతంలో భారీ నీటిపారుదలశాఖ మంత్రిగా ఉన్న హరీశ్‌రావు అన్నారు. కానీ దశాబ్దాలు గడుస్తున్నా.. ఏ ఒక్క జలాశయం పూర్తికాక కాల్వలో నీరు పారడం లేదు. దేవరకొండ నియోజకవర్గంలో సాగు, తాగునీరు లేక గిరిజనులు అవస్థలు పడుతున్నారు. దేవరకొండ, మునుగోడు నియోజకవర్గాల్లో 3 లక్షల ఎకరాలకు సాగు, వందల గ్రామాలకు తాగునీరు అందించేందుకు 2005లో అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి శ్రీశైలం ఎడమగట్టు సొరంగ పథకాన్ని రూ.1925 కోట్లతో ఓ సంస్థకు అప్పగించారు. సొరంగం మొత్తం 43.930 కిలోమీటర్లు ఉండగా ..బడ్జెట్ కేటాయింపులు ఆలస్యంతో నేటికి 34.371 కిలోమీటర్లు పూర్తయింది. ఇంకా 9.559 కిలోమీటర్ల పనులు చేపట్టాల్సి ఉంది.

పరిహారం ఏదీ..?తెలంగాణ ప్రభుత్వం డిండి మండలంలోని సింగరాజుపల్లి, దేవరకొండ మండలం గొట్టిముక్కల, చింతపల్లి, కిష్టరాయినిపల్లి, మర్రిగూడ మండలంలోని చర్లగూడెం జలాశయాల పనులకు శ్రీకారం చుట్టింది. ప్రస్తుతం సింగరాజుపల్లి, గొట్టిముక్కల పనులు 90 శాతం పూర్తయినప్పటికీ.. గొట్టిముక్కల, చర్లగూడెం, కిష్టరాయినిపల్లి, చింతపల్లి జలాశయాల పరిధిలో భూపరిహారం చెల్లించకపోవడంలో పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. తరచూ పరిహారం కోసం రైతులు ఆందోళనలు నిర్వహిస్తున్నారు.

దేవరకొండ, మునుగోడు నియోజకవర్గాల్లో 3.5లక్షల ఎకరాలకు సాగునీరు, 100కు పైగా గ్రామాలకు తాగునీరు అందించేందుకు నక్కలగండి ప్రాజెక్టును దాదాపు రూ.450 కోట్ల నిధులతో ప్రారంభించారు. ఈ ప్రాజెక్టు నల్గొండ, నాగర్‌కర్నూల్ సరిహద్దులో నిర్మాణం చేపడుతున్నారు. పనులు నత్తనడకన సాగుతున్నాయి.

నిలిచిన పెండ్లిపాకల బ్యాలెన్సింగ్ రిజర్వాయర్

కొండమల్లేపల్లి మండలంలోని పెండ్లిపాకల బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ పనులు నాలుగేళ్లుగా నిలిచిపోయాయి. 0.2 నుంచి 2.2 టీఎంసీల సామర్థ్యానికి జలాశయ విస్తరణకు రూ.343.35 కోట్లకు ఒప్పందం జరిగింది. గుడితండా, హర్యతండా ముంపునకు గురవడంతో వారికి సరైన పునరావాసానికి చర్యలు తీసుకోకపోవడంతో మూడున్నరేళ్లుగా పనులు నిలిచిపోయాయి.చెల్లిస్తున్నాంగోపిరామ్, ఆర్డీవోదేవరకొండ నియోజకవర్గంలోని గొట్టిముక్కల, సింగరాజుపల్లి జలాశయాల భూపరిహారం బాధితులకు సాధ్యమైనంత వరకు పరిహారం చెల్లించాం.

# తపాలా శాఖలో అదనపు సేవలు




కరీంనగర్: ఒకప్పుడు ఉత్తర ప్రత్యుత్తరాలు అందించడానికి మాత్రమే పరిమితమైన తపాలా శాఖ రోజురోజుకు సేవలను విస్తృతం చేస్తూ.. ప్రజలకు మరింత దగ్గరవుతోంది. కేవలం రూ.399కే రూ.10 లక్షల ప్రమాద బీమా, ఆడపిల్లల భవితకు సుకన్య సమృద్ధి యోజన ఖాతా, సీనియర్ సిటిజన్‌కు పొదుపు ఖాతాలాంటి ప్రత్యేక పథకాలతో మధ్యతరగతి కుటుంబాలకు దగ్గర అవుతోంది. ఆధార్ నమోదు కేంద్రం, విదేశాలకు వస్తువులను పంపేందుకు డాక్ ఘర్ నిర్యత్ కేంద్రం, పార్శిల్ ప్యాకింగ్ యూనిట్, ఇంటి వద్దకే వచ్చి ఖాతా ఇవ్వడం, ఆసరా పింఛన్‌దారులకు డబ్బులు తీసుకునే వెసులుబాటు తదితర సేవలతో ప్రజలకు చేరువ అవుతోంది. కరీంనగర్ ప్రధాన తపాలా కార్యాలయంలో అదనపు సేవలపై ప్రత్యేక కథనం.

ప్రత్యేక డాక్ ఘర్ నిర్యత్ కేంద్రం

భారత తపాలా శాఖ తాజాగా విదేశాలకు వస్తువులు, పార్శిళ్లు ఎగుమతి చేసేందుకు కరీంనగర్ హెడ్ పోస్టాఫీసులో డాక్ ఘర్ నిర్యత్ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. విదేశాల్లో ఉన్న బంధువులకు వస్తువులు, తినుబండారాలు, మందులు, గిఫ్ట్ ఆర్టికల్స్, ఇతర సామగ్రి దీని ద్వారా పంపవచ్చు. వ్యక్తిగతంగానే కాకుండా ఇంపోర్టు అండ్ ఎక్స్‌పోర్టు లైసెన్స్ కోడ్ కలిగిన సంస్థలు డాక్ ఘర్ కేంద్రంలో ముందుగా రిజిస్టర్ చేసుకొని, ఇంటి వద్ద నుంచే సులభరీతిలో శ్రమ లేకుండా విదేశాలకు వస్తువులను ఎగుమతి చేయొచ్చు.

ఇంటి నుంచే ఖాతా తెరిచే అవకాశం

పోస్టాఫీసుకు వెళ్లకుండానే మీ ఇంటి వద్దనే ఉండి పోస్టాఫీసు ఖాతా తెరవాలనుకునే వారు(%POST INFO%µµ (%Android/ios%) అనే అప్లికేషన్ డౌన్‌లోడ్ చేసుకొని దాని ద్వారా వారి చిరునామా, ఇతర వివరాలు నమోదు చేసి సర్వీస్ రిక్వెస్ట్ రిజిస్టర్ చేసుకోవాల్సి ఉంటుంది. వినియోగదారు నుంచి సర్వీస్ రిక్వెస్ట్ వచ్చిన వెంటనే సంబంధిత పోస్టుమెన్ మీ ఇంటి వద్దకు వచ్చి అకౌంట్ ఓపెన్ చేసేందుకు అవసరమైన అప్లికేషన్ ఫారమ్స్ తీసుకొస్తారు. వాటిని పూరించడంలో సహకరించి పూరించిన అకౌంట్ ఓపెనింగ్ అప్లికేషన్, డబ్బులు మీ వద్ద నుంచి సేకరించుకొని పోస్టాఫీసులో అందజేస్తారు. పోస్టాఫీస్‌లో అకౌంట్ ఓపెన్ చేసిన తర్వాత సంబంధిత పోస్టుమెన్ ఇంటికొచ్చి పాసు పుస్తకం అందజేస్తారు.

శాశ్వత ఆధార్ నమోదు కేంద్రం..

ఆధార్ నమోదుకు ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు అందుబాటులో ఉంటుంది. కొత్త ఆధార్ నమోదు, సవరణలు (పేరు, పుట్టినతేదీ/వయసు, లింగం, చిరునామా, మొబైల్ నెంబరు, ఈమెయిలు, బయోమెట్రిక్, ఫొటో, వేలిముద్రలు, కనుపాపలు) చేసుకోవచ్చు. సవరణ అవసరమైతే ఒరిజినల్ పత్రాలు చూపించాల్సి ఉంటుంది. డిమోగ్రాఫిక్‌కు రుసుము రూ.50, ఇతర సవరణకు రుసుము రూ.100, నూతన ఆధార్ నమోదు ఉచితం.

పార్శిల్ ప్యాకింగ్ యంత్రం..

విదేశాలకు వస్తువులు ఎగుమతి చేయడమే కాక ఇతర బంధువులకు పంపే వస్తువులనూ అధునాతన పద్ధతిలో ప్యాకింగ్ చేసేందుకు కరీంనగర్ హెడ్ పోస్టాఫీసులు ప్యాకింగ్ యంత్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ యంత్రం ద్వారా ఎగుమతి చేసే వస్తువులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వస్తువులను మార్కెట్లో కంటే తక్కువ ధరకే ప్యాక్ చేసుకునే అవకాశముంది.

సేవలు సద్వినియోగం చేసుకోవాలిప్రజలకు మరింత దగ్గరయ్యేందుకు తపాలా శాఖ శాశ్వత ఆధార్ నమోదు కేంద్రం, పార్శిల్ ప్యాకింగ్ యంత్రం, విదేశీ ఎగుమతులకు ప్రత్యేక డాక్ ఘర్ నిర్యత్ కేంద్రం హెడ్ పోస్టాఫీసులో ఏర్పాటు చేశాం. ఆసరా పింఛనుదారులు, ఉపాధి హామీ కూలీలు కూడా డబ్బులు తీసుకునే వెసులుబాటు కల్పించాం. తపాలా శాఖ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.కె.శ్రీనివాసరావు, డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్

# ఎక్కడి బస్తాలు అక్కడే



కరీంనగర్: కొనుగోలు కేంద్రాలు ప్రారంభమై సుమారు రెండు నెలలు గడుస్తున్నా... మరోవైపు నైరుతి రుతుపవనాలు నాలుగైదు రోజుల్లో రాష్ట్రానికి వచ్చే అవకాశం ఉన్నా ధాన్యం కొనుగోళ్లు మాత్రం పూర్తి కావడం లేదు. కాంటాలు వేసి ధాన్యం బస్తాలను మాత్రం తరలించడం లేదు. దీంతో ఎక్కడి బస్తాలు అక్కడే ఉన్నాయి. ఫలితంగా కేంద్రాల వద్దే రైతులు పడిగాపులు కాస్తున్నారు. కొనుగోళ్లు పూర్తయిన వాటికి నేటికీ డబ్బులు ఖాతాల్లో జమ కాక అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారు.జిల్లాలో యాసంగి సీజన్‌లో 1.70 లక్షల ఎకరాల్లో వరిసాగు కాగా, 3.4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. చివరి దశలో వచ్చిన వడగళ్ల వానలు దిగుబడులపై తీవ్ర ప్రభావాన్ని చూపాయి. జిల్లాలోని 13 మండలాల పరిధిలో 255 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. పక్షం రోజులపాటు మబ్బుల కారణంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియలో జాప్యం నెలకొంది. వాతావరణం అనుకూలించకపోవడంతో తేమ శాతం రాలేదు. దీంతో కొనుగోళ్లు మందకొడిగా సాగాయి.

పెట్టుబడులకు ఇబ్బందులు

జిల్లాలో మొత్తం 37 వేల మంది రైతుల నుంచి 2.45 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించారు. దీంతో వందశాతం కొనుగోలు చేశామని అధికారులు చెబుతున్నారు. రూ.410 కోట్లకు గాను రూ.350 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు పేర్కొన్నారు. ఆన్‌లైన్ చేస్తూ డబ్బులు వారి ఖాతాల్లో జమ చేస్తున్నామని అధికారులు చెబుతున్నప్పటికీ ఆచరణకు నోచుకోవడం లేదు.జిల్లాలోని చాలా చోట్ల తూకం వేసిన బస్తాలు కేంద్రాల్లోనే మూలుగుతున్నాయి. ధాన్యం డబ్బులు జమ కాకపోవడంతో అన్నదాతలు పెట్టుబడులకు ఇబ్బందులు పడుతున్నారు. చందుర్తి ప్యాక్స్ పరిధిలో 12 కేంద్రాలకు గాను ఒక కేంద్రంలో కొనుగోళ్లు పూర్తయ్యాయి. ఇంకా 11 కేంద్రాల్లో కొనుగోళ్లు జరుగుతున్నాయి. ఈ ప్యాక్స్ పరిధిలో ప్రస్తుతానికి 1,31,525 క్వింటాళ్ల ధాన్యాన్ని సేకరించగా, మరో 19 వేల క్వింటాళ్ల వరకు సేకరించాల్సి ఉంది. 600 మంది రైతులకు రూ.17 కోట్ల వరకు ఖాతాల్లో జమ చేశారు. ఇంకా రూ.9 కోట్లు చెల్లించాల్సి ఉంది.

సనుగుల ప్యాక్స్ పరిధిలో ఏడు కేంద్రాల్లో కొనుగోళ్లు జరుగుతుండగా, రెండు కేంద్రాల్లో పూర్తయ్యాయి. ప్రస్తుతానికి 80 వేల క్వింటాళ్లు సేకరించగా, మరో 8 వేల క్వింటాళ్ల వరకు కేంద్రాల్లోనే నిల్వ ఉన్నాయి. మొత్తం 1,300 మంది రైతులకు గాను 580 మంది రైతుల ఖాతాల్లో రూ.3 కోట్లను జమ చేశారు. ఇంకా రూ.8 కోట్లు చెల్లించాల్సి ఉంది.

మానాల ప్యాక్స్ కేంద్రంలో తూకాలు పూర్తి కాగా 3 వేల బస్తాలు మిల్లుకు తరలించాల్సి ఉంది.

బస్తాలు నింపి పది రోజులయింది

రాంరెడ్డి, వన్‌పల్లి

మాది వీర్నపల్లి మండలం వన్‌పల్లి. నా పంట పొలం కోసి 40 రోజులకంటే ఎక్కువవుతుంది. చివరలో 44 కిలోలు తూకం వేస్తేనే తీసుకుంటామని చెప్పడంతో 43 కిలోలకు ఒప్పుకున్నా. 115 బస్తాలు అయ్యాయి. కాంటా వేసి పది రోజులు గడుస్తున్నా ఇంకా తరలించలేదు. లారీలు రావడంలేదని చెబుతున్నారు. ఇలాగైతే నాకు అమ్మిన ధాన్యం డబ్బులు ఎప్పుడు పడతాయి. ఏం తీసుకువచ్చి పెట్టుబడులు పెట్టాలి.

45 రోజులైనా తూకాలు వేయడం లేదు

హరీశ్, రైతు, రుద్రంగి

ధాన్యం కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చి 45 రోజులు గడుస్తున్నా ఇప్పటికీ కొనుగోళ్లు చేపట్టలేదు. ఆకాశంలో మేఘాలు ఏర్పడినపుడల్లా ధాన్యం కుప్పలు తడవకుండా నానా తంటాలు పడుతున్నాం. ధాన్యం కొనుగోళ్లు పూర్తయి చేతికి డబ్బులు వచ్చే సరికి ఇంకా 2 నెలలు పట్టేటట్టు ఉంది. అధికారులు స్పందించి నైరుతి రుతుపవనాలు రాకముందే కొనుగోళ్లను పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలి.

ఖాతాల్లో డబ్బులు పడలేదు సాయిరెడ్డి, రైతు, రుద్రంగి

రుద్రంగిలోని డీసీఎంఎస్ కొనుగోలు కేంద్రంలో 15 రోజుల క్రితం 171.2 క్వింటాళ్ల ధాన్యాన్ని విక్రయించగా రూ.3,52,672 రావాల్సి ఉంది. 10 రోజుల క్రితం నిర్వాహకులు ఖాతాల్లో డబ్బులు జమ చేసేందుకు ఆన్‌లైన్‌లో వివరాలను నమోదు చేసినా డబ్బులు జమ కాలేదు. వానాకాలం వ్యవసాయ పనులకు చేతిలో చిల్లి గవ్వలేదు. విత్తనాలు, ఎరువులను కొనేందుకు అప్పు చేయాల్సి వస్తోంది.

సేకరణ పూర్తయిందిప్రసాద్, పౌరసరఫరాల శాఖ మేనేజర్

జిల్లాలో 255 కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ పూర్తయింది. 2.41 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం రైతుల నుంచి సేకరించాం. పది లోపు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తరలించాల్సి ఉంది. లారీల కొరత ఎక్కడా లేదు. ఇప్పటి వరకు 30 వేల మంది రైతులకు రూ. 350 కోట్లు జమ చేశాం. ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేసి డబ్బులు చెల్లిస్తున్నాం.

# దొరికినంత దోచుకుంటూ..!

నల్గొండ: రాష్ట్రంలోని వెనుకబడిన వర్గాల చేతి, కుల వృత్తుల కుటుంబాలకు నూరుశాతం రాయితీతో ప్రభుత్వం రూ.లక్ష ఆర్థిక సాయం అందించనుంది. ఇందులో భాగంగా నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి జిల్లాల్లో ఇప్పటి వరకు ఆన్‌లైన్‌లో 15 వేల మందికి పైగా దరఖాస్తు చేసినట్లు అధికారులు వెల్లడించారు. కులవృత్తికి ఉపయోగపడే ముడిసరకు, పరికరాల కొనుగోళ్లకు ఈ నిధిని వాడుకోవాలని సర్కారు సూచిస్తోంది. ఈ పథకంలో ఎలాంటి బ్యాంకు లింకేజీ గానీ, తిరిగి చెల్లించడం గానీ ఉండదు. దీని కోసం ప్రత్యక్షంగానూ ఎవరిని సంప్రదించాల్సిన అవసరం లేదని అధికారులు వెల్లడిస్తున్నారు. 2012 ఏప్రిల్ నుంచి జారీ చేసిన కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను ఆన్‌లైన్‌లో సమర్పించి దరఖాస్తు చేసుకోవాలి. వీటి ఆధారంగా క్షేత్రస్థాయిలో జిల్లా ఉన్నతాధికారులు సమగ్రంగా విచారించి, అర్హులని తేలితే ఆర్థికసాయాన్ని నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోనే జమ చేయనున్నారు. దరఖాస్తు గడువు ఈ నెల 20న ముగియనుండటంతో చాలా మంది దరఖాస్తుకు మీ సేవా కేంద్రాల్లో వరుస కడుతున్నారు. గడువు ముగిసే నాటికి 25 వేలకు పైగా దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని సంబంధిత వర్గాల ద్వారా తెలిసింది.

భారీగా వసూళ్లు

దరఖాస్తులకు తప్పనిసరిగా కుల, ఆదాయ ధ్రువపత్రాలను జత చేయాలని ఉండటంతో చాలా మంది ధ్రువపత్రాల కోసం మీ- సేవ కేంద్రాలను ఆశ్రయిస్తున్నారు. ఈ ధ్రువీకరణ పత్రాలకు నిబంధనల ప్రకారం రూ.45 తీసుకోవాలి. అయితే నల్గొండ పట్టణం, మిర్యాలగూడ, భువనగిరి, సూర్యాపేట, కోదాడ పట్టణాల్లో చాలా వాటిల్లో రూ.300 నుంచి రూ.500 వరకు వసూలు చేస్తున్నారు. నల్గొండలోని గడియారం చౌరస్తాలో ఉన్న ఓ మీ- సేవ కేంద్రంలో ఓ లబ్ధిదారుడు రూ.600 ఇచ్చి ఆదాయ ధ్రువీకరణ పత్రానికి దరఖాస్తు చేసుకున్నట్లు 'ఈనాడు'కు వెల్లడించారు. మరోవైపు మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకున్న అనంతరం అది ఆయా స్థానిక రెవెన్యూ కార్యాలయాలకు



వెళ్తుంది. అక్కడ అధికారులు విచారణ చేసి ధ్రువపత్రాలను జారీ చేస్తారు. ఈ ప్రక్రియలో చాలా చోట్ల రెవెన్యూ సిబ్బంది అక్రమాలకు పాల్పడుతున్నారు. దరఖాస్తు గడువు తక్కువగా ఉండటంతో లబ్ధిదారుల నుంచి మీ సేవా కేంద్రాలు, రెవెన్యూ సిబ్బంది అందినకాడికి దండుకుంటున్నారు. అక్కడ ప్రతీ ధ్రువపత్రానికి రూ. 400 నుంచి రూ.500 వరకు ఇవ్వాల్సి వస్తుందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధిక రుసుం వసూలు చేస్తే కఠిన చర్యలు

భాస్కర్‌రావు, అదనపు కలెక్టరు, నల్గొండ

ప్రభుత్వం నిర్దేశించిన రుసుం మాత్రమే మీ-సేవ కేంద్రాలు వసూలు చేయాలి. నిబంధనలకు విరుద్ధంగా వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ఎక్కువ రుసుం తీసుకున్న వెంటనే బాధితులు ఫిర్యాదులు చేయండి. నిర్దేశిత గడువులోపు ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలని ఇప్పటికే క్షేత్రస్థాయిలో రెవెన్యూ అధికారులకు, సిబ్బందికి ఆదేశాలు జారీ చేశాం.

# ఆర్‌అండ్‌బీ విభజన ప్రక్రియ పూర్తి

నల్గొండ : ప్రగతికి కొలమానంగా నిలిచే రహదారులను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. అందుకు అవసరమైన యంత్రాంగాన్ని బలోపేతం చేసే దిశగా చర్యలు చేపట్టింది. ఇప్పటికే నీటిపారుదలశాఖ, పంచాయతీరాజ్ శాఖలను ప్రక్షాళన చేసిన ప్రభుత్వం ఆర్‌అండ్‌బీ శాఖ విభజన ప్రక్రియ పూర్తి చేసింది. పునర్వ్యవస్థీకరణ ప్రతిపాదనలు ప్రభుత్వం ఆమోదించి అధికారికంగా ఉత్తర్వులు జారీ చేయడంతో సంబంధిత యంత్రాంగం కొత్త కార్యాలయాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది.

రెండు సర్కిళ్లుగా విభజన

ప్రస్తుతం ఉమ్మడి నల్గొండ జిల్లా మొత్తం నల్గొండ సర్కిల్‌గా పనిచేస్తోంది. కొత్తగా సూర్యాపేట, నల్గొండ, యాదాద్రి జిల్లాలకు తోడు పొరుగున ఉన్న జనగాం జిల్లాలను కలిపి రెండు సర్కిళ్లుగా ఏర్పాటు చేశారు. నల్గొండ సర్కిల్ కేంద్రంగా నల్గొండ- సూర్యాపేట, యాదాద్రి సర్కిల్‌గా యాదాద్రి, జనగాం జిల్లాను చేర్చారు. రెండు



సర్కిళ్లను ఐదు డివిజన్లను విభజించగా యాదగిరిగుట్టను ప్రత్యేక డివిజన్‌గా ఏర్పాటు చేశారు. వాటి పరిధిలో 20 సబ్‌డివిజన్లు ఏర్పాటు చేశారు. ఒక్కో సబ్ డివిజన్‌ను రెండు నుంచి మూడు సెక్షన్లుగా విభజించారు. విభజన ప్రక్రియ పూర్తి కావడంతో దానికి అనుగుణంగా ఉద్యోగుల సర్దుబాటు ప్రక్రియను ప్రభుత్వం చేపట్టింది.

కొత్తగా క్యూసీ, ఎన్‌హెచ్ డివిజన్లు ఏర్పాటు

గతానికి భిన్నంగా జాతీయ రహదారుల సంస్థ డివిజన్, ఆర్‌అండ్‌బీ క్వాలిటీ కంట్రోల్(నాణ్యత ప్రమాణాల నిర్ధారణ) సంస్థ డివిజన్ కార్యాలయాలను ఉమ్మడి జిల్లాకు కేటాయించారు. అందులో యాదాద్రి సర్కిల్ పరిధిలో జనగాం కేంద్రంగా జాతీయ రహదారుల సంస్థ(ఎన్‌హెచ్) డివిజన్‌తోపాటు సబ్‌డివిజన్, తిరుమలగిరి, సూర్యాపేట, నల్గొండలో సబ్‌డివిజన్లు కేటాయించారు. క్వాలిటీ కంట్రోల్ డివిజన్ విభాగాన్ని నల్గొండ కేంద్రంలో ఏర్పాటు చేయగా, దాని పరిధిలో నల్గొండ, భువనగిరి పట్టణాల్లో సబ్ డివిజన్లను ఏర్పాటు చేశారు. వీటికి తోడు ఎలక్ట్రికల్ సబ్ డివిజన్ విభాగాన్ని నల్గొండలో ఏర్పాటు చేశారు.

# డ్రగ్స్ దందాలో సినీ లింకులు!

హైదరాబాద్: డ్రగ్స్ రాకెట్‌లో సినీనిర్మాత కృష్ణప్రసాద్ చౌదరి అలియాస్ కేపీచౌదరి అరెస్ట్ సంచలనంగా మారింది. గోవా కేంద్రంగా మాదకద్రవ్యాల సరఫరా కీలక సూత్రధారి నైజీరియన్ పెటిట్ ఎబ్యూజర్ అలియాస్ గాబ్రియేల్ కోసం గాలిస్తున్న సైబరాబాద్ పోలీసులకు అతడితో కేపీచౌదరికి సన్నిహిత సంబంధాలున్నట్టు గుర్తించారు. ఇటీవలే అరెస్టయిన రోషన్ ఫోన్‌లో లభించిన ఆధారాలతో కేపీచౌదరిని పట్టుకున్నారు. ఇతడి వద్ద రూ.70లక్షల విలువైన 82.75 గ్రాముల కొకైన్ స్వాధీనపరచుకున్నారు. ఏడేళ్లుగా తెలుగు, తమిళ సినీ పరిశ్రమల్లోని పలువురితో అతడికి దగ్గర సంబంధాలున్నాయి. గోవా, హైదరాబాద్ శివారు ఫామ్‌హౌస్‌ల్లో ఇతడు ఏర్పాటు చేసిన ప్రయివేటు పార్టీలకు పలువురు నటులు హాజరైనట్టుగా ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి. ఇతడు గోవాలో హొటల్ ప్రారంభించినప్పుడు నైజీరియన్లతో పరిచయాలు ఏర్పడ్డాయి. వాటి ఆధారంగా అంతర్జాతీయ డ్రగ్ డీలర్లకు దగ్గరయ్యాడు. విదేశాల నుంచి వచ్చే సింథటిక్ డ్రగ్‌ను తక్కువ ధరకు కొనుగోలు చేసి అధిక రేట్లకు విక్రయిస్తూ ఆర్థిక ఇబ్బందులను అధిగమించే ప్రయత్నం ప్రారంభించాడు. దాదాపు ఏడాదికాలంగా ఏపీ, తెలంగాణకు చెందిన స్థిరాస్తి వ్యాపారులు, సినీ, రాజకీయ వర్గాలకు చెందిన ప్రముఖులు ఇతడి వద్దనే ఖరీదైన కొకైన్ కొనుగోలు చేస్తున్నట్టు గుర్తించామని ఓ పోలీసు ఉన్నతాధికారి తెలిపారు. 2017లో తెలుగు సినీ పరిశ్రమను మాదకద్రవ్యాల కంపు ఉక్కిరిబిక్కిరి చేసింది. ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ప్రముఖ నటీనటులను కార్యాలయానికి రప్పించి విచారణ జరిపారు. ఇన్నేళ్లకు నైజీరియన్ల మత్తు దందాతో సినీ పరిశ్రమకు లింకులున్నట్టు ఆధారాలు బయటపడటం కలకలం సృష్టిస్తోంది.

తొమ్మిది చరవాణుల్లో అసలుగుట్టు

నైజీరియన్ పెటిట్ ఎబ్యూజర్ అలియాస్ గాబ్రియేల్ పట్టుబడితే మాదకద్రవ్యాల లింకులు బయడపతాయంటున్నారు సైబరాబాద్ పోలీసులు. ఇతడి నుంచి కొకైన్ కొని హైదరాబాద్‌లో విక్రయిస్తున్న సభ్యుల్లో నలుగురు అరెస్టయ్యారు. వీరి వద్ద నుంచి 9 చరవాణులు స్వాధీనపరచుకున్నారు. ఫోన్లలో లభించిన కాల్‌డేటా ఆధారంగా కొనుగోలుదారుల వివరాలు రాబడుతున్నారు. వాట్సాప్ ద్వారా జరిగిన లావాదేవీలను సాంకేతిక పరిజ్ఞానంతో గుర్తించే ప్రయత్నం చేస్తున్నారు. కేపీ చౌదరి ఫోన్లలో సినీ రంగానికి చెందిన ఇద్దరు హీరోయిన్లు, నలుగురు నటీమణులు, ప్రముఖ దర్శకుడి ఫోన్ నంబర్లు, ఫొటోలను పోలీసులు గుర్తించినట్టు విశ్వసనీయ సమాచారం. గతంలో మాదిరిగా నోటీసులిచ్చి వదిలేయకుండా పక్కా ఆధారాలతో ప్రముఖులనూ అరెస్ట్ చేయాలనే యోచనలో పోలీసులున్నట్టు సమాచారం.

# మురుగు ప్రవాహం... గోదావరి కలుషితం

గోదావరిఖని: కాళేశ్వరం ప్రాజెక్టు నీటితో నిత్యం నిండుగా ఉండే గోదావరినది మురుగునీటితో కలుషితమవుతోంది. సుందిళ్ల బ్యారేజీ బ్యాక్‌వాటర్‌తో గోదావరిఖని పట్టణానికి సమీపంలో ఉన్న గోదావరినది మురుగు కూపంగా మారుతోంది. గోలివాడ పంపుహౌస్ ద్వారా ఎల్లంపల్లి శ్రీపాదసాగర్ ప్రాజెక్టులోకి ఎత్తిపోస్తున్న నీరు మిషన్ భగీరథ ద్వారా సరఫరా అవుతోంది. రామగుండం నగర ప్రాంతంలో రోజుకు 45 మిలియన్ లీటర్ల మురుగు నీరు బయటకు వస్తుంది. మల్కాపూర్, 2–ఎ గని సమీపంతో పాటు రామగుండంలో ఎస్టీపీ ప్లాంట్లు నిర్మించి మురుగు నీటిని శుద్ధి చేసి ఇతర అవసరాలకు వినియోగించుకోవాలని నిర్ణయించగా సింగరేణి సంస్థ 2–ఎ గని సమీపంలో ఎస్టీపీ ప్లాంటు నిర్మాణం పనులు చేపడుతోంది. రామగుండంలో కూడా రోజుకు ఎనిమిది మిలియన్ లీటర్ల మురుగునీరు శుద్ధి చేసే ప్లాంటు నిర్మాణ దశలో ఉంది. మల్కాపూర్ శివారులో చేపట్టాల్సిన ఎస్టీపీ ప్లాంటు పనులు ఇంకా మొదలు కాలేదు. నిర్మాణానికి చర్యలు చేపట్టకపోవడంతో గోదావరినదిలోకి నిరంతరం నగరంలో వినియోగి ంచిన నీరు నేరుగా కలుస్తోంది. నీరు దుర్గంధాన్ని వెదజల్లుతోంది. అనేక సార్లు గోదావరి నీటిపై నురగలు తేలాయి. కాలుష్య నియంత్రణ మండలి అధికారులు నమూనాలు సేకరించిన సందర్భంలో మలినాలు ఉన్నట్లు గుర్తించారు. స్థానిక పరిశ్రమల నుంచి వచ్చే కాలుష్య జలాలను శుద్ధి చేసి బయటకు పంపించాల్సి ఉండగా నేరుగా నదిలోకి వదులుతున్నారు. మురుగు నీటిని శుద్ధి చేసేందుకు రూ.19 కోట్ల వ్యయంతో ఎస్టీపీ ప్లాంటును సింగరేణి నిర్మిస్తోంది. గోదావరిఖని పట్టణంలోని ఫైవింక్లైన్‌తో పాటు విఠల్‌నగర్, తిలక్‌నగర్, రమేశ్‌నగర్, సీతానగర్, మల్లికార్జున్‌నగర్ పరిసర ప్రాంతాల ప్రజలు వినియోగించిన మురుగునీటిని శుద్ధి చేసేందుకు సీవేజ్ ట్రీట్‌మెంటు ప్లాంట్ నిర్మాణానికి సింగరేణి చర్యలు తీసుకుంది. రోజుకు 17 మిలియన్ లీటర్ల మురుగునీటిని శుద్ధిచేసే సామర్థ్యంతో ప్లాంట్‌ను నిర్మిస్తుంది. మరో ఆరునెలల్లో ఇది పూర్తి కానుంది. గోదావరిఖని పట్టణంలోని 50 శాతం ప్రజలు వినియోగించిన నీటిని శుద్ధి చేసేందుకు చర్యలు చేపట్టిన పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఇప్పటికే రూ.2 కోట్ల వ్యవయంతో నిర్మించిన మినీప్లాంటు ద్వారా రోజుకు 2000 లీటర్ల మురుగునీటిని శుద్ధి చేసి మొక్కల పెంపకానికి వినియోగించుకుంటోంది.

మల్కాపూర్ శివారు నుంచి రోజుకు 21 మిలియన్ లీటర్ల మురుగు ఇలా గోదావరినదిలో కలుస్తుంది. గోదావరిఖని పట్టణంలోని 50 శాతం మంది ప్రజలు వినియోగించిన మురుగునీరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల పక్క నుంచి మల్కాపూర్ శివారుకు చేరుకుంటుంది. ఇక్కడ ఎస్టీపీ ప్లాంటు నిర్మించాలని రామగుండం నగరపాలక సంస్థ ప్రతిపాదనలు తయారు చేసింది. రూ.29 కోట్లతో నగరపాలక సంస్థ రెండేళ్ల క్రితం ప్రతిపాదనలు తయారు చేశారు. రోజుకు 23 మిలియన్ లీటర్ల మురుగునీటిని శుద్ధిచేసి నదిలోకి వదలాలని ప్రణాళికలు చేశారు. నాగ్‌పూర్‌కు చెందిన సంస్థతో అధ్యయనం చేయించారు. నిధుల కోసం ప్రభుత్వానికి నివేదికలు పంపించారు. ఇప్పటి వరకు నిర్మాణానికి సంబంధించిన పనులు మొదలు కాలేదు. ఫలితంగా రోజుకు 23 మిలియన్ లీటర్ల మురుగునీరు నేరుగా నదిలో కలుస్తోంది.

రెండు నెలల్లో పనులు ప్రారంభం

సుమన్‌రావు, నగరపాలక కమిషనర్

మల్కాపూర్ శివారులో రెండు నెలల్లో ఎస్టీపీ ప్లాంటు నిర్మాణం పనులు మొదలు పెడతాం. రామగుండం సమీపంలో నిర్మిస్తున్న ఎస్టీపీ ప్లాంటు రెండు నెలల్లో పూర్తవుతుంది. అమృత్ పథకంలో ఎస్టీపీకి నిధులు కేటాయిస్తున్నాం. రెండు నెలల్లో పనులు ప్రారంభించి ప్లాంట్ నిర్మాణం పూర్తి చేస్తాం. గోదావరినదిలోకి మురుగునీరు నేరుగా చేరకుండా చర్యలు తీసుకుంటాం.

# అనాథలపై వాత్సల్యం



భూపాలపల్లి : తల్లిదండ్రులను కోల్పోయి.. అయినవారి నిరాదరణకు గురై.. నిరాశ్రయులైన విధి వంచిత అభాగ్యులు ఎంతో మంది ఉన్నారు. అలాంటి పిల్లలు విద్య, వైద్యానికి నోచుకోక ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారు. ఈ నేపథ్యంలో వారిని ఆదుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 'మిషన్ వాత్సల్య' పథకాన్ని అమలు చేస్తున్నాయి. పిల్లలు నిరాశ్రయులు, నిస్సహాయులు, బాల కార్మికులుగా మారకుండా.. బాల్య వివాహాలు జరగకుండా అడ్డుకోవడం ఈ పథకం ఉద్దేశం..

విధివంచిత పిల్లలకు అండగా నిలుస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో మిషన్ వాత్సల్య పథకానికి శ్రీకారం చుట్టారు. కేంద్రం 60 శాతం, రాష్ట్రం 40 శాతం వాటా నిధులను విడుదల చేయనున్నాయి. అర్హులైన పిల్లలకు మూడేళ్ల వరకు నెలకు రూ.4 వేలు వారి ఖాతాలో జమ చేయనున్నారు. జిల్లా బాలల పరిరక్షణ విభాగం, అంగన్‌వాడీ ఆధ్వర్యంలో దరఖాస్తు చేసుకునేందుకు అవగాహన కల్పిస్తున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 10166 దరఖాస్తులు వచ్చినట్లు సంబంధిత శాఖ అధికారులు తెలిపారు. దరఖాస్తు తుది గడువు లేకుండా పెద్దఎత్తున అవగాహన కల్పించి అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తులు చేసుకునేలా చర్యలు తీసుకుంటున్నారు. దరఖాస్తులను క్షేత్రస్థాయిలో అంగన్‌వాడీ టీచర్ ఆధ్వర్యంలో గ్రామ బాలల పరిరక్షణ కమిటీ ముందు పరిశీలన చేసి అర్హత ఉన్న దరఖాస్తులను మండల స్థాయి కమిటీకి పంపిస్తారు. అక్కడ వారు పరిశీలించి జిల్లా బాలల పరిరక్షణ విభాగానికి అందించాల్సి ఉంటుంది.

అర్హులు వీరే...

- 18 సంవత్సరాల లోపు వయసు కలిగి తల్లిదండ్రులను కోల్పోయిన, తల్లి లేదా తండ్రిని కోల్పోయిన పిల్లలు, విడాకులు తీసుకున్న తల్లిదండ్రుల పిల్లలు.
- ప్రాణాంతకమైన వ్యాధితో బాధపడుతున్న తల్లిదండ్రుల పిల్లలు..
- ఆర్థికంగా, శారీరకంగా బలహీనులై తమ బిడ్డలను పోషించలేని స్థితిలో ఉండి వదిలేసిన పిల్లలు..
- ఇంటి నుంచి పారిపోయిన పిల్లలు, పునరావాసం అవసరమైనవారు, దోపిడీకి గురైన పిల్లలు.
- కరోనా కారణంగా తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలు..

దరఖాస్తు ఇలా..

అర్హులైన వారు స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. దరఖాస్తుతో పాటు అనాథలైతే తల్లిదండ్రుల మరణ ధ్రువీకరణ పత్రం, బాలల విద్యార్హతలు, కుల, నివాస, ఆదాయ ధ్రువపత్రాలు.. పిల్లల వ్యక్తిగత ఖాతా లేదా తల్లి, సంరక్షకుల జాయింట్ ఖాతా, పిల్లల ఆధార్ కార్డు, తల్లి లేదా సంరక్షకుల ఆధార్ కార్డు, రేషన్ కార్డు, బాలిక, బాలుడి పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, గ్రామ స్థాయి బాలల పరిరక్షణ కమిటీ తీర్మానంతో దరఖాస్తు చేసుకోవాలి.

వీరు అనర్హులు

- ప్రభుత్వ, ప్రైవేటు రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలలో చదువుతున్నవారు.
- ఆర్థిక స్థోమత బాగున్నవారు.
- ప్రభుత్వం నుంచి ఏదైనా ఆర్థిక లబ్ధి పొందినవారు.

ఎంతో ఉపయోగకరం

–శైలజ, జిల్లా ఇన్‌ఛార్జి సంక్షేమాధికారి, జయశంకర్ భూపాలపల్లి

మిషన్ వాత్సల్య పథకం తల్లిదండ్రులు లేని పిల్లలు, తల్లి లేదా తండ్రి లేని వారు, బాలకార్మికులు, నిరుపేద పిల్లలకు ఎంతో ఉపయోగకరం.. అర్హులైన పిల్లలు సంబంధిత అంగన్‌వాడీ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలి. పథకంలో ఎంపికైన వారికి మూడేళ్ల పాటు నెలకు రూ.4 వేల చొప్పున ఖాతాలో నగదు జమ చేస్తారు. క్షేత్రస్థాయిలో దరఖాస్తులు స్వీకరించడంతో పాటు అర్హుల గుర్తింపు కార్యక్రమం చేపడుతున్నాం.

# మహా జాతర.. ముందస్తు ఏర్పాట్లే శ్రీరామరక్ష



జయశంకర్ : మేడారం సమ్మక్క, సారలమ్మ మహాజాతర 2024 ఫిబ్రవరి 21 నుంచి 24 మధ్య జరగనుంది. ముందస్తుగా ఏర్పాట్లు చేసుకునేందుకు వీలుగా త్వరగా తేదీలను ప్రకటించామని గత నెల 3న పూజారులు ప్రకటించారు. ప్రతిసారి ఓవైపు జాతర జరుగుతుంటే.. మరోవైపు పనులు సాగుతుంటాయి. దీంతో అరకొర వసతులతో భక్తులు ఇబ్బంది పడుతుంటారు. గత అనుభవాల దృష్ట్యా ఇప్పటి నుంచే కసరత్తు మొదలెడితే సకాలంలో పనులు పూర్తవుతాయి.

ఇలా చేస్తే నిధులు ఆదా..

రెండేళ్లకోసారి నిర్వహించే మహాజాతరకు తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాలు, విదేశాల నుంచి దాదాపు కోటి మందికిపైగా తరలివస్తారు. ఎక్కువ శాతం తాత్కాలిక ఏర్పాట్లు చేసి జాతర అనంతరం తొలగిస్తారు. రెండేళ్ల నుంచి ఏడాది పొడవునా భక్తులు దర్శనానికి వస్తున్నారు. శాశ్వత ప్రాతిపదికన సౌకర్యాలు కల్పిస్తే జాతరతో పాటు, సాధారణ రోజుల్లో వచ్చే భక్తులకూ ఉపయోగపడుతాయి. ఆ పనులతో నిధులు కూడా ఆదా అవుతాయి. నిధుల జాప్యం వల్ల హడావుడి పనులు చేస్తున్నారు. దీంతో నాణ్యతపై దృష్టి సారించడం లేదు. రెండేళ్లు కూడా నిలవడం లేదు. మళ్లీ జాతరకు తిరిగి అవే పనులు చేపడుతూ నిధులను వృథా చేస్తున్నారు. పర్యవేక్షణ సైతం సరిగా ఉండటం లేదు.

జాతర సమయంలో 10 వేలకు పైగా తాత్కాలిక మరుగుదొడ్లు, తాగునీటి నల్లాలు, జల్లు స్నానాల షవర్లు, దుస్తులు మార్చుకునే గదులు, తదితర ఏర్పాట్లు చేస్తారు. వీటికే ప్రతి దాదాపు రూ.30 కోట్ల వరకు ఖర్చు చేస్తున్నారు. సాధ్యమైనంత వరకు శాశ్వత ప్రాతిపదికన నిర్మిస్తే ప్రతిసారి వాటికి నిధులు కేటాయించనవసరం ఉండదు.

అతిథి గృహాలు, కాటేజీలు లేక దర్శన అనంతరం భక్తులు తిరిగి వెళ్లిపోతున్నారు. పెద్ద ఎత్తున కాటేజీల నిర్మాణం చేపట్టాలి. ఆలయ పరిసరాల్లో ప్రశాంత వాతావరణం కోసం 500 మీటర్ల వరకు ఎలాంటి నిర్మాణాలు లేకుండా చూడాలి.

జాతరలో మురుగు కాల్వల వ్యవస్థ లేదు. ఈసారి దీనిపై శ్రద్ధ పెట్టాలి. క్యూలైన్ల విస్తరణ, విద్యుత్తు, పారిశుద్ధ్యం, తదితర పనులపై దృష్టి సారించాలి. టన్నుల కొద్దీ చెత్త పోగవుతోంది. పునర్వినియోగం చేసే సంస్థలతో ఒప్పందం కుదుర్చుకుంటే ఆదాయం కూడా సమకూరుతుంది.

రహదారుల విస్తరణతో మేలు..

మేడారానికి వెళ్లే ప్రధాన రహదారులైన పస్రా–మేడారం, తాడ్వాయి–మేడారం, మేడారం–భూపాలపల్లి, మేడారం–కాటారం రహదారులను ఫోర్‌లేన్లుగా విస్తరిస్తే దాదాపుగా ట్రాఫిక్ సమస్య తీరుతుంది. కొండాయి–ఊరట్టం మధ్య నున్న రహదారి అటవీ అనుమతులు రాకపోవడంతో విస్తరణకు సాధ్యం కావడం లేదు. ఇది పూర్తయితే ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల నుంచే వచ్చే భక్తులు సులువుగా మేడారం చేరుకుంటారు. మేడారంలో అంతర్గత రహదారులను సైతం విస్తరించాలి. జంపన్నవాగు నుంచి గద్దెల వరకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలి. ములుగు జిల్లా పాలనాధికారి కృష్ణ ఆదిత్య ఇటీవల శాఖల వారీగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశాలు జారీ చేశారు. తుది నివేదిక తయారు చేయలేదు. ప్రణాళికలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపిస్తే ముఖ్యమంత్రి ఆమోదంతో నిధులు మంజూరవుతాయి. రెడ్డిగూడెం–కొత్తూరు మధ్య గత జాతరలో పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో రూ.50 లక్షలతో నిర్మించిన సిమెంటు రోడ్డు, కల్వర్టు వర్షాలకు కొట్టుకుపోయి ఇలా దర్శనమిస్తోంది. నాణ్యత ప్రమాణాలు పాటించలేదని స్పష్టమవుతోంది.

# ప్రజల చెంతకు కార్పొరేట్ వైద్యం: మంత్రి జగదీశ్‌రెడ్డి

తాళ్లగడ్డ : అమెరికా వంటి అగ్రరాజ్యాలను మరిపించేలా తెలంగాణ వైద్యరంగం చేరుకుందని రాష్ట్ర విద్యుత్తు శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సూర్యాపేటలోని వైద్యకళాశాల ప్రాంగణంలో నిర్వహించిన ఆరోగ్యశాఖ దినోత్సవంలో మాట్లాడారు. ప్రజారోగ్యంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని, కొత్తగా ఏర్పడిన రాష్ట్రంలో ప్రజల చెంతకు కార్పొరేట్ వైద్యం చేరిందన్నారు. తెలంగాణ రాష్ట్రమొస్తే ఏం వచ్చింది అని అడిగేవారికి ఇదే సరైన సమాధానమని చెప్పారు. సూర్యాపేటలో 2014కు పూర్వం 100 పడకలుగా ఉన్న సర్కారు దవాఖానాలో ప్రస్తుతం 450కి పెరిగిందన్నారు. కొవిడ్ సమయంలో సూర్యాపేట వైద్య సిబ్బంది అందించిన సేవలను కొనియాడారు. అనంతరం గర్భిణులకు పౌష్టికాహార కిట్లు, 120 మంది లబ్ధిదారులకు రూ.44.53 లక్షల విలువైన సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్, కలెక్టర్ వెంకటరావు, జిల్లా వైద్యాధికారి డాక్టర్ కోటాచలం, డిప్యూటీ డీఎంహెచ్‌వో హర్షవర్ధన్, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, జడ్పీ వైస్ ఛైర్మన్ గోపగాని వెంకటనారాయణ గౌడ్, మున్సిపల్ ఛైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, వైద్య కళాశాల ప్రిన్సిపల్ శారద, ఆసుపత్రి సూపరింటెండెంట్ మురళీధర్‌రెడ్డి, పాల్గొన్నారు.

# పొడి దుక్కుల్లో విత్తు

తల్లాడ : వానాకాలం వ్యవసాయ పనుల్లో అన్నదాతలు నిమగ్నమయ్యారు. ఇటీవల కురిసిన వర్షాలకు ట్రాక్టర్‌తో దుక్కులు సిద్ధం చేస్తున్నారు. పత్తి విత్తనాలు విత్తేందుకు అరకలతో అచ్చు తోలుతున్నారు. తొలకరి జల్లులు పడగానే విత్తాలని సన్నద్ధమవుతున్నారు. కానీ కొందరు పొడి దుక్కుల్లోనే విత్తనాలు నాటుతున్నారు. జిల్లాలో గతేడాది కంటే ఈసారి పత్తి సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉందని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు. సత్తుపల్లి నియోజకవర్గం వ్యాప్తంగా సుమారు 1500 ఎకరాల వరకు పెరిగే అవకాశం ఉంది. వరి



సాగుచేసే రైతులు పొలాల్లో పచ్చిరొట్ట విత్తనాలను చల్లడం, నారుమళ్లు సిద్ధం చేసే పనుల్లో మునిగిపోయారు. తల్లాడ మండలంలోని నారాయణపురం, కొడవటిమెట్ట, పినపాక, వెంకటాపురం, తల్లాడ గ్రామాల్లో అన్నదాతలు అచ్చులు తోలి పొడి దుక్కుల్లో పత్తి విత్తనాలను విత్తుతున్నారు. మండటెండల్లోనే రైతులు, కూలీలు పొలం పనుల్లో మమేకం అవుతున్నారు. రైతులు వానాకాలం సాగుకు పొలాలను సిద్ధం చేసుకోవాలి. ఇప్పటివరకు సరైన వర్షం కురవలేదు. 60సెంటీమీటర్లు వర్షపాతం కురిసిన తర్వాతనే రైతులు పత్తి విత్తనాలను విత్తుకోవాలి. రెండుసార్లు మంచి వర్షం కురిసిన తర్వాత భూమి చల్లబడినప్పుడు మాత్రమే అనుకూలంగా ఉంటుంది. తొందరపడి పొడి దుక్కుల్లో విత్తుకోవద్దు. ఇప్పుడు భూమి అంతా వేడెక్కి ఉంది. ఈ వేడికి మొలక శాతం తక్కువగా వస్తుంది. దీంతో విత్తనాలు వృథా అవడంతోపాటు ఖర్చు కూడా అధికమవుతుంది.

యు.నరసింహారావు, సత్తుపల్లి ఏడీఏ

# మెప్మా మహిళల ముందడుగు

మధిర : చదువులు మధ్యలోనే ఆగిపోయాయి. కానీ వారు వంటింటికే పరిమితం కాలేదు. కుటుంబ ప్రగతిలో తామూ సైతం అంటూ భాగస్వామ్యులయ్యారు. పురపాలకంలో మెప్మా అందించిన సహకారం అందుకుని స్వశక్తితో ముందుకు సాగుతున్నారు. ఆర్థిక ఇక్కట్లను అధిగమించి భర్తల సంపాదనకు చేదోడు వాదోడుగా నిలుస్తున్నారు. పిల్లలను మంచిగా చదివిస్తూ వారి బంగారు భవితకు బాటలు పరుస్తున్న మెప్మా మహిళలపై అందిస్తున్న ప్రత్యేక కథనమిది. చిన్నమొత్తం రుణంతో ప్రారంభమై..ఎస్కె షరియన్ పురపాలకంలోని మెప్మాలో బాబా స్వయం సహాయక సంఘంలో సభ్యురాలిగా చేరారు. తొలుత రూ.10వేల రుణంతో చిన్నపాటి సరకుల దుకాణం ఏర్పాటు



చేసుకున్నారు. నెలవారీ రుణాన్ని సక్రమంగా చెల్లిస్తూ రావడంతో బ్యాంకు ద్వారా ఆరుణం కాస్తా రూ.1లక్ష తీసుకునే స్థాయికి చేరారు. ఈమొత్తంతో దుకాణాన్ని మరింతగా విస్తరించుకున్నారు. భర్త మౌలాలీ రోజువారీ కూలీ పనికి వెళ్తుంటారు. పెద్ద కుమారుడు బాబామస్తాన్‌ను ఎంబీఏ, కుమార్తె సుల్తానాను డిగ్రీ చదివిస్తున్నారు.

కుటుంబానికి చేదోడువాదోడు

కె.పావని పురపాలక సంఘంలోని శ్రీలలిత స్వయం సహాయక సంఘం గ్రూపులో సభ్యురాలిగా చేరారు. మెప్మా సహకారంతో తొలుత రూ.20వేల రుణం తీసుకుని తనకున్న ఆసక్తి మేరకు పెట్స్ దుకాణాన్ని ఏర్పాటు చేసుకున్నారు. నెలవారీ చెల్లింపులు సక్రమంగా చేస్తుండటంతో ఆ రుణం రూ.75వేలు పెంచుకునేందుకు బ్యాంకు నుంచి అనుమతి లభించింది. దీంతో చిలుకలు, కుందేళ్లు, కుక్కపిల్లలు, చేపపిల్లలు, పిచ్చుకల విక్రయాలు చేపట్టి ఆర్థికంగా నిలదొక్కుకున్నారు. భర్త సతీష్ కేబుల్ ఆపరేటర్‌గా పనిచేస్తుంటారు. కుమార్తె మనిస్‌పూరిని తొమ్మిదో తరగతి చదివిస్తున్నారు.

# వేసవిలో ఆదుకోని భగీరథ

కరీంనగర్: సురక్షితమైన మంచినీటిని సరఫరా చేయడంలో మిషన్ భగీరథ అధికారులు విఫలమవుతున్నారని ధర్మపురి పట్టణంలోని పలు కాలనీల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ కారణంగా తమకు ప్రతి వేసవిలో తాగునీటి సమస్యలు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆధ్యాత్మిక క్షేత్రంగా ప్రసిద్ధిగాంచిన ధర్మపురి పట్టణంలో తాగునీటి సరఫరాపై అధికారులకు ముందస్తు చర్యలు లేకుండా పోయాయి. దశాబ్దాల క్రితం గోదావరి నది వద్ద ఏర్పాటు చేసిన పురాతన పథకం ద్వారా తాగునీటి వ్యవస్థను పునరుద్ధరిస్తే బాగుంటుందని స్థానికులు కోరుతున్నారు. దీని ద్వారానే ఇప్పటికీ దేవస్థానం, కోనేరు, చింతామణి చెరువుల్లోకి నీరు చేరుతోంది. నూతనంగా నదీ తీరంలో పథకాన్ని పునర్నిర్మించేలా ప్రభుత్వం ప్రణాళిక రూపొందించాలని స్థానికులు కోరుతున్నారు. రూ.కోట్ల వ్యయంతో మిషన్ భగీరథ పథకంలో భాగంగా ఎనిమిది తాగునీటి ట్యాంకులను ఏర్పాటు చేశారు. కాగా ఈ పైపులైన్ ద్వారా పట్టణ ప్రజల అవసరాలకు తాగునీరు సరఫరా కావడం లేదు. ఇప్పటికే పలుచోట్ల రోడ్ల నిర్మాణం, రహదారులు మురుగు కాలువల నిర్మాణంతో వీధుల్లోని పలు చోట్ల పైపులైన్లు ధ్వంసమయ్యాయి. వారానికి రెండు, మూడు రోజులు మాత్రమే తాగు నీరు సరఫరా అవుతోందని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి ప్రధాన కారణం మిషన్ భగీరథ పథకం ఏర్పాటు చేసిన డబ్బా గ్రామం 70 కిలోమీటర్ల దూరంలో ఉండటమేనని భావిస్తున్నారు. వేసవిలో తరచూ పైపులైను లీకేజీలు ఏర్పడుతున్నాయి. ధర్మపురి పట్టణంలో భూగర్భజలాలు అడుగంటడంతో బోర్లలోసైతం తగినంత నీరు రావడం లేదు. చాలామంది నల్లా నీటిపైనే ఆధారపడ్డారు. ఇప్పటికైనా పాలకులు, ఉన్నతాధికారులు స్పందించి తమ అవసరాలకు అనుగుణంగా నీటిని సరఫరా చేయాలని స్థానికులు కోరుతున్నారు.

# ఎంచక్కా.. ఓట్ల లెక్క



ఆసిఫాబాద్ : పాలకుల ఎంపికలో వజ్రాయుధమైన ఓటు హక్కు నమోదు కోసం ఎన్నికల సంఘం కసరత్తు మొదలు పెట్టింది. ఓటరుగా నమోదుకు ఏటా జనవరి 1ని అర్హత తేదీగా ప్రకటించేవారు. ఈసారి ఏడాదిలో నాలుగు సార్లు అవకాశం కల్పించారు. బోగస్ ఓటర్ల తొలగింపునకు ఆధార్ అనుసంధానంపై దృష్టి సారించారు. దీంతోపాటు దరఖాస్తు ఫారాల్లోనూ కొన్ని మార్పులు చోటుచేసుకున్నాయి. కొత్త ఓటరు నమోదు, పాత జాబితాల్లో మార్పులు, చేర్పులకు సంబంధించి ప్రత్యేక ఓటర్ల సవరణ (స్పెషల్ సమ్మరీ రివిజన్(ఎస్ఎస్ఆర్)) కార్యక్రమం ఆగస్టు 1 నుంచి ప్రారంభించాలన్న ఎన్నికల సంఘం ఆదేశాలతో జిల్లా అధికారులు ఆ దిశగా చర్యలకు ఉపక్రమించారు. ఇప్పటికే పాలనాధికారి ఆధ్వర్యంలో రాజకీయ పార్టీల ప్రతినిధులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఎన్నికల అధికారులు, పర్యవేక్షకులు, బూత్ స్థాయి అధికారులకు శిక్షణ కార్యక్రమం పూర్తి చేశారు.

ఏడాదికి నాలుగు సార్లు..ఏటా జనవరి ఒకటో తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన వారికి ఓటు హక్కు నమోదుకు అవకాశం ఉండేది. ఆ తరువాత 18 ఏళ్లు నిండినవారు మరో ఏడాది పాటు వేచి చూడాల్సి వచ్చేది. ఈసారి ఏప్రిల్ 1, జులై 1, అక్టోబర్ ఒకటో తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన వారు కొత్తగా ఓటు హక్కు నమోదుకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు.

బోగస్ ఓట్లపై దృష్టి..ఏటా ఓటర్ల జాబితాల సవరణ జరుగుతున్నా.. బోగస్ ఓటర్ల ఘటనలు వెలుగుచూస్తున్నాయి. మృతిచెందిన వారి పేర్లు కూడా ఒక్కోసారి జాబితాల్లో కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో బోగస్ ఓట్లకు తావులేకుండా ఆధార్ అనుసంధానంపై దృష్టి సారించారు. ఇందుకు ఫారం-6బి కొత్తగా ప్రవేశపెట్టారు. ఆధార్ సంఖ్య ఇవ్వకుంటే ఆ ఫారంలో పొందుపర్చిన 11 ప్రత్యామ్నాయ పత్రాల్లో ఏదో ఒకటి సమర్పించవచ్చు. అయితే ఆధార్ అనుసంధానం ఓటర్ల ఐచ్ఛికమే. ఫారం-6 ద్వారా కొత్త ఓటర్ల నమోదు, ఫారం-6(ఎ) ద్వారా విదేశాల్లో నివసించేవారు ఓటు హక్కు పొందవచ్చు. ఫారం-7లో పేరు మార్పులు, తొలగింపులు(మరణ ధ్రువీకరణ తప్పనిసరి) అభ్యంతరాల స్వీకరణ ఉంటుంది. ఫారం-8 ద్వారా నివాసం మార్పు, ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి బదిలీ, నమోదులు చేసుకోవచ్చు.

నమోదు ఇలా..: బూత్‌స్థాయి అధికారుల వద్ద, తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాల్లో ఓటు హక్కు కోసం దరఖాస్తులు చేసుకోవచ్చు. అంతర్జాలంలో, మీ సేవా కేంద్రాలు, ఓటరు హెల్ప్‌లైన్ యాప్, నేషనల్ ఓటర్స్ సర్వీస్ పోర్టల్, ఈఆర్‌వో నెట్ ద్వారా దరఖాస్తులు సమర్పించవచ్చు. ఆగస్టు 1 నుంచి బీఎల్‌వోలు ఇంటింటా జాబితాలతో తిరిగి నమోదు, మార్పులు, చేర్పులకు సంబంధించిన దరఖాస్తులు స్వీకరిస్తారు.

వివిధ దశల్లో..: ఓటర్ల జాబితాపై ప్రీ రివిజన్ ఆగస్టు 4 నుంచి అక్టోబరు 24 వరకు ఉంటుంది. నవంబరు 9న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ, డిసెంబరు 8 వరకు అభ్యంతరాల స్వీకరణ ఉంటుంది. డిసెంబరు 26లోపు అభ్యంతరాలను పరిష్కరించనున్నారు. వచ్చే ఏడాది జనవరి 5న తుది జాబితాను ప్రకటిస్తారు.

# ప్రజాధనం దుర్వినియోగం..!

మంచిర్యాల : జిల్లా కేంద్రంలో ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రణాళిక లేని పనులు చేస్తూ ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్నారు. రెండు, మూడేళ్లకు ఒకసారి పురపాలక అధికారులు మారినప్పుడల్లా పాత అభివృద్ధి పనులను ధ్వంసం చేసి కొత్త పనులు చేస్తున్నారు. పట్టణంలో ఏ అభివృద్ధి చేసినా.. భవిష్యత్తు తరాల ప్రజలకు ఉపయోగపడేలా నిర్మించాల్సిన అధికారులు కమీషన్లకు కక్కుర్తిపడి అప్పటికప్పుడే పనులు చేస్తూ ప్రభుత్వ నిధులు మట్టిపాలు చేస్తున్నారు. ప్రజాధనంతో మంచిర్యాలలోని అంబేద్కర్ చౌరస్తాలో నిర్మించిన వాటర్ పౌంటేన్, 'మంచి మంచిర్యాల' సెల్ఫీ పాయింట్ ఇందుకు నిదర్శనం. మంచిర్యాల పట్టణంలోని ప్రధాన కూడళ్లలో జంక్షన్ల నిర్మాణానికి ప్రతిపాదనలు చేశారు. స్థానిక అంబేద్కర్ చౌరస్తా, టీటీడీ కళ్యాణ మండపం చౌరస్తా, బెల్లంపల్లి చౌరస్తా, లక్ష్మీసినిమా టాకీస్ చౌరస్తాల్లో జంక్షన్ల నిర్మాణం కోసం పట్టణ ప్రగతి నిధుల నుంచి దాదాపు రూ.4 కోట్ల నిధులు కేటాయించారు. ఈ పనుల నిర్మాణం కోసం డీటీసీపీ అనుమతి లభించింది. టెండర్ల నిర్వహణకు అవసరమైన అనుమతుల కోసం ఇంజినీరింగ్ ఉన్నతాధికారులకు నివేదిక పంపించారు.య స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో ఇప్పటికే పాత జంక్షన్ ఉంది. ఇప్పుడు కొత్తగా దాని చుట్టు కొలత 54 మీటర్ల సర్కిల్‌తో నిర్మించడానికి ప్రణాళిక రూపొందించారు. ఆ చౌరస్తా పక్కనే 46 అడుగుల ఎత్తు



గల హనుమాన్ విగ్రహం నిర్మించారు. దాని పక్కనే రూ.20 లక్షలతో 'మంచి మంచిర్యాల' సెల్ఫీ పాయింట్ నిర్మించారు. ఆ జంక్షన్ విస్తరణ చేస్తే అక్కడ రహదారి ఇరుకుగా మారే అవకాశం ఉండటంతో ఆ జంక్షన్‌ను 50 మీటర్ల సర్కిల్‌కు కుదింపు చేసి ప్రతిపాదనలు పంపారు.య పట్టణంలోని రైల్వే ఎత్తు వంతెన నుంచి అంబేద్కర్ చౌరస్తా మీదుగా ఆదిత్య ఇంక్లైన్ వరకు జాతీయ రహదారి విస్తరణ కోసం రెండు నెలల కింద రూ.10 కోట్ల నిధులు మంజూరు అయ్యాయి. అంబేద్కర్ చౌరస్తా నుంచి క్యాతన్‌పల్లి పురపాలక సంఘం ఎక్స్ రోడ్డు వరకు రహదారి విస్తరణ కోసం గతంలో ప్రతిపాదనలు చేశారు. ఈ రెండు రహదారుల విస్తరణ చేయకముందే అక్కడ జంక్షన్ నిర్మిస్తే ఆ చౌరస్తా సర్కిల్ ఏ పక్కకు వస్తుందో తెలియని పరిస్థితి ఉంది. అప్పుడు మున్సిపల్ అధికారులు మారితే కొత్త కట్టిన జంక్షన్‌ను కూడా కూల్చివేసే మళ్లీ కట్టే ప్రజాధనం దుర్వినియోగం చేసే ప్రమాదం ఉందని ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. ముందు రహదారుల విస్తరణ చేసిన తర్వాత ప్రధాన కూడళ్లలో జంక్షన్లు నిర్మిస్తే భవిష్యత్తులో మళ్లీ మార్పులుండ ఉంటుందని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. మంచిర్యాల అంబేద్కర్ చౌరస్తాలో గతంలో నిర్వహించిన పుష్కరాల సమయంలో సుందరీకరణ కోసం రూ.5 లక్షలతో వాటర్ పౌంటేన్స్ నిర్మించారు. అవి ఎప్పుడు మరమ్మతులకు గురవుతునే ఉంటాయి. పండుగలు, ఏవైనా వేడుకలు జరిగినప్పుడు వాటిని మరమ్మతులు చేసి వినియోగంలోకి తెస్తారు. ఇప్పుడు కొత్తగా నిర్మించనున్న జంక్షన్ కారణంగా ఆ పౌంటేన్లను తొలగించనున్నారు. గతంలో ముందు చూపు లేకుండా చేసిన పనులతో ఇప్పుడు ప్రజాధనం దుర్వినియోగం కానుంది. అంబేద్కర్ చౌరస్తాలో ఆరు నెలల కిందట రూ.20 లక్షలతో 'మంచి మంచిర్యాల సెల్ఫీ పాయింట్' నిర్మించారు. అక్కడ తెలుగు అక్షరాలతో ఊరు పేరు రాసి, గ్రీనరీ ఏర్పాటు చేశారు. దాని పక్కన గోడకు రంగులు వేశారు. తాజాగా ఆ గోడ సగ భాగం కూల్చి వేసి అక్కడ మరో రూ.26 లక్షలతో 150 అడుగుల ఎత్తుతో జాతీయ జెండా నిర్మిచడానికి పనులు చేపట్టారు. ఆ గోడ లోపలి భాగంలో రూ.7 కోట్లతో సమీకృత కూరగాయల మార్కెట్ భవనం నిర్మిస్తున్నారు.

# మదించి.. మడిని తడిపె

ఆసిఫాబాద్ : పెంచికల్‌పేట్: ఆ ఊరికి తలాపునే చెరువు.. నిండుకుండలా నీరు ఉన్నా.. కాలువలు సరిగా లేకపోవడంతో ఆయకట్టుకు నీరందని దుస్థితి. పొలాలను బీడుగా ఉంచలేక తప్పనిసరి పరిస్థితుల్లో ఆయిల్ ఇంజిన్ పెట్టి నీటిని వాడుకున్నా.. ఇంధన ఖర్చులు తడిసి మోపెడయ్యేవి. మరోవైపు ఆయిల్ ఇంజిన్లు సైతం తరచూ మొరాయించడం.. మరమ్మతులకు జాప్యం కావడంతో పంటలు మధ్యలోనే ఎండి దిగుబడిపై ప్రభావం పడేది. ఈ నేపథ్యంలో ఓ యువకుడి ఆలోచన నయాపైసా ఖర్చు లేకుండా పొలాలను తడుపుతోంది. కుమురం భీం జిల్లా పెంచికల్‌పేట్ మండలంలోని మేరేగూడ సమీపంలో ఉన్న బొక్కివాగు చెరువు పరిధిలో 3 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. తూములు, కాలువలు సరిగ్గా లేకపోవడంతో రెండు కాలువల్లో ఏళ్లుగా నీరు పారడం లేదు. ఈ నేపథ్యంలో చెరువు కిందే భూములున్నా, చుక్కనీరు పంటకు అందించలేని దుస్థితి. ఆయిల్ ఇంజిన్లతో అన్నదాతలు పడుతున్న ఇబ్బందులను చూసిన పెంచికల్‌పేట్కు చెందిన యువకుడు బిశ్వాస బబ్లూ ఆలోచనతో ప్రస్తుతం చెరువు కింది భాగంలో ఉన్న 250 ఎకరాల్లో అన్నదాతలు ఏడాదికి రెండు పంటలను పండిస్తున్నారు.

ఎలా అంటే..: కట్ట మీద నుంచి చెరువులోపల జలాలు 40 అడుగుల వరకు ఉన్నాయి. కట్ట కింది భాగంలో అన్నదాతల పొలాలు ఉన్నాయి. రైతుల చేల వరకు పైప్‌లైన్ వేసి, అందులో నీళ్లు నింపి గేట్వాల్ అమర్చారు. మరోవైపు సైతం పైపులో నీళ్లు నింపి గేట్వాల్ బిగిస్తారు. ఒకవైపు పైపును చెరువులో ఉంచి, మరోవైపు చేలో ఉండేలా ఏర్పాటు చేస్తున్నారు. చెరువులో వేసిన అనంతరం పైప్‌లైన్ గేట్వాల్ తొలగించడంతో నీరు పొలాలకు ఉరకలెత్తుతోంది.

ఆయిల్ ఇంజిన్ కష్టాలు చూడలేకే..

రూ.30 వేలు వెచ్చించి మేరేగూడకు చెందిన రైతు బాపు ఆయిల్ ఇంజిన్‌ను గతేడాది కొనుగోలు చేశారు. పది ఎకరాల్లో సాగు చేసే వరి పంటకు నీళ్లు అందించడానికి నిత్యం రూ.1200 నుంచి రూ.1500 వరకు డీజిల్‌కు ఖర్చయ్యేది. వారం పాటు పనిచేసిన ఆయిల్ ఇంజిన్ మొరాయించింది. ఇంజిన్లకు మరమ్మతులు చేసే బిశ్వాస్ బబ్లూ రైతుల అవస్థలను చూసి చలించిపోయాడు. ఈక్రమంలో గేట్వాల్ ఆధారంగా బాపు పొలంలోకి నీళ్లు వచ్చే విధంగా చేశారు. ఈ ప్రాంతమంతా ఇసుక నేలలు కావడంతో త్వరగా నీళ్లు ఇంకిపోయేవి. ప్రస్తుతం రూపాయి ఖర్చు లేకుండా నిరంతరం పంటకు నీరందుతుండటంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. బాపును చూసి మరో 50 నుంచి 60 మంది రైతులు ఇదే విధంగా దాదాపు 300 మీటర్ల వరకు సైతం పైపులు వేసి వరి పండిస్తున్నారు. యువకుడి ఆలోచన చిన్నదే అయినా.. అన్నదాతలకు మేలు చేయడంతో అందరూ అభినందిస్తున్నారు.

# జలం కలుషితం.. జనం సతమతం



ఆసిఫాబాద్ : వర్షాకాలంలోనూ జిల్లా ప్రజలకు తాగునీటి అవస్థలు తప్పడం లేదు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల బావులు, చేతిపంపుల్లో భూగర్భజలాలు నిండి రంగు మారాయి. మిషన్ భగీరథ నీరు పూర్తిస్థాయిలో సరఫరా కావడం లేదు. దీంతో మారుమూల గ్రామాల ప్రజలు మరో గత్యంతరం లేక కలుషిత నీటినే తాగుతున్నారు. బావుల్లో కనీసం క్లోరినేషన్ సైతం చేయకపోవడం వల్ల ఈ నీటిని తాగి ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. తాజాగా బెజ్జూరు మండలం సలుగుపల్లిలో ఒకే గ్రామంలో 15 మంది వరకు అస్వస్థతకు గురయ్యారు.

ఏటా జిల్లావాసులను సీజనల్ వ్యాధులు పట్టి పీడిస్తున్నాయి. ఇందులో ముఖ్యంగా కలుషిత నీటితోనే ఎక్కువగా వ్యాప్తి చెందే డయేరియా, టైఫాయిడ్ రోగాలతోనే మన్యం ప్రజలు మంచం పడుతున్నారు. రహదారులు సరిగాలేక, సకాలంలో వైద్య సేవలు అందక పలువురు మృత్యువాత పడుతున్నారు. అన్ని గ్రామాలకు మిషన్ భగీరథ పైప్‌లైన్లు వేసినా నీటిసరఫరా అంతంత మాత్రమే. జిల్లాలో ప్రస్తుతం నిత్యం వందల సంఖ్యలో టైఫాయిడ్, డయేరియా కేసులు నమోదవుతున్నాయి. మరోవైపు మురుగు కాలువల్లో పైప్‌లైన్లు వేయడంతో లీకేజీల వల్ల సైతం నీరు కలుషితమవుతోంది. పంచాయతీ, మిషన్ భగీరథ, ఇంట్రా అధికారులు సమన్వయంతో పనిచేస్తేనే ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు లభించే అవకాశం ఉంది.

మురుగుకాలువల్లోనే పైపులైన్లు..కాగజ్‌నగర్ పట్టణంలో మిషన్ భగీరథ అర్బన్ పనులకు రూ.3 కోట్లు కేటాయించారు. అయిదు సంవత్సరాల నుంచి ఈ పనులు పూర్తి కావడం లేదు. పెద్దవాగులో నిర్మించిన మూడు ఊటబావులు ఏటా వరదల ధాటికి కొట్టుకుపోతున్నాయి. దీంతో అనేక వార్డులో తాగునీటి సమస్య నెలకొంది. ఆసిఫాబాద్ పట్టణంలో అనేక కాలనీల్లో పైపులు మురుగు కాలువల్లోనే ఉన్నాయి. లీకేజీల సమస్య నిత్యం వేధిస్తోంది. కలుషిత ముప్పు పొంచి ఉంది.

సలుగుపల్లిలో పలువురికి అస్వస్థత..

బెజ్జూరు మండలం సలుగుపల్లి గ్రామంలో పలువురు అస్వస్థతకు గురయ్యారు. పెరమలవాడ, ఎస్సీ కాలనీలో రెండురోజుల నుంచి ఒకరిద్దరికి విరేచనాలు, వాంతులు మొదలయ్యాయి. ఆదివారం ఉదయం నుంచి 15 మందికిపైగా అస్వస్థతకు గురవడంతో వైద్యశిబిరం ఏర్పాటు చేసి వైద్యసేవలందించారు. కొందరిని 108 వాహనంలో కాగజ్‌నగర్ ఆసుపత్రికి పంపించగా.. మరికొంత మందిని బెజ్జూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వారంతా గ్రామ పొలిమేరలో చేతిపంపు నీరునే తాగుతారు. చేతిపంపు చుట్టూ అపరిశుభ్రత నెలకొంది. నీరు కలుషితమై డయేరియా ప్రబలుతున్నట్లు భావిస్తున్నారు.

లీకేజీలతో ముప్పుఆసిఫాబాద్ పట్టణంలోని డీఎస్పీ కార్యాలయం ఎదుట పైప్‌లైన్‌కు లీకేజీ ఏర్పడింది. ఈ మార్గం గుండానే సందీప్‌నగర్, బ్రహ్మణవాడ, కసబ్‌వాడతో పాటు పలు కాలనీలకు తాగునీటి సరఫరా అవుతోంది.

జాడలేని భగీరథ నీరు..

తిర్యాణి మండలానికి మిషన్ భగీరథ నీళ్లే రావడం లేదు. ప్రజలు గత్యంతరం లేక చేతిపంపులు, బావుల నీరే తాగుతున్నారు. జెండగూడ గ్రామంలో చేతిపంపు నీరు రంగు మారి వస్తుంది. గోవెన నయకపుగూడ, భీమన్‌గొంది ప్రాంతాల్లో రంగుమారిన బావుల నీరే తాగి ప్రజలు రోగాల బారిన పడుతున్నారు.

చేతిపంపుల నీరే దిక్కు.. లింగాపూర్ మండలం చోర్‌పల్లి ప్రాంతంలో పదుల సంఖ్యలో పల్లెలు ఉన్నాయి. ఇక్కడ సంపు సైతం నిర్మించారు. తాగునీరు మాత్రం సరఫరా చేయడం చేయకపోవడంతో ఈ ప్రాంత ప్రజలందరూ బావులు, చేతిపంపుల నీరే తాగుతున్నారు.

# యజమానుల నిర్లక్ష్యం.. అధికారుల అలసత్వం..!

నిర్మల్ : ఎవరైనా నిర్లక్ష్యం చేస్తే సంబంధిత అధికారులు అడ్డుకోవాలి. నివారణపై దృష్టి సారించాలి. కాని, వారూ అదే వైఖరి అవలంభిస్తే ఇక ప్రజలకు ఎదురయ్యే ఇబ్బందులు వర్ణనాతీతం. దానికి నిదర్శనమే జిల్లాకేంద్రంలో పశు సంచారం వ్యవహారం. అదీ ప్రధాన రహదారులపై. చూసేందుకు, వినేందుకు ఇది చిన్న విషయంలాగే అనిపించినా.. దీనివల్ల కలిగే అనర్థాలతో దెబ్బతిన్నవారికి అదెంత తీవ్రమైనదో అవగతమవుతోంది. ఎప్పటికప్పుడు బాధ్యులపై చర్యలు తీసుకుంటామంటూ హెచ్చరిస్తున్న అధికారులు కేవలం ప్రకటనలకే పరిమితమవుతుండటంతో పరిస్థితిలో మార్పురావడం లేదు.

అక్కడ ఇక్కడ అని తేడాలేకుండా..

సాధారణంగా రహదారులపై ఎక్కడైనా డివైడర్లుంటాయి. వ్యాపారధోరణితో ఆలోచించే పాలకులు, అధికారులుంటే ప్రచారబోర్డులు కనిపిస్తుంటాయి. కానీ పట్టణంలో వీటితోపాటు పశువులు ఉంటున్నాయి. వినడానికి ఆశ్చర్యంగా ఉన్నా ఇది నిజం. మేకలు, ఆవులు విచ్చలవిడిగా ఎక్కడపడితే అక్కడ కనిపిస్తుంటాయి. నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే 44, 61వ జాతీయ రహదారులపై స్థానిక బైల్‌బజార్ నుంచి శివాజీచౌక్ వరకు, ఈద్‌గాం నుంచి శాంతినగర్ వరకు ఈ పశుసంచారం కనిపిస్తూ ఉంటుంది. వీటివల్ల వాహనదారులకు తీవ్ర అంతరాయం కలుగుతోంది.

తరచూ ప్రమాదాలు

ఉదయం, రాత్రి తేడాలేకుండా పశువులు రహదార్లపై సంచరిస్తుండటంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. గతంలో చైన్‌గేట్ సమీపంలో పశువులను తప్పించబోయే ద్విచక్రవాహనం అదుపుతప్పటంతో దానిపై ప్రయాణిస్తున్న భార్యాభర్తలకు స్వల్పగాయాలయ్యాయి. మినీట్యాంక్‌బండ్ ప్రాంతంలో ఇదే రీతిలో అదుపుతప్పి వాహనం కిందపడటంతో ఓ వివాహిత గాయపడి మృతిచెందింది. తాజాగా.. కడెం మండలానికి చెందిన ఓ యువకుడు ఎస్సై ప్రిలిమినరీ పరీక్ష కోసం వస్తూ వాహనం అదుపుతప్పి పడటంతో పరీక్షకు ఆలస్యమయ్యాడు. ఫలితంగా ఉద్యోగ అవకాశాన్ని కోల్పోవాల్సి వచ్చింది. ఇలాంటి సంఘటనలు తరచూ ఎక్కడోచోట జరుగుతూనే ఉన్నాయి. దీనికితోడు పట్టణంలోని వివిధ మార్గాల్లో రహదార్లపై ఉన్న వీధిదీపాలు, సెంట్రల్‌లైటింగ్ సైతం సక్రమంగా పనిచేయడం లేదు. ఫలితంగా రాత్రివేళల్లో ప్రయాణించేవారు రోడ్లపై ఉన్న పశువులను గుర్తించలేకపోతున్నారు. చాలామంది వాహనదారులు వాటిని తప్పించే క్రమంలో అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. ఒక్కోసారి ట్రాఫిక్ సైతం నిలిచిపోయి ప్రజలు ఇక్కట్లు పడాల్సివస్తోంది.

కానరాని చర్యలు..పశుపోషణకు అవసరమైన మేతను ఇవ్వలేక కొందరు పశువులను వదిలేస్తున్నారు. దీంతో అవి ఆహారంకోసం రోడ్లపైకి చేరుతున్నాయి. రోడ్లపక్కన కనిపించే చెత్తచెదారం మేస్తూ అక్కడే రోడ్లపైనే ఉంటున్నాయి. ఒక్కోసారి ఎటుపడితే అటు పరిగెత్తడం, రోడ్లపైనే ఉండిపోవడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటిని నిలువరించాలని స్థానికులు ఎన్నిసార్లు ఫిర్యాదుచేసినా స్పందన కనిపించడం లేదు. రహదారులపై పశువులను స్వేచ్ఛగా వదిలేయొద్దని, అలాంటి వ్యక్తులకు నోటీసులు జారీచేసి పశువులను గోశాలకు తరలిస్తామని పురపాలకశాఖ అధికారులు తరచూ ప్రకటిస్తున్నారు.

# కాన్పుకో కానుక..!

ఆదిలాబాద్ : మహిళల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని సహజ కాన్పులు ఎక్కువగా చేయాలని వైద్య శాఖ సూచిస్తోంది. ఈ విషయమై మంత్రి హరీష్‌రావు ప్రతి నెలా జిల్లా వైద్యాధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నారు. అయినా ఆశించిన స్థాయిలో సహజ ప్రసవాలు జరగడం లేదు. ప్రపంచ ఆరోగ్య సంస్థ నిబంధనల మేరకు 85 శాతం సాధారణ ప్రసవాలు చేయాలి. కానీ ఈ మేరకు లక్ష్యం మాత్రం నెరవేరడం లేదు. దీంతో సహజ కాన్పులు ప్రోత్సహించడానికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి బోధనాసుపత్రి వరకు నగదు ప్రోత్సాహకం అందించడానికి ఆరోగ్య శాఖ కార్యదర్శి రిజ్వి రెండు రోజుల కిందట ఉత్తర్వులు జారీ చేశారు. నిర్దేశిత లక్ష్యం అనంతరం చేసిన ప్రతి సాధారణ ప్రసవానికి రూ.3 వేల చొప్పున అందించనున్నట్లు ప్రకటించారు.



జిల్లాలో ఇలా..జిల్లాలో గతేడాది 8,825 ప్రసవాలు ప్రభుత్వ ఆసుపత్రుల్లో జరగగా.. వీటిలో సాధారణం 6,363 (72.10శాతం) మాత్రమే జరిగాయి. ఈ ఏడాదిలో 2,127 కాన్పులు జరగగా వీటిలో సహజ కాన్పులు 1,547 (72.73 శాతం) మాత్రమే జరిగాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ, రాష్ట్ర వైద్యారోగ్య శాఖ నిబంధనల మేరకు 85 శాతం సాధారణ ప్రసవాలకు పైబడి చేసిన వాటికి మాత్రమే ప్రోత్సాహకం వర్తిస్తుంది. కానీ జిల్లాలో గతేడాది, ఈ ఏడాది సైతం ఈ నిబంధనల మేరకు సాధారణ కాన్పులు జరగలేదు. మరో 13శాతం సాధారణ కాన్పులు చేయగలిగితేనే ఈ ప్రోత్సాహకానికి అర్హత సాధిస్తారు. ఈ ప్రోత్సాహకంతోనైనా ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాలు పెరుగుతాయా? అనేది వేచి చూడాల్సిందే.

నిబంధనలు ఇలా..ప్రపంచ ఆరోగ్య సంస్థ నిబంధనల ప్రకారం కనీసం 85శాతం సాధారణ కాన్పులు చేయాలి. దీన్నే మైలురాయిగా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. 85శాతానికి పైగా చేసిన వాటిని లెక్కించి రూ.మూడు వేల నగదు ప్రోత్సాహం అందించటానికి నిర్ణయించారు. బోధనాసుపత్రుల్లో 350, మాతా శిశు సంరక్షణ ఆసుపత్రుల్లో 250, ప్రాంతీయ ఆసుపత్రుల్లో 150, సామాజిక కేంద్రాల్లో 50, 24 గంటలు ఉండే పీహెచ్‌సీల్లో 10, పట్టణ/గ్రామీణ పీహెచ్‌సీల్లో 5 చొప్పున నెలకి సాధారణ ప్రసవాలు చేయాలన్న నిబంధనలు విధించారు.

# చిన్నారుల సేవలో పదేళ్లు

భద్రాచలం : ప్రభుత్వ ప్రాంతీయ ఆస్పత్రి ప్రాంగణంలోని ప్రత్యేక నవజాత శిశు చికిత్సా కేంద్రం మన్యంలో విశేష సేవలు అందిస్తూ పదేళ్లు పూర్తి చేసుకుంది. పసిబిడ్డల ప్రాణాలను కాపాడటంలో పేరుగాంచిన ఈ విభాగం ఈ పదేళ్లలో ఎన్నో అద్భుతాలను ఆవిష్కరించింది. పిల్లల వైద్య నిపుణులు పర్యవేక్షణతో జాతీయ స్థాయి గుర్తింపు పొందింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2012 ఆగస్టు 8న నాటి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి మన్యం పర్యటనలో భాగంగా భద్రాచలంలో ఆగి ఈ విభాగాన్ని ప్రారంభించారు. మొదట్లో 10 పడకలు ఉండేవి. ఆ తర్వాత ఇక్కడ అవసరాలను గుర్తించిన ప్రభుత్వం దీన్ని రెట్టింపు చేయడంతో ఇప్పుడు 20 పడకల (వార్మర్ల) ఆసుపత్రి అందుబాటులో ఉంది.

విస్తరిస్తే బాగు ప్రారంభం నుంచి ఇప్పటి వరకు విశ్రాంత సూపరింటెండెంట్ డా.కైలాశ్‌మోహన్ పిల్లలకు వైద్య సేవలు అందిస్తున్నారు. మరో వైద్యుడు డా.విజయ్‌రావు సేవలు కొనసాగిస్తున్నారు. నోడల్ అధికారిగా డా.కె.విజయ్ ఈ విభాగాన్ని పర్యవేక్షిస్తున్నారు. నిపుణులైన స్టాఫ్ నర్సులు, ఇతర సిబ్బంది సేవలు అందిస్తున్నారు. సూపరింటెండెంట్




రామకృష్ణ నేతృత్వంలో ఇటీవల అభివృద్ధి పనులు చేపట్టారు. ప్రిమెచ్యూర్, బరువు తక్కువగా ఉండడం, ఉమ్మనీరు తాగడం, ఇన్‌ఫెక్షన్ సోకడం, ఫిట్స్, నిమ్ము రావడం, గుండె జబ్బు, పేగు మడత, పుట్టినప్పుడు ఏడుపు లేకపోవడం వంటి సమస్యలతో పుట్టిన చిన్నారులను వెంటనే ఇక్కడ చేర్పిస్తుంటారు. 5-15 రోజుల లోపు నయం అయిన వారిని ఇంటికి పంపిస్తున్నారు. సిబ్బంది సహకారంతో కేజీ లోపు చిన్నారులనూ కాపాడిన సంఘటనలున్నాయి. ఇక్కడ అందిస్తున్న ఉత్తమ సేవలను గుర్తించి గతేడాది డిసెంబరులో నేషనల్ నియోనటాలజీ ఫోరం నుంచి ధ్రువీకరణ పత్రం జారీ చేసింది. వైద్య ఆరోగ్య శాఖ నుంచి ఏప్రిల్ 7న ప్రశంసా పత్రం అందింది. పలు సంఘాలు అభినందించాయి. చుట్టు పక్కల మండలాల ప్రజలకు భరోసాగా ఇస్తోంది.

# ఆచితూచి.. 'సాగు'తూ..

ఖమ్మం: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో వానాకాలం సీజన్ నెమ్మదిగా సాగుతోంది. అధిక వర్షాలు, భారీ వరదలు ముంచెత్తుతుండటంతో రైతులు పంటల సాగులో ఆచితూచి అడుగులు వేస్తున్నారు. ఉభయ జిల్లాల్లో ఈసారి సంప్రదాయ పంటల సాగు విస్తీర్ణం గణనీయంగా పెరుగుతుందని వ్యవసాయశాఖ అంచనా వేసింది. క్షేత్రస్థాయిలో ప్రస్తుతం ఆ పరిస్థితి కనిపించడంలేదు. ఇప్పటికే పత్తి సీజన్ పూర్తవ్వగా.. వరికి ముగింపు సమయం దగ్గర పడుతోంది. ఇక మిగిలింది మిరప సాగే. ఖమ్మం జిల్లాలో ఇప్పటి వరకు 46.75 శాతం, భద్రాద్రి జిల్లాలో 24.29 శాతమే వివిధ పంటలు సాగైనట్లు వ్యవసాయశాఖ లెక్కలు చెబుతున్నాయి.

వరుణుడే అడ్డంకి..ఈ సీజన్‌లో తొలకరి జల్లులు కురిసిన వెంటనే కర్షకులు పొలం పనుల్లో నిమగ్నమయ్యారు. జూన్ నుంచే వర్షాలు క్రమంగా పెరగడంతో ఉభయ జిల్లాల్లో సాగు సందడి నెలకొంది. సకాలంలోనే పత్తి విత్తి, వరి నార్లు పోసుకున్నారు. జులైలో అధిక వర్షాలు కురవడం, భారీ వరదలతో కర్షకులకు కష్టాలు మొదలయ్యాయి. కొన్ని మండలాల్లో అప్పటికే సాగు చేసిన పంటలన్నీ వరద ఉద్ధృతికి కొట్టుకుపోయాయి. తర్వాతైనా పంటలు సాగు చేసే పరిస్థితి లేక మిన్నుకుండిపోయారు. ఈ ప్రభావం పంటల సాగుపై తీవ్రంగా పడింది. ఆగస్టు మొదటి వారం పూర్తవుతున్నా.. అనుకున్న స్థాయిలో పంటలు సాగవ్వలేదు.

# ఏపీలో కొత్త ఎమ్మెల్సీలకు జీతాల్లేవా? ఏమైంది?



అమరావతి : ఏపీలో ఖాళీ అయిన ఎమ్మెల్సీ స్థానాలకు ఈ మధ్య ఎన్నికలు నిర్వహించటం తెలిసిందే. స్థానిక.. పట్టభద్రుల స్థానాలకు జరిగిన ఎన్నికలతో మొత్తంగా 21 మంది కొత్త ఎమ్మెల్సీలు ఈ మధ్యనే బాధ్యతలు చేపట్టిన సంగతి తెలిసిందే.

నెల గడిచిన తర్వాత కూడా వీరికి జీతాలు పడని వైనం చర్చకు దారి తీసింది. ప్రతి విషయాన్ని.. తిప్పి తిప్పి.. జగన్ సర్కారుకు ఏదోలా అపాదించేస్తున్న వైఖరికి తగ్గట్లే.. తాజాగా కొత్త ఎమ్మెల్సీలకు జీతాలు పడకపోవటాన్ని కూడా అదేలా ప్రచారం చేసే ప్రయత్నం మొదలైంది. ప్రభుత్వ ఉద్యోగులకు ఏ రీతిలో అయితే జీతాలు టైంకు పడవో.. కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్సీల జీతాల విషయంలోనూ అదే తీరును ప్రదర్శిస్తారా? అంటూ కొత్త ప్రచారాన్ని షురూ చేశారు. అయితే.. జరిగింది ఒకటైతే.. జరుగుతున్న ప్రచారం మరొకటన్నది చెప్పాలి. ఎందుకంటే.. కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్సీలకు జీతాలు పడకపోవటం వెనుక సాంకేతిక కారణాలే తప్పించి.. మరెలాంటి కారణాలు లేకపోవటమే దీనికి కారణం. 21 మంది ఎమ్మెల్సీల్లో 19 మంది ఎమ్మెల్సీల ఐడీలు ఒక కొలిక్కి వచ్చాయని.. వారికి వారంలో జీతాలు పడతాయని స్పష్టం చేస్తున్నారు. ఎందుకింత ఆలస్యం అంటే.. పదవీ విరమణ చేసిన ఎమ్మెల్సీల ఖాతాల్ని సెటిల్ చేసిన తర్వాత.. వారి స్థానంలో కొత్తగా వచ్చిన వారికి కేటాయింపులు చేస్తారు. మొత్తం 21 మందిలో పద్నాలుగు మంది మార్చి 30నుంచి పదవుల్ని చేపట్టగా.. మిగిలిన ఏడుగురు మే ఒకటో తేదీ నుంచి వారి పదవీకాలం మొదలైంది. అంటే.. పద్నాలుగు మందికి రెండు నెలలు.. ఏడుగురికి ఒక నెల జీతం అందాల్సి ఉంది.

అయితే.. వీరిలో ఎవరికి జీతాలు రాకపోవటానికి కారణం.. సీఎఫ్ఎంఎస్ లో జీతాల కోసం వారికి ప్రత్యేకమైన ఖాతా ఏర్పాటు చేయాల్సి రావటమే. దీనికి సంబంధించిన టెక్నికల్ ఇష్యూస్ తోనే జీతాలు పడలేదని వెల్లడించారు. జీతాలు ఇచ్చేందుకు పూర్తి చేయాల్సిన అంశాలకు సంబంధించిన సాంకేతిక సమస్యలతోనే జీతాలు పడలేదని.. మొదటి రెండు నెలల్లో ఇలాంటి ఇబ్బందులు సహజమని వారు స్పష్టం చేస్తున్నారు. మొత్తం 21 మంది కొత్త ఎమ్మెల్సీల్లో 19 మందికి ఐడీలు క్రియేట్ కాగా.. టీడీపీకి చెందిన ఇద్దరు ఎమ్మెల్సీల అప్లికేషన్లు.. వారి సమాచారం రాలేదంటున్నారు. అందుకే.. వారి జీతాల ఐడీ క్రియేట్ కాలేదని చెబుతున్నారు. మిగిలినవారికి మరో వారంలో జీతాలు పడితే.. ఇద్దరు టీడీపీ ఎమ్మెల్సీలకు మాత్రం ఈ నెల కూడా జీతం రాదంటున్నారు. కారణం.. వారు ఇప్పటికి జీతాల ఐడీల కోసం అప్లికేషన్లు ఇవ్వకపోవటమేనని చెప్పాలి.

# జగన్ను రెచ్చగొడుతున్నారా ?



అమరావతి : జగన్మోహన్ రెడ్డి విషయం లో బీజేపీ సడెన్ గా గేమ్ చేంజేసిందా ? గ్రౌండ్ లెవల్లో జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే ఇదే అనుమానాలు పెరిగిపోతున్నాయి. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా హైదరాబాద్ కు వచ్చారు. ఈ నేపధ్యంలో జగన్ తీవ్రంగా వ్యతిరేకించే మీడియా యాజమాని ని ప్రత్యేకంగా భేటీ అవుతున్నారు. వీళ్ళద్దరికీ మధ్య ఎలాంటి చర్చలు జరుగుతాయనే విషయం అర్థంకాకపోవటానికి బ్రహ్మపదార్ధమేమీ కాదు. జగన్ వ్యతిరేక స్టాండ్ తీసుకున్న కారణంగా యజమాని తన వాదన వినిపిస్తారు. ఇదే సమయం లో రాబోయే ఎన్నికల్లో మీడియా మద్దతు ను అమిత్ షా కోరుతారు. పనిలో పనిగా క్షేత్రస్థాయిలో పరిస్థితుల పైన కూడా చర్చలు జరుగుతాయి. ఏపీ లో బీజేపీ బలం జీరో. కానీ తెలంగాణా నేతలు మాత్రం అధికారం లోకి రాబోయేది తామే అంటూ ఊగిపోతున్నారు. ఇందులో ఎంతనిజముంది ? క్షేత్రస్థాయి ఫీడ్ బ్యాక్ ఏమిటనే విషయాలు వీళ్ళిద్దరి మధ్య చర్చలు జరిగే అవకాశాలున్నాయి. కేసీయార్ కు వ్యతిరేకంగా తీసుకోవాల్సిన చర్యలు అనుసరించాల్సిన వ్యూహాల పైన కూడా చర్చలు జరుగుతాయనటంలో సందేహంలేదు. మూడు రోజుల క్రితమే వైజాగ్ బహిరంగసభలో జగన్ పై అమిత్ షా రెచ్చిపోయారు. గతం లో ఎప్పుడూ చేయని ఆరోపణల ను బహిరంగ సభలో అమిత్ చేశారు. అంతకు రెండు రోజుల ముందు శ్రీకాళహస్తిలో జరిగిన మరో బహిరంగ సభలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా కూడా జగన్ పాలన పైన విరుచుకుపడ్డారు. నిజంగా ఇలాంటి మార్పు ఎవరు ఊహించలేదనే చెప్పాలి. జగన్ విషయంలో ఒక్క సారిగా బీజేపీ లేదా కేంద్ర ప్రభుత్వం ఎందుకిలాంటి స్టాండ్ తీసుకున్నదో ఎవరికీ అర్ధంకావటంలేదు. ఇదంతా రెండు పార్టీల మధ్య మొదలైన డ్రామాగా కొట్టి పారేసే వాళ్ళున్నారు.

లేదు లేదు చంద్రబాబునాయుడు తో పొత్తు పెట్టు కోవాలని బీజేపీ అనుకున్నది కాబట్టే సడెన్ గా బీజేపీ స్టాంగ్ మార్చుకున్నదని వాదించే వాళ్ళూ ఉన్నారు. రాజకీయంగా ఎన్నోసార్లు విభేదించుకుంటారు లేదా మద్దతు తీసుకోవటమన్నది చాలా సహజమే. కానీ పనిగట్టుకుని జగన్ తీవ్రంగా వ్యతిరేకిస్తున్న మీడియా యాజమాన్యాన్ని కలవటం అన్నది ఇంట్రెస్టింగ్ పాయింట్ అనే చెప్పాలి. అందుకనే తెలుగు రాష్ట్రాల్లో బీజేపీ స్ట్రాటజీ ఒకపట్టాన అర్ధంకావటంలేదు.




# 28న 'అమ్మ ఒడి'.. ఏపీ సర్కార్ కీలక మార్గదర్శకాలు జారీ..

అమరావతి: జగనన్న అమ్మఒడి 2022-23 పథకం అమలుకు ప్రభుత్వం శుక్రవారం మార్గదర్శుకాలు జారీ చేసింది. తమ పిల్లలను పాఠశాలలు, జూనియర్ కళాశాలలకు పంపుతున్న తల్లుల ఖాతాల్లో ఈ నెల 28న అమ్మఒడి నగదును జమ చేయనుంది. కుటుంబంలో చదువుకుంటున్న పిల్లల సంఖ్యతో సంబంధం లేకుండా తల్లి/సంరక్షకుడు ఏటా రూ.15 వేలు చొప్పున పొందచ్చని పేర్కొంది. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం.. దారిద్ర్యరేఖకు దిగువనున్న కుటుంబానికి చెందిన విద్యార్థులు తల్లులు పథకానికి అర్హులు. పేదరికంలో ఉన్న కుటుంబాల ఆదాయం గ్రామాల్లో నెలకు రూ.10 వేలు, పట్టణాల్లో రూ.12 వేలుకు మించకూడదు. ఆదాయపన్ను చెల్లించే వారు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వోద్యోగులు, ప్రభుత్వ పెన్షనర్లు అమ్మఒడికి అర్హులు కాదని ప్రభుత్వం స్పష్టం చేసింది. వ్యవసాయ భూమిలో మెట్ట అయితే 10 ఎకరాల్లోపు, మాగాణి భూమి 3 ఎకరాల్లోపు, రెండూ కలిపి ఉంటే 10 ఎకరాల్లోపు ఉండాలి. విద్యుత్ గరిష్ట వినియోగం నెలకు 300 యూనిట్లు మించనివారు కూడా అర్హులే. నాలుగు చక్రాల వాహన యజమానులకు సంబంధించి డ్రైవర్లు సొంతంగా నడుపుకునే ట్యాక్సీలతో పాటు ట్రాక్టర్లు, ఆటోలకు కూడా మినహాయింపునిచ్చింది. వీరు అమ్మఒడి పథకానికి అర్హులే. పట్టణాల్లో స్థిరాస్తికి సంబంధించి ఇంటి విస్తీర్ణం 1,000 చదరపు అడుగులు మించకుండా ఉంటే అమ్మఒడిని వర్తింపజేస్తారు. పదో తరగతి తర్వాత ఇంటర్మీడియెట్ కాకుండా పాలిటెక్నిక్, ట్రిపుల్ ఐటీ వంటి కోర్సుల్లో చేరేవారికి జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన పథకాలను అమలు చేస్తారు.

# ఏపీ ప్రజలకు తీపికబురు.. మరో 3 రోజుల్లో..

విశాఖపట్నం/ అమరావతి: నిప్పుల కుంపటిని తలపిస్తున్న ఉష్ణోగ్రతలతో అల్లాడుతున్న ప్రజలకు తీపికబురు. మరో మూడు రోజుల్లో అంటే ఈ నెల 18-21 మధ్య రాష్ట్రంలో రుతుపవనాలు విస్తరించడానికి అనుకూల పరిస్థితులు ఉన్నాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. దీంతో 19 నుంచి చిత్తూరు, అన్నమయ్య, వైఎస్సార్, తిరుపతి, శ్రీ సత్యసాయి జిల్లాల్లో అనేక చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, అక్కడక్కడ భారీ వర్షాలు కురవవచ్చని వెల్లడించారు. కోస్తాంధ్రలో కొన్నిచోట్ల ఉరుములు, మెరుపులు, పిడుగులతో కూడిన వర్షాలకు ఆస్కారం ఉందని పేర్కొన్నారు. గంటకు 30-40 కి.మీల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని వివరించారు. కాగా రాష్ట్రంలో కొన్నాళ్లుగా ఉష్ణోగ్రతలు నిప్పుల కుంపటిని తలపిస్తున్నాయి. నైరుతి రుతుపవనాలు ప్రవేశించినా ఇంకా భగ్గుమంటూనే ఉన్నాయి. ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టి వర్షాలు కురవాల్సిన తరుణంలో మరింతగా సెగలు కక్కుతున్నాయి. సాధారణం కంటే 6 నుంచి 10 డిగ్రీలు అధికంగా నమోదవుతూ దడ పుట్టిస్తున్నాయి. ఇలా మూడు వారాలుగా తీవ్ర వడగాడ్పులు వీయని రోజు లేదు. ఏరోజుకారోజే ఉష్ణతాపం తగ్గుతుంది.. ఇక వాతావరణం చల్లబడుతుంది అని ఆశించిన వారికి ఆశాభంగమే అవుతోంది. ఇప్పటికే రాష్ట్రంలో పలుచోట్ల 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. శుక్రవారం అవి మరింత తీవ్రరూపం దాల్చి ఏకంగా 47 డిగ్రీలకు చేరువగా రికార్డయ్యాయి. ఈ వేసవి సీజనులో తొలిసారిగా కాకినాడ జిల్లా సామర్లకోటలో 46.8, తునిలో 46.4



(ఇది సాధారణంకంటే 10.5 డిగ్రీలు అధికం) డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. ఇంకా తూర్పు గోదావరి, ప్రకాశం, విజయనగరం, తిరుపతి, ఎన్టీఆర్, పార్వతీపురం మన్యం, అనకాపల్లి, ఏలూరు, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, పల్నాడు, విశాఖపట్నం తదితర జిల్లాల్లో 45-46 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలతో తీవ్ర వడగాడ్పులు ప్రభావం చూపాయి. శుక్రవారం రాష్ట్రంలో 370 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, 132 మండలాల్లో వడగాడ్పులు వీచాయి.



# అమర్‌నాథ్ హత్యలో రాజకీయ ప్రమేయం లేదు

చెరుకుపల్లి: పదో తరగతి చదువుతున్న ఓ బాలుడిని ఒక యువకుడు పెట్రోలు పోసి సజీవ దహనం చేసిన ఘటనలో ఎలాంటి రాజకీయ ప్రమేయం లేదని బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ స్పష్టం చేశారు. సంచలనం రేపిన ఈ కేసు వివరాలను ఎస్పీ మీడియాకు వెల్లడించారు. ఎస్పీ మాట్లాడూతూ.. "ఉప్పాల అమర్‌నాథ్ (14) బాల్యంలోనే తండ్రి చనిపోగా తల్లి, సోదరి, తాతయ్యతో కలిసి ఉంటున్నాడు. రాజోలు పంచాయతీ రెడ్లపాలేనికి చెందిన యువకుడు వెంకటేశ్వరరెడ్డి ప్రేమ పేరుతో తన అక్కను వేధిస్తున్నాడని అమర్‌నాథ్ నలుగురిలో నిలదీయడంతో అతడిపై కక్ష పెంచుకున్నాడు. అంతేకాకుండా తన అక్కను ఇబ్బంది పెడుతున్నాడని అమర్‌నాథ్ తోటివారితో చెప్పడంతో వెంకటేశ్వరరెడ్డి మరింత కోపం పెంచుకున్నాడు. దీంతో అమర్‌నాథ్‌ను హత్య చేయాలని పథకం వేశాడు. ఇందుకోసం ఒక రోజు ముందే పెట్రోల్ కొన్నాడు. శుక్రవారం ఉదయం 6 గంటల సమయంలో ట్యూషన్‌కు వెళ్తున్న అమర్‌నాథ్‌ను మరికొందరు స్నేహితులతో కలిసి అడ్డగించారు. మొక్కజొన్న బస్తాల లాట్ వెనక అతడి ఒంటిపై పెట్రోల్ పోసి నిప్పంటించాడు. ఈ కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేశాం. మరో నిందితుడు పరారీలో ఉన్నాడు. చాలా జాగ్రత్తగా అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నాం. సాంకేతికంగా అన్ని ఆధారాలు సేకరిస్తున్నాం. హత్య జరిగిన స్థలంలో నిందితుడు ఉపయోగించిన పెట్రోల్ బాటిల్‌ను స్వాధీనం చేసుకున్నాం. బాటిల్‌పై ఉన్న వేలిముద్రలను సేకరించాం. అమర్‌నాథ్ చనిపోయేముందు ఇచ్చిన మరణ వాంగ్మూలాన్ని వీడియో రూపంలో సేకరించాం. ఈ కేసును ఫాస్ట్ ట్రాక్ చేసి దోషులకు శిక్ష పడేలా అన్ని చర్యలు తీసుకుంటాం.

**రాజకీయ ప్రమేయం లేదు..** రాజకీయ ప్రమేయం ఉందంటూ ఈ కేసు గురించి చాలా మంది రకరకాలుగా మాట్లాడుతున్నారు. మృతుడు, నిందితుడి కుటుంబాలకు ఎలాంటి రాజకీయ నేపథ్యం లేదు. ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన ఒక వ్యక్తిగత విషయం మాత్రమే ఇది. దీనికి రాజకీయాలు ఆపాదించడం సరికాదు.

ఘటన జరిగిన వెంటనే పోలీసులు రియాక్ట్ అయ్యారు. కొన్ని గంటల వ్యవధిలోనే నిందితులను అరెస్టు చేశాం. ఈ కేసు దర్యాప్తును పారదర్శకంగా చేస్తున్నాం" అని ఎస్పీ తెలిపారు.



## 'మేమే మీకు ₹లక్ష ఇస్తాం.. వెళ్లిపోండి'

# ఎంపీ మోపిదేవికి నిరసన సెగ

చెరుకుపల్లి గ్రామీణం: బాపట్ల జిల్లా చెరుకుపల్లి మండలం ఉప్పలవారిపాలెంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పదో తరగతి చదువుతున్న ఓ బాలుడిని ఒక యువకుడు పెట్రోలు పోసి సజీవ దహనం చేసిన ఘటన రాజోలులో శుక్రవారం ఉదయం సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే.

జిల్లాలోని ఉప్పలవారిపాలెంలో ఇవాళ బాలుడి అంత్యక్రియలు జరగనున్నాయి. అయితే, బాధిత కుటుంబాన్ని పరామర్శించేందుకు గ్రామానికి వచ్చిన వైకాపా ఎంపీ మోపిదేవి వెంకటరమణకు నిరసన సెగ తగిలింది. గ్రామంలోకి రావొద్దంటూ బాలుడి బంధువులు, స్థానికులు ఎంపీని అడ్డుకున్నారు. కనీసం బాధిత కుటుంబం ఉంటున్న ఇంటివద్దకు కూడా ఎంపీని వెళ్లకుండా అడ్డుకున్నారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు. ఇంత పెద్ద ఘటన జరిగితే తీరిగ్గా పరామర్శించేందుకు వచ్చారా? అంటూ గ్రామస్థులు ప్రశ్నించారు. అయితే, తాను వ్యక్తిగతంగా కలిసి రూ.లక్ష పరిహారం అందించేందుకు వచ్చానని మోపిదేవి చెప్పగా.. "మేమే మీకు రూ.లక్ష ఇస్తాం. దయచేసి ఇక్కడినుంచి వెళ్లిపోండి. లేకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయి" అని గ్రామస్థులు హెచ్చరించారు. దీంతో చేసేదిలేక మోపిదేవి అక్కడినుంచి వెళ్లిపోయారు. అక్కడ పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చేందుకు పోలీసులు రంగంలోకి దిగి పికెట్ ఏర్పాటు చేశారు.

# నేను చెప్పిందే జరిగింది... రేపు సాయిరెడ్డి కిడ్నాప్ కూడా ఉంది



విజయవాడ: విశాఖ ఎంపీ ఫ్యామిలీ కిడ్నాప్‌ను చాలా తేలిగ్గా డీజీపీ చెప్పడం పట్ల సెల్యూట్ చేస్తున్నా అని టీడీపీ ఉత్తరాంధ్ర ఇంఛార్జ్ బుద్ధా వెంకన్న అన్నారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ... కాకతాళీయంగా జరిగినట్టు డీజీపీ చెప్పడం హాస్యాస్పదమన్నారు. భూదంధాల గురించి ఆరు నెలల ముందే తాను చెప్పింది ఇవాళ జరిగిందన్నారు. రేపు సాయిరెడ్డి కిడ్నాప్ కూడా ఉందంటూ వ్యాఖ్యలు చేశారు. భూదందాల వాటాలలో తేడానే ఎంపీ ఫ్యామిలీ కిడ్నాప్ డ్రామా అని అన్నారు. ఎంపీకి ఇబ్బంది కలిగితే డీజీపీ కూడా వెళ్ళాలని.. కానీ వెళ్ళలేదన్నారు. డీపీపీ ఆఫీసులో కూర్చుని రౌడీషీటర్లు చేశారని మాట్లాడటం దుర్మార్గమని మండిపడ్డారు. ఎంపీ ఫ్యామిలీ కిడ్నాప్‌కు వివేకా హత్యకు పోలికలున్నాయన్నారు. ఉత్తరాంధ్ర ఇంఛార్జ్‌గా విశాఖ వెళ్లి ఎంపీ సత్యనారాయణ కుటుంబాన్ని కలువనున్నట్లు తెలిపారు. ఎంపీ ఫ్యామిలీ కిడ్నాప్‌పై సీబీఐ ఎంక్వైరీ వేయాలని డిమాండ్ చేశారు.

**కొడాలి నానిని బొక్కలో వేయడం గ్యారెంటీ...** మాజీ మంత్రి కొడాలి నాని నిన్న సభలో చెప్పినవన్నీ అబద్ధాలే అని అన్నారు. కొడాలి నాని బ్రతుకే లాలూచీ బ్రతుకని విమర్శించారు. రాజశేఖర్‌రెడ్డి వేసిన శిలాఫలకాన్ని పగులకొట్టావని ఎందుకు చెప్పలేదని ప్రశ్నించారు. కొడాలి నాని గడ్డి, అన్నం కాకుండా గుట్కాలు తింటాడన్నారు. గుడివాడలో భూముల కొనుగోలులో కొడాలి నాని పెద్ద కుంభకోణం చేశారని ఆరోపించారు. టీడీపీ ప్రభుత్వం వచ్చాక కొడాలి నానిని బొక్కలో వేయడం గ్యారెంటీ అని స్పష్టం చేశారు. ఓడిపోయినా పవన్, లోకేష్ ప్రజల మధ్య ఉన్నారన్నారు. నల్లబెలూన్లు వదిలిన మహిళలను అరెస్టు చేసి మహిళా పక్షపాతి అంటే ఎలా అని నిలదీశారు. 2005లో రాజశేఖర్‌రెడ్డి కొడాలి నానికి ఉపయోగపడితే.. 2009లో చంద్రబాబును టికెట్ ఎందుకు అడిగారని ప్రశ్నించారు. నిజం మాట్లాడితే తల పగులుతుందనే శాపం ఉందేమో కొడాలి నానికి అంటూ బుద్ధా వెంకన్న యెద్దేవా చేశారు.

# గంటకో నిర్ణయం.. పూటకో మాట.. పవన్‌పై మంత్రి దాడిశెట్టి రాజా ఫైర్

తుని(కాకినాడ జిల్లా): పవన్ కల్యాణ్‌ను ఆ పార్టీ నేతలు మానసిక వైద్యుడి దగ్గరకు తీసుకెళ్లాలని మంత్రి దాడిశెట్టి రాజా ఎద్దేవా చేశారు. శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ "గంటకో విధంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతున్నారు. పవన్ కల్యాణ్ సభలకు జనం రావడం లేదు. ఈ సభలతో పవన్ కల్యాణ్ నవ్వులపాలవుతున్నారు. పవన్‌ను సీఎం కాదు.. ఎమ్మెల్యే చేయడానికి కూడా ప్రజలు సిద్ధం గా లేరు' అంటూ మంత్రి తేల్చి చెప్పారు. "తాను మంచి చేశానని భావిస్తేనే సీఎం జగన్ ఓటు వేయమంటున్నారు. అలా చెప్పే ధైర్యం చంద్ర బాబు, పవన్‌కు ఉందా?. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పవన్ రెండు సభలు ఫ్లాప్ అయ్యాయి. ఎక్కడి పోటీ చేస్తాడో పవన్‌కే క్లారిటీ లేదు. నవ్వు సీఎం అయిపోవాలనుకుంటే అయిపోవు.. ప్రజలు మద్దతిస్తేనే అవుతావు 2014-19లో టీడీపీ, పవన్, బీజేపీ కలిసి మేనిఫెస్టో రూపొందించారు. మేనిఫెస్టో హామీలు అమలు చేయకపోతే చంద్రబాబును నిలదీశావా పవన్" అంటూ దాడిశెట్టి దుయ్యబట్టారు. "పవన్‌ను పార్టీ నాయకులు, కార్యకర్తలు సైక్రియాటిస్ట్‌కు చూపించాలి. చంద్రబాబు ప్యాకేజీ సరిగా



ఇవ్వడేమోనని అసంబద్ధ వ్యాఖ్యలు చేస్తున్నావు. టీడీపీ ప్రభుత్వంలో ఆలయాలను కూల్చేస్తే పవన్ ఎందుకు మాట్లాడలేదు?. కోట్లమందిని చంద్రబాబు మోసం చేస్తే పవన్ ప్రశ్నించలేదు. రాష్ట్రంలో శాంతి భద్రతలు అద్భుతంగా ఉన్నాయి. టీడీపీ పాలనలోని పరిస్థితిని పవన్ కల్యాణ్ గుర్తు తెచ్చుకోవాలి. తన యాజమాని చంద్రబాబు కోసమే పవన్ తాపత్రయం. పవన్ తన నోటికి ఏదితోస్తే అది మాట్లాడుతున్నారు" అని మంత్రి దాడిశెట్టి నిప్పులు చెరిగారు.

# పవన్ స్క్రిప్ట్ అంతా చంద్రబాబుదే: మంత్రి పెద్దిరెడ్డి

అమరావతి: పవన్ కల్యాణ్ స్క్రిప్ట్ అంతా చంద్రబాబుదేనని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మండిపడ్డారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఆలోచన, అవగాహన లేకుండా పవన్ మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు.

"చంద్రబాబును సీఎం చేయాలని పవన్ ప్రయత్నం చేస్తున్నారు. కుప్పంలో చంద్రబాబు సభలో జనాలే లేరు. నేర చరిత్ర చంద్రబాబుకే ఉంది.. టీడీపీలో గూండాలు ఉన్నారు. పంచభూతాల సాక్షిగా అవినీతి లేకుండా పాలన సాగిస్తున్నాం" అని మంత్రి పెద్దిరెడ్డి అన్నారు.



# షర్ట్ బటన్స్ అన్నీ విప్పేసి బాలయ్య హీరోయిన్ ఒళ్లు విరుపు

నందమూరి బాలకృష్ణ 'లెజెండ్' సినిమా తో తెలుగు లో మంచి పాపులారిటీని సొంతం చేసుకున్న ముద్దుగుమ్మ సోనాల్ చౌహాన్. సాధారణంగా హీరోయిన్స్ ఒక్క సూపర్ హిట్ పడితే ఎన్నో ఆఫర్లు దక్కించుకుంటూ ఉంటారు. అలాంటిది సోనాల్ చౌహాన్ కు లెజెండ్ వంటి భారీ విజయం దక్కినా కూడా ఆశించిన స్థాయిలో ఆఫర్లు రాలేదు. తెలుగు లో లెజెండ్ తర్వాత చేసిన సినిమాలు నిరాశ పర్చడం తో తక్కువ సమయంలోనే ఈమె ఫేడ్ అవుట్ అవ్వడం మొదలు అయ్యింది. తెలుగు లో అవకాశాలు తగ్గడంతో ఇతర భాషల్లో సినిమాలు



చేస్తూ అప్పుడప్పుడు టాలీవుడ్ లో కూడా గెస్ట్ రోల్స్ ను పోషిస్తూ సందడి చేస్తూ వస్తున్న సోనాల్ చౌహాన్ అందాల ఆరబోత విషయంలో ఎప్పుడు కూడా ముందు ఉంటుంది. ఈ అమ్మడి ఫోటోలు రెగ్యులర్ గా సోషల్ మీడియాలో వైరల్ అవ్వడం మనం చూస్తూనే ఉన్నాం. స్కిన్ షో విషయంలో ఈ అమ్మడు ఎప్పుడు కూడా మొహమాటం అనేది పడకుండా ఫోటోలను షేర్ చేస్తూ ఉన్న విషయం తెల్సిందే. తాజాగా ఈ అమ్మడు మరోసారి తన అందాలను విందు చేసింది. ఒంటిపై షర్ట్ ఉంది కానీ.. ఆ షర్ట్ మొత్తం బటన్స్ ను విప్పేసి ఒళు విరుస్తూ కవ్విస్తూ ఉంది. ఎద సౌందర్యం ను ఈ అమ్మడు ఎక్స్పోజ్ చేస్తూ ఫోటోకు ఇచ్చిన ఫోజ్ మరోసారి వైరల్ అయ్యింది.

ఆకట్టుకునే రూపంతో పాటు సూపర్ స్కిన్ టోన్ ఈ అమ్మడిది అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తూ ఉన్నారు. నడుము అందం చూపిస్తూ థైస్ తో మతి పోగొడుతున్న సోనాల్ చౌహాన్ అందంకు తగ్గట్లుగా ఆఫర్లు రావడం లేదంటూ సోషల్ మీడియాలో ఆమె అభిమానులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

## చిరుతో స్టెప్పు లేసేందుకు శ్రియ అంత తీసుకుందా..!


ఇష్టం సినిమాతో తెలుగు సినీ రంగంలో అడుగు పెట్టిన శ్రియా శరణ్.. తన అందం అభియనంతో అతి తక్కువ కాలంలోనే స్టార్ హీరోయిన్ గా ఎదిగిపోయింది. పెద్ద పెద్ద స్టార్ హీరోల సరసన కూడా నటిస్తూ.. వరుసగా ఛాన్సులు దక్కించుకుంటూనే వస్తోంది. 2001 సంవత్సరం నుంచి ఇప్పటి వరకు సినిమాల్లో రాణిస్తూనే ఉంది. ఒక్క తెలుగులోనే కాకుండా తమిళ మలయాళ హిందీ కన్నడ చిత్రాల్లోనూ నటించి మెప్పించిందీ బ్యూటీ. సినీ రంగంలో అడుగు పెట్టినప్పుడు ఎలా ఉందో.. ఇప్పుడు కూడా శ్రియ అదే ఫిజిక్ మెయింటెయిన్ చేస్తుంది. ఓ బిడ్డకు జన్మనిచ్చినా తన అందం ఏమాత్రం తగ్గలేదు. సినీ రంగంలో అడుగు పెట్టినప్పుడు ఎలా ఉందో ఇప్పుడు కూడా అలాగే ఉంది. అయితే దాదాపు 20 ఏళ్ల తర్వాత



ఈ క్యూట్ బ్యూటీ మెగాస్టార్ చిరంజీవితో నటించబోతోంది. మెగాస్టార్ చిరంజీవి హీరోగా మెహర్ రమేష్ దర్శకత్వం వహించబోతున్న భోళా శంకర్ సినిమాలో శ్రియా శరణ్ కనిపించబోతుంది. ఆయనతో ఓ స్పెషల్ సాంగ్ లో డ్యాన్స్ చేయబోతుందట. చిరుతో ఆమె స్టెప్పులు వేసేందుకు భారీగానే రెమ్యునరేషన్ కూడా తీసుకుంటుందట. ఒక్క పాటకే 70 లక్షల రూపాయలతో పాటు సెపరేట్ జీఎస్టీ తీసుకుంటుందట. చిరు శ్రియాలతో భోళా శంకర్ సినిమాలో స్పెషల్ సాంగ్ ఉంటుందని తెలిసప్పటి నుంచి మెగా అభిమానులు తెగ ఎగ్జైట్ అవుతున్నారు. అయితే ఈ సినిమాలో చిరంజీవి సరసన తమన్నా నటిస్తున్నారు. స్టార్ హీరోయిన్ కీర్తి సురేష్.. చిరంజీవికి చెల్లెలిగా కనిపించబోతోంది. అనిల్ సుంకర నిర్మిస్తున్న ఈ చిత్రంలో రఘుబాబు మురళీ శర్మ రావు రమేష్ వెన్నెల కిషోర్ ప్రగతి.. తదితరులు కీలక పాత్రల్లో నటించబోతున్నారు. అయితే ఈ సినిమా చిరంజీవి నటించబోతున్న 154 వ సినిమా. అలాగే ఈ చిత్రానికి మహతి స్వర సాగర్ సంగీతం అందిస్తున్నారు. అన్నా చెల్లెలి అనుబంధం నేపథ్యంలో ఈ సినిమా కథ సాగనుంది. తమిళంలో వేదాళం సినిమా సూపర్ హిట్టు కొట్టింది. ఈ చిత్రాన్ని ఎప్పటి నుంచో రీమేక్ చేయాలని ప్రయత్నించగా.. ఇప్పటికి కుదిరింది. అది కూడా మెగాస్టార్ చిరంజీవి ఖాతాలో పడింది. ఈ సినిమా షూటింగ్ మధ్యలో నత్త నడకగా సాగింది. దీంతో ఈ సినిమా ఎప్పుడు విడుదల అవుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. అధికారిక ప్రకటన వచ్చే వరకు ఈ చిత్రం ఎప్పుడు రిలీజ్ అవుతుందో ఎవరికీ తెలియదు.




# అందాలతో పిచ్చెక్కిస్తున్న హీరో గారి భార్య



తెలుగమ్మాయి వితికా శేరు 2008 సంవత్సరంలో కన్నడ సినిమా తో సినీ ఇండస్ట్రీలో అడుగు పెట్టింది. వరుసగా రెండు కన్నడ సినిమాల్లో నటించిన వితికా శేరు ఆ తర్వాత తెలుగు లో 2009 సంవత్సరంలో ప్రేమించు రోజుల్లో సినిమా తో ఎంట్రీ ఇచ్చింది. హీరోయిన్ గా వితికా శేరు ఆశించిన స్థాయిలో సక్సెస్ ను దక్కించుకోలేక పోయింది. ఆ తర్వాత తెలుగు లో కొన్ని సినిమాల్లో నటించినా కూడా పెద్దగా ఈమెకు గుర్తింపు రాలేదు. దాంతో వితికా శేరు మెల్ల మెల్లగా సినిమాల కు దూరం అయ్యింది. 2015 తర్వాత సినిమాల్లో ఈమె కనిపించలేదు. ఆ మధ్య క్యారెక్టర్ ఆర్టిస్టుగా రీ ఎంట్రీ ఇచ్చేందుకు ప్రయత్నం చేసింది. హీరోయిన్ గా ఆశించిన స్థాయిలో సక్సెస్ ను దక్కించుకోలేక పోయిన వితికా శేరు బుల్లి తెర ద్వారా పాపులారిటీ ని సొంతం చేసుకుంది. ముఖ్యంగా ఈ అమ్మడు బిగ్ బాస్ ద్వారా మంచి గుర్తింపును దక్కించుకుంది. ఆ తర్వాత యూట్యూబ్ ఛానల్స్ ద్వారా కూడా తన యొక్క పాపులారిటీని పెంచుకుంటూ ఉంది. హీరో వరుణ్ సందేశ్ ను పెళ్లి చేసుకున్న తర్వాత కూడా ఏదో ఒక రకంగా ఇండస్ట్రీలో కొనసాగుతూనే వస్తోంది. వరుణ్ సందేశ్ యొక్క భార్య అయినప్పటికి కూడా సోషల్ మీడియాలో ఈమె అందాల ఆరబోత విషయంలో ఒక అడుగు ముందుకు వేసి ఆకట్టుకునేందుకు ప్రయత్నాలు చేస్తోంది. తాజాగా ఈ అమ్మడు నడుము అందాన్ని చూపిస్తూ క్లీ వేజ్ షో తో ఆకట్టుకుంది. ఈ రేంజ్ లో అప్పట్లో స్కిన్ షో చేసి ఉంటే తప్పకుండా స్టార్ హీరోల కు జోడీ గా నటించే అవకాశాలు దక్కేది అంటూ కామెంట్స్ వస్తున్నాయి. ఈ రేంజ్ లో స్కిన్ షో చేస్తే ఇప్పటికి అయినా సిరీస్ లో లేదా సీనియర్ హీరోల కు జోడీ గా నటించే అవకాశాలు వస్తాయంటూ కామెంట్స్ వస్తున్నాయి.

# ఎంతమంది హీరోయిన్ల కోసం గుడులు కట్టారో తెలుసా..



హీరోలతో సమానంగా హీరోయిన్స్ కి కూడా అభిమానించే వారు ఉన్నారు. వారి పెర్ఫార్మెన్స్ కి ఫిదా అయిపోయి ఫ్యాన్స్ గామారిపోతారు. కొంతమంది ఫ్యాన్స్ అయితే తమ అభిమాన హీరోయిన్స్ పేర్లు ఫోటోలు పచ్చ బొట్లు కూడా వేయించుకుంటారు. కొంతమంది ఫ్యాన్స్ అయితే ఏకంగా గుడులు కట్టేసి వారిని దేవతలుగా మార్చేస్తూ ఉంటారు. ఈ రకమైన టెంపుల్స్ కట్టే సంస్కృతి తమిళనాట ఎక్కువగా కనిపిస్తూ ఉంటుంది. అక్కడ స్టార్ హీరోయిన్స్ కి ఫ్యాన్స్ ఆలయం కట్టేయడం ఒక అలవాటుగా ఉంది. 90వ దశకంలో కోలీవుడ్ లో స్టార్ హీరోయిన్ గా వెలుగొందిన ఖుష్బూకి ఫ్యాన్స్ తిరుచురాపల్లిలో గుడి కట్టారు. అలా హీరోయిన్స్ కి టెంపుల్ కట్టే అలవాటు మొదలైంది. తరువాత సౌత్ లో స్టార్ హీరోయిన్ గా వెలుగొందిన నగ్మా కి కూడా ఫ్యాన్స్ గుడులు కట్టారు. ఒకప్పుడు గ్లామర్ క్వీన్ గా కుర్రకారుకి నిద్రలేకుండా చేసిన ఈ ముద్దుగుమ్మకి తమిళనాట ఆలయాలు కట్టారు. తరువాత హాట్ బాంబ్ నమితని కూడా అదే స్థాయిలో అభిమానించి కోయంబత్తూర్ తిరునెల్వేలి తో పాటు మరొక ప్రాంతంలో గుడులు కట్టారు. ఇక దేశముదురుతో టాలీవుడ్ లోకి అడుగుపెట్టి తరువాత కోలీవుడ్ లో స్టార్ హీరోయిన్ గా ఎదిగిన ముద్దుగుమ్మ హన్సిక అక్కడ విపరీతమైన ఫ్యాన్ ఫాలోయింగ్ పెంచుకుంది. బొద్దుగుమ్మగా ఉంటూ తమిళ ప్రజల ఆరాధ్యంగా హాన్సిక మారిపోయారు. దీంతో చెన్నై శివారులో ఆమెకు గుడి కట్టారు. స్టార్ హీరోయిన్ కాజల్ కి కూడా తమిళనాట ఫ్యాన్స్ గుడి కట్టేశారు. ఈ జెనరేషన్ లో నిధి అగర్వాల్ కూడా తమిళంలో భూమి ఈశ్వర్ చిత్రాలలో నటించారు. రెండు సినిమాలతోనే ఆమెకి మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ వచ్చేసింది. దీంతో చెన్నైలో ఆమెకి గుడి కట్టేశారు. ఇప్పుడు ఈ జాబితాలోకి సమంత వచ్చి చేరింది. అయితే మిగిలిన హీరోయిన్స్ అందరికి కూడా తమిళనాడులో అభిమానులు గుడులు కట్టారు. కాని సమంతకి ఏపీలో బాపట్ల జిల్లా చుండూరు మండలానికి చెందిన సందీప్ అభిమానంతో తన ఇంటి ఆవరణంలోనే గుడి కట్టారు. మాయోసైటిస్ నుంచి సమంత కోలుకోవాలని పుణ్యక్షేత్రాలు దర్శించారు. ఇప్పుడు గుడి కట్టి సోషల్ మీడియాలో వైరల్ అయ్యారు.

# రేటు పెంచిన గోల్డెన్ బ్యూటీ

వరుస సక్సెస్ లతో మంచి జోరు మీద ఉన్న మలయాళీ ముద్దుగుమ్మ సంయుక్త మీనన్. ఈ అమ్మడు తాజాగా విరూపాక్ష మూవీతో బ్లాక్ బస్టర్ హిట్ ని ఖాతాలో వేసుకుంది. ఈ మూవీతో వరుసగా నాలుగు హిట్స్ తెలుగులో ఆమెకి వచ్చాయి. దీంతో గోల్డెన్ లెగ్ అనే బ్రాండ్ ని అప్పుడే సంయుక్త సొంతం చేసుకున్నారు. ప్రస్తుతం ఈ అమ్మడుకి టాలీవుడ్ లో మంచి డిమాండ్ ఏర్పడింది. టైర్ 2 హీరోలు అందరూ కూడా సంయుక్తని లీడ్ గా తీసుకోవడానికి ఆసక్తి



చూపిస్తున్నారు. పెర్ఫార్మెన్స్ గ్లామర్ రెండింటికి కరెక్ట్ గా మేనేజ్ చేసే కేపబిలిటీ సంయుక్త దగ్గర ఉండటంతో ఆఫర్స్ గట్టిగానే వస్తున్నాయి. ఇక ఈ అమ్మడు డిమాండ్ పెరగడంతో రెమ్యునరేషన్ కూడా అమాంతం పెంచేసిందనే మాట వినిపిస్తోంది. విరూపాక్ష మూవీ వరకు సంయుక్త 50 నుంచి 70 లక్షల వరకు రెమ్యునరేషన్ తీసుకునేది. అయితే డిమాండ్ పెరగడంతో ఒక్కసారిగా 1.50 కోట్లకి రేట్ పెంచేసిందంట. కొత్త ప్రాజెక్ట్స్ కోసం ఈ స్థాయిలో రెమ్యునరేషన్ డిమాండ్ చేస్తున్నారంట. అయితే సంయుక్త లక్ ఫ్యాక్టర్ బాగుండటంతో ఆమెని హీరోయిన్ గా పెట్టుకోవాలని ఎక్కువ ఆసక్తి చూపిస్తున్నారు. దీంతో ఆమె అడిగిన రెమ్యునరేషన్ ఇవ్వడానికి నిర్మాతలు కూడా రెడీ అయిపోతున్నారంట. ప్రస్తుతం ఈ బ్యూటీ కళ్యాణ్ రామ్ పాన్ ఇండి యా మూవీ డెవిల్ లో లీడ్ రోల్ చేస్తోంది. ఈ మూవీ షూటింగ్ దశ లో ఉంది. ఇక ఈ సినిమా సక్సెస్ అయితే పాన్ ఇండియా స్టార్ గా సంయుక్త మారిపోయే అవకాశం ఉందనే మాట వినిపిస్తోంది. రష్మికని దాటుకొని టాప్ చైర్ లోకి ఇప్పుడు సంయుక్త మీనన్ వచ్చేలా ఉందనే టాక్ ఫిలిం నగర్ సర్కిల్ లో నడుస్తోంది. ఇక బింబిసారా మూ వీ సూపర్ సక్సెస్ కావడంతో కళ్యాణ్ రామ్ డెవిల్ తో ఆమెని రిపీ ట్ చేశారు. అలాగే మిగిలిన హీరోలు కూడా సంయుక్తని తమ సినిమా లలో రిపీట్ చేయడానికి ఆసక్తి చూపిస్తున్నారు. సార్ మూవీ తర్వాత కోలీవుడ్ లో కూడా సంయుక్త డిమాండ్ పెరిగిందనే టాక్ వినిపిస్తోంది.

## చీర కట్టులో అనసూయ మేడం జోరు మామూలుగా లేదుగా..!

జబర్దస్త్ మాజీ యాంకర్ అనసూయ మరోసారి తన ఫోటోలతో వార్తల్లో నిలిచింది. ఇద్దరు పిల్లల తల్లి అయినా కూడా హీరోయిన్స్ స్థాయిలో తన ఫోటోలతో జనాల అటెన్షన్ ను దక్కించుకోగల సత్తా ఉన్న ముద్దుగుమ్మ అనసూయ అనడంలో సందేహం లేదు. ఈ ఫోటోలతో మరోసారి అనసూయ ఆ విషయాన్ని నిరూపించుకుంది. ఈమధ్య కాలంలో జబర్దస్త్ కార్యక్రమానికి దూరం అయిన అనసూయ వరుసగా సినిమాల్లో నటిస్తున్న విషయం తెల్సిందే. హీరోయిన్ గా కాకుండా పాత్రకు ప్రాముఖ్యత ఉన్న సినిమాల్లో



నటించడంతో పాటు ప్రత్యేక పాటల్లో మరియు పాత్రల్లో నటించడం ద్వారా అనసూయ మరింత మందికి చేరువ అవుతుంది. అనసూయ ప్రస్తుతం బుల్లి తెరకు దూరంగా ఉంటుంది. ఒక వైపు సినిమాల్లో నటిస్తూనే మరో వైపు బుల్లి తెరపై కూడా నటించాలని అభిమానులు కోరుకుంటున్నారు. సోషల్ మీడియాలో రెగ్యులర్ గా అందాల ఆరబోత చేసే అనసూయ మరోసారి తన చీర కట్టు తో కన్నులు తిప్పుకోకుండా చేసింది. చీర కట్టు లో క్లీవేజ్ షో చేసిన ఈ అమ్మడి యొక్క అందాల ఆరబోతకు ప్రతి ఒక్కరు ఫిదా అవుతున్నారు. ఇంత అందంగా కొన్ని సార్లు హీరోయిన్స్ కూడా కనిపించరు మేడం.. మీరు ఎందుకు స్టార్ హీరోలకు జోడీగా హీరోయిన్ గా నటించడం లేదు అంటూ కొందరు ఫ్యాన్స్ కామెంట్స్ చేస్తూ ఉంటే మరో పదేళ్లు అయినా మీరు ఇంతే అందంగా ఉండాలని కోరుకుంటున్నాం అంటూ కామెంట్స్ చేశారు.




# తెలంగాణలో ఏం జరుగుతుందో ప్రపంచానికి తెలియాలి: కేటీఆర్

వరంగల్: ఉమ్మడి వరంగల్ జిల్లాకు మరిన్ని పరిశ్రమలు తీసుకురావడం ద్వారా పూర్వ వైభవం తీసుకొస్తామని మంత్రి కేటీఆర్ అన్నారు. వరంగల్ జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకురానున్న టెక్స్‌టైల్ పార్కుకు కేటీఆర్ శంకుస్థాపన చేశారు. 261 ఎకరాల్లో రూ.900 కోట్లతో టెక్స్‌టైల్ పార్కు నిర్మాణాన్ని చేపట్టనున్నారు. యంగ్ వన్ కంపెనీ టెక్స్‌టైల్ పార్కును ఏర్పాటు చేయనుంది. భూమిపూజ అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ.. కాకతీయ టెక్స్‌టైల్ పార్కుకు భూములిచ్చిన రైతులకు కేటీఆర్ కృతజ్ఞతలు తెలిపారు. "వరంగల్‌కు పూర్వ వైభవం తీసుకొస్తాం. పట్టుపట్టి మరీ వరంగల్‌లో కాకతీయ టెక్స్‌టైల్ పార్కును ఏర్పాటు చేస్తున్నాం. నైపుణ్యం ఉన్న నేతన్నలు ఉన్నారు కాబట్టే వరంగల్‌కు మంచి పేరు వచ్చింది. వరంగల్ జిల్లాలో నాణ్యమైన పత్తి పండుతోంది. గణేశా కంపెనీ ఇప్పటికే రూ.600 కోట్ల పెట్టుబడి పెట్టింది. గణేశా కంపెనీలో వెయ్యి మందికి ఉద్యోగాలు వచ్చాయి. యంగ్ వన్ కంపెనీలో మొత్తంగా 11 పరిశ్రమలు వస్తాయి. తద్వారా వేల ఉద్యోగాలు వస్తాయి. ఇక్కడ నిర్మించే పరిశ్రమల్లో 99 శాతం ఉద్యోగాలు స్థానికులకే వస్తాయి.

మేడిన్ వరంగల్ దుస్తులు అనేక దేశాలకు వెళ్తాయి. యంగ్ వన్ కంపెనీ కొరియాలో పెద్ద పరిశ్రమ. తెలంగాణలో ఏం జరుగుతుందో ప్రపంచానికి తెలియాలి. మన దేశంలో వ్యవసాయ, టెక్స్‌టైల్ రంగంలో విస్తృత అవకాశాలున్నాయి. టెక్స్‌టైల్ రంగంలో మనకంటే బంగ్లాదేశ్, శ్రీలంక ముందున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఇటీవలే మేల్కొని పీఎం మిత్ర పథకం తీసుకొచ్చింది. వరంగల్ జిల్లాలో రానున్న 3 కంపెనీల ద్వారా 33 వేల ఉద్యోగాలు వస్తాయి. చల్లా ధర్మారెడ్డి చొరవ వల్లే కాకతీయ టెక్స్‌టైల్ పార్కు వచ్చింది. పరకాలలో ధర్మారెడ్డిపై పోటీ చేయాలంటే భయపడుతున్నారు. నియోజకవర్గాలు మార్చుకొని మరీ వేరేచోటుకు వెళ్లిపోతున్నారు.

# హరగోపాల్ సహా ఇతరులపై ఉపా కేసు ఎత్తివేత: సీఎం కేసీఆర్ ఆదేశాలు



హైదరాబాద్: హక్కుల నేత ప్రొఫెసర్ హరగోపాల్ సహా ఇతరులపై చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం(ఉపా) కింద నమోదు చేసిన కేసులను ఎత్తివేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయించారు. వెంటనే కేసుల ఎత్తివేతకు తగు చర్యలు తీసుకోవాలని డీజీపీ అంజనీకుమార్‌ను సీఎం ఆదేశించారు. మావోయిస్టు కార్యకలాపాలకు సహకరిస్తున్నారన్న ఆరోపణలపై హరగోపాల్‌తో పాటు ఇతర ప్రజాసంఘాల నేతలపై ఉపా చట్టం కింద తెలంగాణ పోలీసులు కేసు నమోదు చేశారు.

ఎలాంటి తప్పు చేయకపోయినా, ఆధారాలు లేకుండా ఉపా చట్టం కింద కేసు నమోదు చేయడం దారుణమని.. వెంటనే వారిపై నమోదు చేసిన కేసు ఎత్తివేయాలని రాజకీయపార్టీలు, ప్రజాసంఘాలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాయి. ఈ నేపథ్యంలో అన్ని అంశాలను పరిశీలించిన కేసీఆర్.. హరగోపాల్ సహా ఇతరులపై నమోదు చేసిన కేసుల ఎత్తివేతకు నిర్ణయం తీసుకున్నారు.

# కంబైన్డ్ గ్రాడ్యుయేషన్ పరేడ్‌లో పాల్గొన్నందుకు సంతోషంగా ఉంది



హైదరాబాద్: నగర పర్యటనలో భాగంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దుండిగల్ ఎయిర్ ఫోర్స్ అకాడమీ కంబైన్డ్ గ్రాడ్యుయేట్ పరేడ్‌లో పాల్గొన్నారు. కంబైన్డ్ గ్రాడ్యుయేట్ పెరేడ్‌కు రివ్యూయింగ్ ఆఫీసర్‌గా రాష్ట్రపతి హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రాడ్యుయేట్స్ నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం గ్రాడ్యుయేట్స్‌ను ఉద్దేశించి ద్రౌపది ముర్ము మాట్లాడుతూ.. కంబైన్డ్ గ్రాడ్యుయేషన్ పరేడ్‌లో పాల్గొన్నందుకు సంతోషంగా ఉందన్నారు. ధైర్యవంతులు అయిన క్యాడెట్లను కన్న తల్లిదండ్రులకు శుభాకాంక్షలు తెలియజేశారు. శిక్షణ పూర్తి చేసుకున్న క్యాడెట్లు దేశం కోసం ప్రాణాలు అర్పించిన వారి సేవలు గుర్తుంచుకోవాలని తెలిపారు. టర్కీలో జరిగిన భూకంపంలో కూడా ఇండియన్ ఎయిర్ ఫోర్స్ బాగా పనిచేసిందని కొనియాడారు. కోవిడ్ లోనూ చాలా అద్భుతంగా పనిచేసిందన్నారు. సవాళ్ళను ఎదుర్కొనేందుకు నూతన సాంకేతికతను అందిపుచ్చుకోవాలని సూచించారు. ఏప్రిల్‌లో సుఖాయ్ జెట్‌లో ప్రయణించినట్లు తెలిపారు. ఇది తనకు చాలా గొప్ప అనుభూతిని ఇచ్చిందన్నారు. ఫైటర్ జెట్ ఫైలెట్లులో మహిళలు కూడా అధికంగా ఉండటం సంతోషదాయకమని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. కాగా.. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హైదరాబాద్‌లో పర్యటన నిమిత్తం శుక్రవారం సాయంత్రం నగరానికి వచ్చారు. ఈ సందర్భంగా బేగంపేట్ ఎయిర్‌పోర్ట్‌లో సీఎం కేసీఆర్, గవర్నర్ తమిళిసై, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి బేగంపేట ఎయిర్‌పోర్టులో రాష్ట్రపతికి ఘన స్వాగతం పలికారు. సీఎంతో పాటు మంత్రుల, ఎంపీలు, ఎమ్మెల్యేలు స్వాగతం పలికారు. రాష్ట్రపతి నేరుగా ఎయిర్‌పోర్టు నుంచి రాజ్‌భవన్‌కు వెళ్లారు. రాత్రి ఆమె అక్కడే బస చేశారు.

# ఏసీబీ ట్రాప్.. లంచం తీసుకుంటూ పట్టుబడ్డ తెలంగాణ వర్సిటీ వీసీ రవీందర్ గుప్తా?

హైదరాబాద్: తెలంగాణ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ రవీందర్ గుప్తా ఏసీబీ ఉచ్చులో పడ్డారు. శనివారం రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని ఆయన్ని ఏసీబీ అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. హైదరాబాద్‌లోని తన ఇంట్లోనే లంచం తీసుకుంటూ ఆయన పట్టుబడినట్లు సమాచారం. గత కొంతకాలంగా తెలంగాణ యూనివర్సిటీలో అక్రమాలు జరుగుతున్నాయన్న ఆరోపణల నేపథ్యంలో ఏసీబీ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాలు యూనివర్సిటీలో సోదాలు నిర్వహించాయి. ఆరోపణలకు తగ్గట్లే అక్రమ నియామకాలు, అక్రమ లావాదేవీలు జరిగినట్లు ఏసీబీ నిర్ధారించుకున్నట్లు తెలుస్తోంది. అయితే.. తాజాగా పరీక్షా కేంద్రం ఏర్పాటు కోసం ఓ వ్యక్తి నుంచి డబ్బులు డిమాండ్ చేశాడు వీసీ రవీందర్ గుప్తా. ఈ క్రమంలో బాధితుడు శంకర్ ఏసీబీని ఆశ్రయించగా.. ఏసీబీ వల పన్నింది. శనివారం ఉదయం హైదరాబాద్‌లోని తన నివాసానికి వెళ్లి బాధితుడు డబ్బు ఇవ్వబోయాడు. ఆ టైంలో రూ. 50 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డాడు రవీందర్ గుప్తా. అనంతరం ఆయన ఇంట్లో తనిఖీలు నిర్వహించి కీలక పత్రాలను స్వాధీనం చేసుకోవడంతో పాటు ఆయన్నీ అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. దీనిపై ఏసీబీ నుంచి స్పష్టమైన ప్రకటన వెలువడాల్సి ఉంది.

# వరంగల్ బీఆర్ఎస్‌లో వర్గపోరు.. మంత్రి కేటీఆర్ పర్యటనలో బట్టబయలు

వరంగల్: ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ వరంగల్ పర్యటన సందర్భంగా బీఆర్ఎస్‌లో వర్గ విభేదాలు భగ్గుమన్నాయి. నేతల మధ్య ఫ్లెక్సీ వార్‌కు తెరలేచింది. మంత్రి కేటీఆర్‌ను ఆహ్వానిస్తూ వరంగల్ తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్, మేయర్ గుండు సుధారాణి పోటీ పడి పోటాపోటీగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. అలాగే మేయర్ వర్గానికి చెందిన డిప్యూటీ మేయర్ రిజ్వానా బేగం ఫ్లెక్సీలను గుర్తుతెలియని వ్యక్తులు తొలగించారు. ఇంకో వైపు ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ఫ్లెక్సీలపై మరో వర్గం ఫ్లెక్సీలు కడుతుండగా కొందరు కార్యకర్తలు అడ్డుకున్నారు. ఇదిలా ఉండగా కొన్నిచోట్ల ఎమ్మెల్యే ఫ్లెక్సీలను చించివేశారు. దీంతో వరంగల్ తూర్పు నియోజకవర్గంలో ఫ్లెక్సీల రగడ కొనసాగుతోంది. కాగా.. గతకొద్దిరోజులుగా వరంగల్ తూర్పునియోజకవర్గంలో వర్గపోరు కొనసాగుతోంది.

అయితే మంత్రి కేటీఆర్ పర్యటన సందర్భంగా నేతల మధ్య వర్గపోరు బహిర్గతమైంది. ఈరోజు మంత్రి పర్యటన నేపథ్యంలో నగరమంతా బీఆర్ఎస్ శ్రేణులు ఫ్లెక్సీల మయం చేశారు. ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్ భారీ ఎత్తున ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. అదే విధంగా మేయర్, డిప్యూటీమేయర్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. అయితే మేయర్, ఎంపీ వర్గీయుల ఫ్లెక్సీలను రాత్రికి రాత్రే గుర్తుతెలియని వ్యక్తులు చించేశారు. అయితే ఎమ్మెల్యే నరేందర్ వర్గీయులే ఇతర నేతల ఫ్లెక్సీలను చించివేశారని ప్రచారం జరుగుతోంది. ఇది ముమ్మాటికి ఎమ్మెల్యే వర్గీయుల పనే ని మేయర్, డిప్యూటీమేయర్ ప్రత్యక్షంగా ఆరోపిస్తున్నారు. ఎమ్మెల్యే ఏకపక్షంగా వ్యవహరిస్తూ తమ ఫ్లెక్సీలను చించివేయించారని మేయర్ వర్గం ఆరోపిస్తోంది. మరోవైపు వద్దిరాజు రవిచంద్ర కూడా కేటీఆర్ రాక సందర్భంగా భారీగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయగా.. వాటిని కూడా చించివేశారు. ఈవిధంగా నేతల మధ్య ఫ్లెక్సీల వార్ ఇంకా కొనసాగుతోంది.




మేరీలాండ్: మరికొన్ని రోజుల్లో అమెరికాలో పర్యటించనున్న భారత ప్రధాని నరేంద్ర మోదీకి ఘన స్వాగతం పలికేందుకు అక్కడి ప్రవాస భారతీయులు ఏర్పాట్లు చేస్తున్నారు. అందుకోసం వారు ఎంతో ఉత్సాహంగా ఎదురుచూస్తున్నారు. ఈ సమయంలో ఓ ప్రవాస భారతీయుడు ప్రధానిపై ఉన్న అభిమానాన్ని చాటుకున్నారు. మేరీలాండ్‌కు చెందిన రాఘవేంద్ర అనే వ్యక్తి కారు నంబర్ ప్లేట్‌పై 'NMODI' అని రాయించారు. ఇది నమోమోదీకి షార్ట్‌కట్. 'నేను 2016లోనే ఈ ప్లేట్‌ను సిద్ధం చేసుకున్నాను. ప్రధాని మోదీ నాకొక స్ఫూర్తి. సమాజం, దేశం, ప్రపంచం కోసం ఏదైనా మంచి చేయాలనే ప్రేరణను ఆయన నుంచి పొందాను. ఇప్పుడు ప్రధాని ఇక్కడికి వస్తున్నారు. ఆయన్ను ఆహ్వానించేందుకు ఎదురుచూస్తున్నాను'అని రాఘవేంద్ర అన్నారు. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, ఆయన సతీమణి జిల్ బైడెన్ ఆహ్వానం మేరకు మోదీ జూన్ 21 నుంచి 24 వరకు అక్కడ పర్యటించనున్నారు. ఈ సందర్భంగా అమెరికా కాంగ్రెస్‌లో రెండోసారి ప్రసంగిస్తారు. ఈ క్రమంలో శుక్రవారం శ్వేతసౌధం వెలుపల త్రివర్ణ పతాకం రెపరెపలాడింది. దీనిపై న్యూజెర్సీకి చెందిన ప్రవాస భారతీయుడు జెసల్ నార్ మాట్లాడుతూ.. 'శ్వేతసౌధం వద్ద జాతీయ పతాకం రెపరెపలాడటం గర్వంగా, గౌరవంగా ఉంది'అని అన్నారు. టైమ్స్ స్క్వేర్, నయాగరా ఫాల్స్ వంటి ప్రసిద్ధ ప్రాంతాల నుంచి ప్రవాస భారతీయులు స్వాగత సందేశాలు పంపుతున్నారు. ఉన్నత విద్య కోసం వెళ్లిన యువత.. ప్రధానిని ఆహ్వానిస్తూ సామాజిక మాధ్యమాల్లో స్వాగత సందేశాలు పెడుతున్నారు. ఇదిలా ఉంటే.. ఈ పర్యటన నేపథ్యంలో భారత్–అమెరికా సంబంధాలు మరో స్థాయి చేరుకుంటాయని అమెరికాలోని భారత దౌత్యవేత్త తరణ్ జిత్‌సింగ్ సందు అన్నారు.

# పొంగులేటి కాంగ్రెస్‌లో చేరిక తేదీ ఖరారు.. సభ ఎక్కడంటే?



హైదరాబాద్: మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్‌లో చేరడం ఖాయమైంది. ఆయన ఏ రోజు కాంగ్రెస్‌లో చేరబోతున్నారనే దానిపై కూడా స్పష్టత వచ్చింది. ఈ నెలాఖరున అంటే జూన్ 30న పొంగులేటి కాంగ్రెస్ కండువా కప్పుకోనున్నారు. పొంగులేటితో పాటు జూపల్లి కృష్ణారావు తదితరులు కాంగ్రెస్ గూటికి చేరనున్నారు. ఈనెల 22న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో పొంగులేటి, జూపల్లి, కూచూకుళ్ళ దామోదర రెడ్డి, పిడమర్తి రవి తదితరులు భేటీ కానున్నారు. భేటీ అనంతరం తెలంగాణలో వేరువేరు బహిరంగ సభల్లో పలువురు నేతలు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోనున్నారు. ఈనెల 30న ఖమ్మంలో భారీ బహిరంగ సభకు కాంగ్రెస్ ఏర్పాట్లు చేస్తోంది. ఖమ్మం సభలో పొంగులేటి అండ్ టీమ్ కాంగ్రెస్ కండువా కప్పుకోనుంది. ఈ సభకు రాహుల్ గాంధీ లేదా ప్రియాంక గాంధీ హాజరయ్యే అవకాశం ఉంది.

పొంగులేటితో పాటు పాయం వేంకటేశ్వర్లు, కోరం కనకయ్య, పిడమర్తి రవి, తెల్లం వెంకట్రావు, బానోత్ విజయాబాయి, కోటా రాంబాబు, మద్దినేని బేబీ స్వర్ణ కుమారి, కొండూరి సుధాకర్, జారే ఆదినారాయణ, దొడ్డా నగేష్ యాదవ్ హస్తం పార్టీలో చేరనున్నారు. అలాగే మహబూబ్‌నగర్ బహిరంగ సభలో జూపల్లి అండ్ టీమ్ కాంగ్రెస్ కండువా కప్పుకోనుంది. జూపల్లితో పాటు దామోదర్ రెడ్డి, మేఘారెడ్డి, కుచ్చారెడ్డి, తదితరులు కాంగ్రెస్‌లో చేరనున్నారు.

# మణిపూర్‌లో చల్లారని హింస.. బీజేపీ నేతల ఇళ్లను తగలబెడుతున్న అల్లరి మూకలు



ఈశాన్య రాష్ట్రం మణిపూర్‌లో పరిస్థితులు రోజురోజుకూ మరింత ఉద్రిక్తంగా మారుతున్నాయి. గత కొన్ని రోజులుగా రెండు తెగల మధ్య చెలరేగిన ఘర్షణలు కొనసాగుతున్నాయి. ఈ హింసకు ఇప్పడప్పుడే తెరపడేలా కనిపించడం లేదు. రాష్ట్రంలో శాంతిభద్రతలు రోజురోజుకీ మరింత క్షీణిస్తున్నాయి. తాజాగా శుక్రవారం రాత్రి రాష్ట్రంలో మరోసారి హింస చెలరేగింది. క్వక్తా, కాంగ్పై ప్రాంతాల్లో ఘర్షణలు చోటు చేసుకున్నాయి. తాజా ఘర్షణలతో శనివారం తెల్లవారుజామున వరకు కాల్పుల ఘటనలు చోటు చేసుకున్నాయి. నిరసనకారులు భారీ సంఖ్యలో గుంపుగా తరలివచ్చి విధ్వంసానికి యత్నించడం వంటి పలు ఘటనలు చోటు చేసుకున్నాయని ఆర్మీ, పోలీసు అధికారులు తెలిపారు. స్థానికంగా ఉన్న అడ్వాన్స్ హాస్పిటల్ సమీపంలోని ప్యాలెస్ కాంపౌండ్ వద్ద ఓ అల్లరి మూక నిప్పంటిచడానికి ప్రయత్నించిందని.. ఆ మూకలో దాదాపుగా వెయ్యిమంది వరకు ఉన్నారని అధికారులు తెలిపారు. బాష్పవాయువు, రబ్బర్ బుల్లెట్లను ప్రయోగించి ఆందోళనకారులను చెదరగొట్టినట్లు చెప్పారు. ఈ ఘటనలో ఇద్దరు పౌరులు గాయపడినట్లు చెప్పారు. మణిపూర్ యూనివర్సిటీ సమీపంలో కూడా కొందరు గుంపుగా ఏర్పడి విధ్వంసానికి యత్నించినట్లు తెలిపారు. మరోవైపు సుమారు 300 నుంచి 400 మంది గుంపుగా వచ్చి ఇంఫాల్ పశ్చిమ జిల్లాలోని ఇరింగ్బామ్ పోలీస్ స్టేషన్ లో ఉన్న ఆయుధాలను లూటీ చేసేందుకు విఫలయత్నం చేసినట్లు అధికారులు తెలిపారు. ఆర్మీ, అస్సాం రైఫిల్స్, రాపిడ్ యాక్షన్ ఫోర్స్, రాష్ట్ర పోలీసు యంత్రాంగం సంయుక్తంగా ఈ దాడుల్ని భగ్నం చేసినట్లు వెల్లడించారు. ఇంఫాల్ తూర్పు జిల్లాలో అర్ధరాత్రి వరకు ఫ్లాగ్ మార్చ్ చేపట్టినట్లు తెలిపారు. మరోవైపు ఆందోళన కారులు స్థానికంగా ఉన్న బీజేపీ నేతల ఇళ్లపై దాడులకు పాల్పడుతున్నారు. రాష్ట్ర మంత్రులు, కేంద్ర మంత్రులు సహా, స్థానిక ఎమ్మెల్యేలు, పలువురు బీజేపీ నేతల ఇళ్లపై పెట్రో బాంబులతో దాడి చేసి ధ్వంసం చేస్తున్నారు. రెండు రోజుల క్రితం (బుధవారం రాత్రి) ఆ రాష్ట్రంలోని ఏకైక మహిళా మంత్రి ఇంటికి ఆందోళన కారులు నిప్పు పెట్టిన విషయం తెలిసిందే. గురువారం రాత్రి కూడా ఆందోళన కారులు చెలరేగిపోయారు. ఇంఫాల్‌లోని కేంద్ర విదేశాంగ సహాయ మంత్రి ఆర్కే రాజన్ సింగ్ ఇంటిపైకి గురువారం రాత్రి అల్లరి మూక బాంబు దాడికి పాల్పడింది. భద్రతా సిబ్బంది, అగ్నిమాపక శాఖ సకాలంలో మంటలను ఆపడంతో పెద్ద నష్టం తప్పింది. శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత కూడా ఇంఫాల్ వెస్ట్ లోని రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు శారదా దేవి నివాసం వద్ద ఆందోళన కారులు విధ్వంసానికి యత్నించారు. సైన్యం, పోలీసు యంత్రాంగం వారిని అడ్డుకుంది. మణిపూర్‌లో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం గత నెలలో మైతీ సామాజిక వర్గానికి ఎస్టీ హోదా ప్రకటించింది. అయితే నాగా, కుకీ సామాజిక వర్గాలకు చెందిన వారు ప్రభుత్వ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ నేపథ్యంలో మే 3న మైతీ, కుకీ వర్గాల మధ్య ఘర్షణలు మొదలయ్యాయి. నాటి నుంచి గత నెలకుపైగా కొనసాగుతున్న అల్లర్లు, హింసాత్మక సంఘటనల్లో సుమారు 120 మందికిపైగా పౌరులు మరణించారు. 350 మందికి పైగా గాయపడ్డారు. 50 వేల మందికిపైగా ప్రజలు నిరాశ్రయలయ్యారు.

# ఆ విషయంలో గుజరాత్ కంటే తెలంగాణకే ఎక్కువ నిధులు: కిషన్ రెడ్డి



హైదరాబాద్: తెలంగాణ అభివృద్ధిలో కేంద్ర ప్రభుత్వ పాత్ర తెలియజేస్తూ 'రిపోర్టు టు పీపుల్ పేరుతో' కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పవర్ పాయింట్‌ప్రజంటేషన్ ఇచ్చారు. ఆర్టీసి కళ్యాణ మండపంలో గత తొమ్మిదేళ్లలోతెలంగాణకు కేంద్ర ఇచ్చిన నిధులపై ప్రజలకు నివేదిక అందించారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. ఇది రాజకీయ పార్టీ కార్యక్రమం కాదని, 9 ఏళ్లుగా తెలంగాణకు కేంద్రం ఇచ్చిన నిధుల వివరాలను తెలియజేయడమే ఈ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఉద్దేశ్యమని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వానికి వివిధ కేంద్ర ప్రభుత్వ సంస్థల ద్వారా, ఏజెన్సీల ద్వారా ఎంత అప్పులు ఇచ్చామో ప్రజల ముందు పెడుతున్నట్లు చెప్పారు.

కేంద్రం చెప్పే లెక్కలు–రాష్ట్ర చెబుతున్న లెక్కలపై క్లారిటీ ఇచ్చారు. తెలంగాణ అభివృద్ధి కోసం మోదీ సర్కార్ నిరంతరం సహకరించిందని కిషన్ రెడ్డి తెలిపారు. గతంతో పోలిస్తే కేంద్రం నుంచి రాష్ట్రానికి వచ్చే పన్నుల శాతం పెరిగిందని అన్నారు. కేంద్రం నుంచి వివిధ శాఖలు 5 లక్షల కోట్లు వచ్చాయని పేర్కొన్నారు. 'మోదీ ప్రభుత్వం ఏర్పడ్డాక పెద్దపల్లి మినహా అన్ని జిల్లాలకు నేషనల్ హైవేల అనుసంధానం చేశారు . వీటి కోసం 1లక్ష 8వేల కోట్ల రూపాయలు కేంద్రం ఖర్చు చేసింది. హైదరాబాద్‌కు గేమ్ చెంజర్‌గా కానున్న రీజినల్ రింగ్ రోడ్డుకు కేంద్రం అనుమతించింది. దీనికి సంబంధించిన భూ సేకరణ తొందరగా పూర్తీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి పదే పదే విజ్ఞప్తి చేస్తున్నాం' అని కిషన్ రెడ్డి తెలిపారు.

# విదేశాల్లో నాకు మైనింగ్ వ్యాపారాలా? అవాస్తవం: ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి



హైదరాబాద్: భారాస ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి ఇంట్లో వరుసగా మూడు రోజులు ఐటీ అధికారులు నిర్వహించిన సోదాలు ముగిశాయి. ఎమ్మెల్యేకు చెందిన కంపెనీలు, వాటి ఆర్థిక లావాదేవీలపై వివరాలు సేకరించినట్లు సమాచారం. తన ఇళ్లు, కార్యాలయాల్లో ఐటీ అధికారులు సోదాలు నిర్వహించడంపై పైళ్ల శేఖర్‌రెడ్డి స్పందించారు. కక్షసాధింపు చర్యల్లో భాగంగానే ఐటీ దాడులు జరిగాయని ఆరోపించారు. ఐటీ అధికారులకు పూర్తిగా సహకరించినట్లు చెప్పారు. మొదటిరోజు గంటన్నరలోనే ఐటీ దాడులు పూర్తయ్యాయి.. కానీ అధికారులు కావాలనే మూడు రోజులు కాలయాపన చేశారన్నారు. "నాపై వస్తున్న ఆరోపణలు అవాస్తవం. పాతికేళ్లుగా స్థిరాస్తి వ్యాపారం చేస్తున్నాను. విదేశాల్లో మైనింగ్ వ్యాపారాలు ఉన్నాయన్నది అవాస్తవం. ఐటీ అధికారులు నాకు నోటీసు ఇచ్చారు. విచారణ కోసం ఎప్పుడు పిలిచినా వెళ్లేందుకు సిద్ధం. అనుకూలమైన సమాచారం రాకపోవడంతో ఐటీ అధికారులు నిరుత్సాహంగా వెనుదిరిగారు" అని పైళ్లశేఖర్ రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే బంధువుల వ్యాపార లావాదేవీలతోపాటు, వారి ఇళ్లలోనూ సోదాలు జరిపిన ఐటీ అధికారులు.. పలు కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

Printed, Published and owned by VISHWANATH V, Printed at Ratan Graphics D.No. 2-3-703/7, Ameerpet, Hyderabad - 500013 Telangana State and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State. Editor : V. VISHWANATH, M.A. Journalism
Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : garudavartha@gmail.com